ఆదివారం

ప్రజాశక్తి

11 నవంబర్, 2001

ప్రపంచ 'బాబు' విధానాలకు ప్రతిఘటన



Decora
USHA
The undisputed leader in fans.
డివిజనల్ ఆఫీసు : ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్, 13/2 రసూల్‌పుర, సికింద్రాబాద్-500003, ఫోన్స్ : 7904873, 7903513,
ఫ్యాక్స్ : 040-7901285. బ్రాంచి ఆఫీసు : 69-1-3, పటమట, విజయవాడ, ఫోన్ : 481538. కంపెనీ షోరూంలు : హైదరాబాద్ - కోటి,
ఫోన్ : 4745694, దిల్‌షుక్‌నగర్-ఫోన్ : 4069589, విజయవాడ - ఫోన్ : 563636, విశాఖపట్టణం-ఫోన్ : 502377,
సర్వీస్ సెంటర్‌లు : హైదరాబాద్ ఫోన్ : 6316661, విజయవాడ-ఫోన్ : 433127, విశాఖపట్టణం-ఫోన్ : 725220.

దీపావళి శుభాకాంక్షలతో...

నవంబర్ సంచికతో ప్రారంభం

వింతలు విశేషాల విజ్ఞాన మాసపత్రిక

వండర్ న్యూస్

అమూల్య సమాచారం
అంతరిక్ష విజ్ఞానం

మీరు నమ్మలేని నిజాలు
మమ్మీల కథలు

ఈ విశ్వంలో మీకు తెలియని
వింతలు - విశేషాలు

ఉపాధి అవకాశాలను సూచించే
సెల్ఫ్ ఎంప్లాయిమెంట్

నమ్మశక్యంగాని విశేషాలు
వరల్డ్ వండర్స్

అవునా కాదా అనిపించే శీర్షిక
నమ్మండి నమ్మకపోండి

అంతేనా మీరిష్టపడే బోనస్ బుక్
చైల్డ్ సైకాలజీ

ఇంకా వింత అలవాట్లు, విచిత్ర రికార్డులు...
ఎన్నో ప్రయోజనకర అంశాలు... మరెన్నో అద్భుత విశేషాలు... కడుపుబ్బ నవ్వించే టిట్‌బిట్స్...
ఔరా అనిపించే నాటీ బిట్స్
మీకు నచ్చే అన్ని రకాల శీర్షికలతో సర్వాంగ సుందరంగా ముస్తాబై మీ ముందుకు వస్తోంది...

సాధారణ సెక్స్ సమస్యలు, సుఖవ్యాధుల గురించి విజ్ఞానాన్ని అందించే మీకు నచ్చే మీరు మెచ్చే శీర్షిక
మీకోసంలో
ప్రముఖ లైంగిక వ్యాధుల నిపుణులు
డా. **కౌతరపు రవీంద్ర** ఎం.బి.బి.ఎస్., డి.వి.
కె.ఆర్. పాలీక్లినిక్ అండ్ ఎయిడ్స్ రీసెర్చి సెంటర్,
నక్కలరోడ్, విజయవాడ - 2 వారి నుండి
మీ సందేహాలకు సమాధానాలు రూపంలో చదవండి.

వివరాలకు సంప్రదించండి
B.V. Sudhakar Reddy, Circulation Manager
భావన పబ్లికేషన్స్
29-27-22, సూర్యనారాయణ వీధి,
సూర్యారావుపేట, విజయవాడ - 520 002
ఫోన్స్ : 0866-624392. సెల్: (0) 98480 23205

41745
958945
P.Jalakaya Rao



నీతి - అవినీతి

ఏది నీతి? ఏది అవినీతి? నీతికి అవినీతికి తేడా ఏమిటి? చూడగానే ఏమిటీ అర్థం లేని ప్రశ్న అని అనిపిస్తుంది కదూ. కాని నిజానికి ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం చాలా కష్టం. ఉదాహరణకు మీరు స్కూటర్ మీద వేగంగా వెళ్తున్నారనుకోండి. జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ పడగానే సడెన్ బ్రేక్ వేసి ఆపు చేస్తారు. కాని మీ వెనుకనే మరో వాహన చోదకుడు దూసుకుపోతాడు. అతగాడిని చూసి నిబంధనలను అతిక్రమిస్తున్నాడు అని మీరనుకుంటారు. కాని వాడు వెళ్ళాడు నేను వెళ్తే పోలా అనుకొని మీరూ రెడ్‌లైట్‌ను పట్టించుకోకుండా వెళ్ళిపోయారనుకోండి. అప్పటిదాకా ఎదుటివాడు తప్పు చేశాడనుకుంటున్న మీరే అది తప్పు కాదన్న నిర్ణయానికొస్తారు. ఒకవేళ మీరు సిగ్నల్ దగ్గర బుద్ధిగా నిలబడి ఉండగా దూసుకుపోయిన వ్యక్తిని ట్రాఫిక్ పోలీసు పట్టుకొని ఫైన్ వేశాడనుకోండి అప్పుడు నిలబడిపోవడమే నూటికి నూరుపాళ్ళు కరెక్టు అని అనుకుంటారు. అందువల్ల తప్పు ఒప్పు అనేవి సందర్భాన్ని బట్టి మారిపోతుంటాయి.

ఇదే విషయాన్ని మరో రకంగా కూడా చూడవచ్చు. వీధిలో ఒక మహిళ వెళ్తూ ఉంటుంది. వెనకాలే ఓ దొంగ ఆమె మెడలో గొలుసు లాగేసుకొని పారిపోతుంటాడు. ఆమె 'దొంగ, దొంగ, పట్టుకోండి' అని కేకలు వేస్తుంటుంది. అయినా ఆ ప్రక్కనే వున్న మీరు ఏ మాత్రం పట్టించుకోరు. నాకెందుకొచ్చిన తంటా అని మీదారిన మీరు పోతూ ఉంటారు. ఇంతలోనే యాక్సిడెంట్‌కు గురయిన ఓ వ్యక్తి రోడ్డు మీద పడికొట్టుకుంటూ ఉంటారు. అప్పుడూ మీరు యధాప్రకారం మిన్నకుంటారే తప్ప అయ్యో పాపం అని కూడా అనుకోరు. కాని ఇందాక గొలుసు కాజేసిన దొంగ గాయపడిన ఆ వ్యక్తిని భుజాన వేసుకొని ఆసుపత్రికి చేరుస్తాడు. అప్పుడు ఎవరు మంచివారు. ఆ దొంగా, మీరా అని ప్రశ్నించుకోవాలి.

అట్లాగే ఒరిజినల్ విలువలు కూడా ఆ తర్వాత్తర్వాత మారిపోతుంటాయి. తారుమారవుతుంటాయి. ఉదాహరణకు సత్యహరిశ్చంద్ర, చింతామణి నాటకాలనే తీసుకోండి. సత్యహరిశ్చంద్ర నాటకాన్ని కచ్చితంగా ఓ వడ్డీ వ్యాపారి రాయించి ఉంటాడు. తీసుకున్న అప్పును వడ్డీతో సహా అణాపైసలతో సహా తల తాకట్టుపెట్టయినా తీర్చాలన్నది దానిలోని నీతి సూత్రం. కాని ఆ నాటకాన్ని చూస్తూ హరిశ్చంద్రుని సత్యనిష్టలో మనమూ తాదాత్మ్యం చెందుతాము. అప్పు తీసుకొన్న సొమ్ము కాదు. కేవలం వాగ్దానం చేసిన సొమ్ము. దాన్ని చెల్లించడానికి హరిశ్చంద్రుడు అష్టకష్టాలు పడతాడు. చివరికి ఆలుబిడ్డలను సైతం అమ్మివేస్తాడు. ఇదంతా చూసి మనం కంటికి మంటికి ఏకధారగా కన్నీరు కారుస్తాం. కాని ఈ నాటకం వడ్డీ వ్యాపారులు తమ వసూళ్ళను తేలిక చేసుకోవడానికి ఆడిస్తున్న నాటకమంటే ఒప్పుకుంటామా? ఇప్పుడు చింతామణి నాటకం సంగతి చూద్దాం. అది నిజంగా ఓ సంఘ సంస్కరణాభిలాషి రాసినది. వేశ్యాలోలత్వం ఎన్ని అనర్థాలకు కారణమవుతుందో తెలియచెప్పే నాటకం అది. కాని అలాంటి నీతి నాటకం ఎలా బూతు చేయబడుతున్నదో మనం ప్రత్యక్షంగా చూస్తూనే వున్నాం.

మనలో మాట



కాలాన్ని బట్టే కాదు విలువలు ప్రదేశాల్ని బట్టీ మారుతుంటాయి. మనం ఎలిమెంటరీ స్కూలు నుండీ పసిపిల్లలకు వడ్డీ లెక్కలు నేర్పుతుంటాం. నీవు ఐదువందల రూపాయలు 24 శాతం రేటు చొప్పున ఒకనికి వడ్డీకిస్తే రెండేళ్ళలో అసలు, వడ్డీ కలిసి ఎంతవుతుందని లెక్కవేయమంటాం. అంటే చిన్నతనం నుండీ డబ్బును కూడబెట్టడంపై మమకారాన్ని పెంచిపోషిస్తాం. ఇప్పుడు ఒక మసీదును వందమంది నాలుగ్గంటల్లో కూల్చివేస్తే, వెయ్యిమంది ఆ మసీదును ఎంతసేపట్లో నేలమట్టం చేస్తారు అన్న లెక్కలు నేర్పుతున్నారనుకోండి. అది మరొక సంగతి. ముందు చెప్పిన వడ్డీలెక్కను ఏ సోషలిస్టు దేశంలోని పిల్లాడికయినా చెప్పామనుకోండి. ఐదొందలు వడ్డీకిస్తే వెంటనే జైల్లో పెడతారని ఠకీమని సమాధానం చెబుతాడు. ఒక కమలా పండులో పదితొనలుంటే ఒక్కొక్కరికి రెండు తొనల చొప్పున ఎందరికి పంచిపెట్టవచ్చు లాంటి లెక్కలు అక్కడ పిల్లలకు చెబుతారు.

అందువల్ల విలువలనేవి సందర్భాన్ని బట్టి, కాలాన్ని బట్టి, ప్రదేశాన్ని బట్టి మారుతుంటాయి. అయితే సమాజాన్ని ముందుకు తీసుకుపోయేవి, ప్రజలందరికీ మేలు చేసేవి మాత్రమే నిజమైన విలువలు.

రక్తపోటు గురించి తెలుసుకోండి ...6, 7

నేల తిమ్మిరి ...18, 19



డయల్ సి.యం. - ముఖాముఖి మూక ...14

ఆకలి చావులు ...20

ఇంకా...

గేయలహరి 9

బాలవికాసం 10

బాలల కథ 11

బాల నేస్తాలు 12, 13

ఇంతిసంగతులు 15

టూరిస్ట్ గైడ్ ... 16

అదాలత్ కథలు 22, 23

పలుకుబడి 24

వగైరా.......

ప్రపంచ 'బాబు' విధానాలకు ప్రతిఘటన

ఇ.వి. బాలాజీ

ఏ ఉద్యోగి, కార్మికుడు సమ్మె చేసి బాధలు, కష్టాలు కొనితెచ్చుకోడు. తన సమస్యల పరిష్కారానికి అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసిన తర్వాతే, అన్ని దారులు మూసుకుపోయిన తర్వాతే చిట్టచివరగానే సమ్మె అనే మహాయుధాన్ని ప్రయోగిస్తాడు. ప్రజాస్వామ్యంలో సమ్మె అనేది కార్మికుని ప్రాథమిక హక్కు. ప్రాణప్రదమైన హక్కు. భారతదేశంతో సహా అన్ని ప్రజాస్వామ్య దేశాల్లోనూ రాజ్యాంగాలు దీన్ని గుర్తించాయి. ఇంతవరకు జరిగిన సమ్మెలన్నీ పాలకులు, ఆయా సంస్థల యాజమాన్యాల నిర్లక్ష్య, నిరంకుశ విధానాల వల్ల, ఇచ్చిన, కుదుర్చుకున్న హామీలు నెరవేర్చనందుకే జరిగాయి. జరుగుతున్నాయి. మనదేశంలో, రాష్ట్రంలో స్వాతంత్ర్యానంతరం ఉద్యోగులు, కార్మికులకు మిగిలిన అనుభవమిదే.

కార్మికులకు బయటివారి నాయకత్వం ఉండరాదంటూ, అసలు కార్మిక సంఘాలనే రద్దు చేస్తానని బెదిరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం ప్రపంచబ్యాంక్ ఆదేశాలు, ఆడమ్‌స్మిత్ కంపెనీ చెప్పే సలహాలనే పాటిస్తారు. వారితోనే తన సహచర మంత్రులు, అధికారులకు మంచిపాలనపై పాఠాలు చెప్పిస్తారు. చంద్రబాబు వచ్చాక రాష్ట్రంలో ఇంతవరకు జరిగిన సమ్మెలు, గత బుధవారం (7.11.01) వరకు జరిగి విజయవంతంగా ముగిసిన ఆర్టీసి సమ్మెతో సహా బాబు వాగ్దానభంగం వల్లనే జరుగుతున్నాయి. ఇందులో కార్మికుల తప్పులను ఎంచడం ఏ విధంగా చూసినా సమర్థనీయం కాదు. విద్యుత్ సంస్థను మూడు మూడు ముక్కలుగా చీల్చడానికి అందులోని కొన్ని ఉద్యోగ సంఘాలను తన చాకచక్యంతో 'మచ్చిక' చేసుకున్న చంద్రబాబు ఆర్టీసిలో ఆ ప్రయత్నం చేసి విఫలం చెందారు.

ప్రపంచబ్యాంక్ అప్పుకోసం వారి ముందు సాగిలపడి వారి షరతులకు అంగీకరించిన చంద్రబాబు గత కొంతకాలంగా మానవీయుతా సంస్కరణలనే జపం మొదలుపెట్టారు. పాలనా పరమైన ఖర్చులు తగ్గించాలనే నెపంతో ప్రభుత్వోద్యోగులను కుదించడం- సమర్థత, పోటీ పెంచడమనే పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వారికి తెగనమ్మడం వంటి పనులకు పాల్పడుతున్నారు. ఆల్విన్ కంపెనీ మూసివేత అనంతరం ప్రభుత్వ శాఖల్లోకి తీసుకున్న 1486 మంది సిబ్బందిని పర్మినెంట్ చేయకుండా, హైకోర్టు తీర్పును కూడా ఖాతరు చేయకుండా వీధులపాల్జేసినప్పటినుండి మొదలైన కార్మికుల ప్రతిఘటన రాష్ట్రంలో నానాటికి పెరుగుతోంది. చైతన్యవంతమైన పోరాటాలు జరుగుతున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటినుండి కొత్తగా ఉద్యోగాలు రాకపోగా, ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమలు మూతపడటంతో లక్షలాది మంది వీధులపాలవుతున్నారు. ఉద్యోగులకు భద్రత ఉండరాదని, ఉంటే పనిచేయరని, అవసరమైనపుడు తీసుకోవడం, అక్కర్లేనపుడు తీసేయడం వంటి అమెరికా విధానాన్ని అమలుచేయడానికి తహ తహలాడుతున్నారు. మొత్తంగా రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక వర్గానికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. దీనికి తోడు అనేక ప్రభుత్వ సర్వీసులను 'ఈ-పాలన' పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించడం, ఇపుడు సంస్కరణల రెండవ, మూడవ దశ పేరుతో ప్రపంచబ్యాంక్ ఆదేశాలకనుగుణంగా ఆర్టీసి, సింగరేణి సంస్థలను ప్రైవేటీకరించాలని నిర్ణయించినందునే రాష్ట్రం ఉద్యోగుల, కార్మికుల ఆందోళనలు, సమ్మెలతో అట్టుడుకుతోంది.

చారిత్రాత్మక ఆర్టీసి సమ్మె

లక్షా పాతిక వేల మంది ఆర్టీసి కార్మికులు ఇర్వై నాలుగు రోజులపాటు నిర్వహించిన చారిత్రాత్మక సమ్మెను గమనించినా చంద్రబాబు పాలన, ఆయన హామీల్లోని బండారం బట్టబయలవుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యే నాటికి ఆర్టీసి ఎంతో ఉచ్ఛస్థితిలో ఉంది. మొత్తంగానే

పెట్టుబడిదారునిలా మాట్లాడుతున్న బాబు

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు గపూర్

చంద్రబాబునాయుడు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కాకుండా బడా పెట్టుబడిదారునిలా మాట్లాడుతున్నారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎ. గపూర్ విమర్శించారు. సమ్మెలు రాజకీయ పూరితమవుతున్నాయని ఇటీవల ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యపై ఆయన మాట్లాడుతూ, కార్మిక సంఘం ఏదైనా సమ్మెను చివరి ఆయుధంగానే వాడుతుందని అన్నారు. చట్టబద్ధమైన, ప్రజాస్వామ్యయుతమైన సమ్మె హక్కును రాజకీయ దృష్టితో చూస్తున్న ముఖ్యమంత్రి ఒక పెట్టుబడిదారునిలా వ్యవహరిస్తున్నారని గపూర్ పేర్కొన్నారు. భారత కార్మిక సంఘాల చట్టం (1926) ప్రకారమే కార్మికులు బయటివారిని తమ సంఘాలకు నాయకులుగా నియమించుకుంటున్నారని, చట్టాన్ని గౌరవించాలా లేదా అనే విషయాన్ని ముఖ్యమంత్రే తేల్చుకోవాలని ఆయన అన్నారు. ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగులకు చట్టాల గురించి పరిపూర్ణ అవగాహన రావడం కష్టమని, అందుకే అనుభవజ్ఞులైన బయటివారు నాయకులుగా ఉంటున్నారని అన్నారు. కార్మికులు బానిసలుగా పడిఉండాలనే ఆలోచనతోనే బయటివారి నాయకత్వాన్ని ముఖ్యమంత్రి వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. అయితే సిఐటియు సాధారణంగా సంస్థలోపల పనిచేసేవారినే నాయకులుగా తీర్చిదిద్దుతోందని, అయినా బయటివారు నాయకులుగా ఉండాలా, వద్దా అనే అంశంపై చర్చకు తమ సంఘం సిద్ధంగా ఉందన్నారు. పర్మినెంట్ కార్మికులు లేకుండా కాంట్రాక్ట్ కార్మిక విధానానికి చట్టబద్ధత కల్పించాలనే యోచన దుర్మార్గమైందని విమర్శించారు. 1970 చట్టం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులతో చేయించతగిన, తగని పనులను నిర్వచించారని చెప్పారు. వెట్టిచాకిరి చట్టరీత్యా నిషేధమని, దేశంలోని కార్మిక వర్గానికి సామాజిక న్యాయం అందించడానికి రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని పేర్కొన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు లేకుండా అతితక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేయించుకోవాలనే ఉద్దేశంతోనే మన ముఖ్యమంత్రి, భారత పారిశ్రామిక సంఘాల సమాఖ్య 1970 చట్టాన్ని సవరించాలని కోరుతున్నాయని తెలిపారు. సామాజిక స్పృహ ఉన్నవారెవరూ దీనికి అంగీకరించరని, చంద్రబాబుకు ఈ స్పృహ ఉందా లేదా తేల్చుకోవాలన్నారు. కొత్తగా యూనియన్ స్థాపించాలంటే సంస్థలో పదిశాతం లేదా వంద మంది సభ్యులుండాలని కేంద్రం చేయనున్న సవరణ సరికాదన్నారు. ఇప్పటికే దేశంలోని అసంఘటిత కార్మికుల్లో కేవలం 15 శాతం మాత్రమే సంఘాల్లో ఉన్నారని, ఈ సంఖ్య బాగా పెరగాల్సి ఉందన్నారు. సంఘాలు పెరగకుండా యాజమాన్యాలకు సేవచేయడానికి ఈ సవరణను ప్రతిపాదిస్తున్నారని గపూర్ విమర్శించారు.

ఏపిఎస్ఆర్టీసి దేశంలోనే ప్రతిష్టాకరంగా నిలబడింది. ఎంతో మెరుగైన సేవలు, నిర్వహణకు గాను ఏళ్ళ తరబడి జాతీయ అవార్డులు అందుకుంటోంది. అటువంటి సంస్థ చంద్రబాబు రాగానే నష్టాల్లో కూరుకుపోనారంభించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 1994లో రు.127 కోట్ల లాభాలతో ఉన్న ఆర్టీసి బాబుగారి చలువ వల్ల ప్రస్తుతం రు.600 కోట్ల నష్టాల్లో ఉంది. దీనికి ఎవరు కారకులు అనే అంశంపై సమ్మె ప్రారంభమైన నాటినుండి రాష్ట్రంలో చర్చ జరుగుతూనే ఉంది. ఆర్టీసి ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సంస్థలోని అన్ని కార్మికసంఘాలు ఐక్యంగా పోరాడి ప్రభుత్వంపై విజయం సాధించాయి. అయితే ఇందులో కూడా చంద్రబాబు విభజించి పాలించు అనే తన కుటిలనీతినే పాటించారు. సాధారణంగా ఉద్యోగులు, కార్మికులు తమ వేతనాలు మెరుగుపరచుకోవడానికే ఆందోళనలు, సమ్మెలు చేయాల్సి ఉంటుంది. కాని గత దశాబ్ద కాలంగా దేశంలో నూతన ఆర్థిక విధానాల అమలు మొదలైనప్పటినుండి ప్రైవేటీకరణ నుండి ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత కూడా కార్మికులపైనే పడింది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా కార్మికుల సమరశీల పోరాటాలు పెరుగుతుండగా మన రాష్ట్రంలో మాత్రం ఎక్కడా లేనివిధంగా అణచివేత పెరుగుతోంది. కార్మికుల సమ్మెను చర్చల ద్వారా కాకుండా అరెస్టులు, నిర్బంధాలు, ఖాకీల లాఠీల ద్వారా పరిష్కరించాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో అక్రమంగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలను అరికట్టాలని, ఆర్టీసిపై విపరీతంగా ఉన్న పన్నును తగ్గించాలని కార్మికులు డిమాండ్ చేయడం చంద్రబాబుకు కంటగింపైంది. జీతాల గురించి బతిమాలుకోవాలి గాని విధానాల గురించి మాట్లాడటానికి కార్మికులకేం పని అనేదాకా వచ్చారు. ఆర్టీసి లాభాల్లో ఉంటే ప్రైవేటీకరించడం కుదరదు. ప్రపంచబ్యాంక్ షరతు ప్రకారం మరో నాలుగైదేళ్ళలో దాన్ని ప్రైవేటీకరించాలి. ఆ లోగా 40 వేల మంది కార్మికులను స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం కింద తొలగించాలి. ఈ ప్రయత్నంలో ఉన్న బాబుగారికి కార్మికులు సమ్మె చేయడం తన ప్రతిష్టకు ఇబ్బందిగా ఉన్నా ప్రైవేటీకరణకు మంచిమార్గంగా కనిపిస్తోంది. ప్రభుత్వ దుష్ట ఆలోచనను గమనించిన కార్మిక సంఘాలు దీనిపై ప్రచారం చేస్తుండటంతో ముఖ్యమంత్రికి ఏమీ పాలుపోక కార్మికులను చీల్చి అయినా, అరెస్టులు, నిర్బంధాల ద్వారా సమ్మెను విచ్చిన్నం చేయాలని చూశారు. సంస్థను కాపాడుకోవడానికి కార్మికులు సమ్మె చేస్తుండగా సమ్మె ఇలాగే కొనసాగితే ఆర్టీసిని ప్రైవేటీకరించక తప్పదని, ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని బెదిరించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎంత పట్టుదలగా ఉందో కార్మికులు కూడా ఎన్నడూ లేనివిధంగా అపూర్వ ఐక్యత ప్రదర్శించి ఎలాగైనా సంస్థను రక్షించుకోవాలనే పట్టుదలతో సమ్మె పోరాటాన్ని కొనసాగించి విజయం సాధించారు.

అందరినీ ఉద్యమాల్లోకి నెడుతున్న బాబు

ఈ సంవత్సరంలో ఆందోళనకు గాని, సమ్మెకు గాని దిగని ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు రాష్ట్రంలో లేవంటే అతిశయోక్తి కాదు. కాని ఏ విషయాన్ని ముందుగా పరిశీలించడం గాని, ఆందోళనకు దిగకముందే పరిష్కరించడం గాని జరగలేదు. జూన్‌లో జరిగిన సింగరేణి సమ్మె, తాజాగా ఆరు రోజులు జరిగి ముగిసిన జూనియర్ డాక్టర్ల సమ్మె, ఆర్టీసి సమ్మె కేవలం గతంలో ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమేనంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఆర్టీసి కార్మికుల డిమాండ్లలో వేతన సవరణ మాత్రమే కొత్తది. అదికూడా కాలపరిమితి తీరి ఆరునెలలు పూర్తయింది. లక్షకు పైగా ఉన్న సింగరేణి బొగ్గుగనుల కంపెనీ కార్మికులు ఐదు ఏళ్ళ క్రితం సవరించిన వేతనాల బకాయిలను చెల్లించాలని, డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ సమ్మె చేయాల్సి వచ్చింది. వీటిని పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి రెండేళ్ళ క్రితమే వారికి హామీ ఇచ్చి మరిచారు. తప్పనిసరిగానే సింగరేణి కార్మికులు సమ్మెకు దిగగా ముఖ్యమంత్రి చాలా రకాలుగా వారిని బెదిరింపులకు గురిచేశారు. సమస్య పరిష్కరించకపోగా సమ్మె వల్ల సంస్థకు వచ్చే నష్టాలను కార్మికుల జీతాలనుండి కట్ చేస్తామని కూడా బెదిరించారు. కార్మిక సంఘాల నాయకులను అరెస్ట్ చేసి బెయిల్ కూడా రాకుండా చేశారు. ఈ సమ్మెకు అన్ని కేంద్ర కార్మికసంఘాల, ప్రజల మద్దతు పెరగడంతో చివరకు 13 రోజుల తర్వాత వారి డిమాండ్లు తీర్చడానికి ప్రభుత్వం అంగీకరించింది.

సెప్టెంబర్‌లో 35వేల మంది రెవెన్యూ సిబ్బంది సమ్మెకు దిగారు. ఐఎఎస్‌ల వేధింపులు ఆపాలని, సిబ్బందిపై కక్ష సాధింపుచర్యలు నిలిపివేయాలని, ప్రమోషన్లు, ఖాళీల

చంద్రబాబు పుట్టకముందే కార్మిక చట్టాలున్నాయి



- ఎఐటియుసి నేత పొట్లూరి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టక ముందే కార్మిక చట్టాలున్నాయని, వీటిని ప్రశ్నించే అర్హత ఆయనకు లేదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొట్లూరి నాగేశ్వరరావు అన్నారు. ట్రేడ్ యూనియన్లకు బయటి వారు నాయకత్వం వహిస్తున్నందువల్ల ఇబ్బందులెదురవుతున్నాయని ఆర్టీసి సమ్మె సందర్భంలో ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలపై ఆయన పై విధంగా స్పందించారు. 1926లో ఇండియన్ ట్రేడ్ యూనియన్ చట్టం వచ్చింది. తమ కోర్కెలను గుర్తించడంలో, ఆందోళనలు రూపొందించుకోవడంలో కార్మికులకు అవగాహన లేక పోవచ్చన్న ఉద్దేశంతో చట్టం బయటివారి నాయకత్వానికి అనుమతిచ్చింది. అయినా నాయకత్వాన్ని ఎన్నుకునే అంశం కార్మికుల అభీష్టానికి సంబంధించింది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే విధంగా కార్మికుల పోరాటాలుంటాయి. ప్రైవేటీకరణ కార్మికులకు వ్యతిరేకం. ప్రభుత్వానికి అనుకూలం. ఆర్టీసిని ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేస్తున్న ప్రచారమే ఒక పెద్ద రాజకీయం. ఇదిలా ఉంటే, సమ్మెకు వ్యతిరేకంగా బహిరంగసభలు పెట్టాలని తమ పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపునివ్వడం మరింత పెద్ద రాజకీయం. జీవన వ్యయం పెరగకుండా ఉంటే జీతాల పెంపు సమస్య ఉత్పన్నం కాదు. కార్మికుల పర్మినెంట్ విషయానికొస్తే 240 రోజులు ఏదేని ఒక పోస్టు ఖాళీగా ఉంటే అది పర్మినెంట్ కింద లెక్క. అన్ని రోజులు కార్మికుడు ఒక సంస్థలో పని చేస్తే అతన్ని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోర్టు తీర్పు చెప్పింది. పీస్ వర్క్ చేసే వారిని పర్మినెంట్ చేయవద్దని కూడా అనే కోర్టు తీర్పునిచ్చింది. ఇది ప్రజాభీష్టానికి వ్యతిరేకమైన తీర్పు. కాంట్రాక్టు కార్మికుల వ్యవస్థను చట్టబద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ విషయానికొస్తే ఇటీవలి కాలంలో మళ్లీ యూనియన్ల వల్ల కొన్ని ఇబ్బందులెదురవుతున్నాయి. రాజకీయాలు ఎలా ఉన్నా ఒకే ట్రేడ్ సెంటర్ ఉండాలన్నది ఎఐటియుసి అభిప్రాయం. బీహార్ మహాసభలో ఈ తీర్మానం చేశాం. అయితే ప్రభుత్వం చెపుతున్నట్లుగా ట్రేడ్ యూనియన్ స్థాపించడానికి నిర్ణయించిన నియమాలను వ్యతిరేకిస్తున్నాం.

'తెలుగునాడు' రద్దు చేసి మాట్లాడండి

- ఎస్.చలపతి, బిఎంఎస్ నేత

ట్రేడ్ యూనియన్ల వ్యవస్థలో రాజకీయాలు వద్దని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ స్థాపించారో చెప్పాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నేత, ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. చలపతి ప్రశ్నించారు. టిఎన్‌టియుసిని రద్దు చేసుకొని అందరికీ ఆదర్శంగా ఉండి ఆ తర్వాత రాజకీయాల గురించి, బయటి వారి నాయకత్వం గురించి అభ్యంతరం చెప్పాలని అన్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలపై ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో విమర్శించారు. బయటి వారి నాయకత్వం వద్దనడానికి ఎవరికీ అర్హత లేదు. కార్మిక చట్టాలు అనుమతిస్తున్నాయి. యూక్టులను తప్పుపట్టడం చంద్రబాబుకు సబబు కాదు. కాంట్రాక్టు విధానం చట్టబద్ధం చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం ఇస్తున్న వేతనాలతోనే ఈ రోజుల్లో సగటు ఉద్యోగి బతకడం కష్టమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కాంట్రాక్టు పేర ఇంకా తక్కువ వేతనాలివ్వడమంటే శ్రమను దోచుకోడాన్ని చట్టబద్ధం చేయడమే అవుతుంది. ప్రభుత్వాలు ఉద్యోగులందరికీ ఒకే విధంగా వేతనాలు ఇస్తే యూనియన్ల జోక్యం ఉండదు. యూనియన్ల వల్లే వేతనాల్లో అంతరాలు చోటు చేసుకుంటున్నాయనడంలో నిజం లేదు. శ్రమ దోపిడీకి ఆస్కారం కలిగిన విధానాలు అమలవుతున్న ఈ రోజుల్లో ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రేషన్‌కు నిర్ణయించిన షరతులు కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయి. ప్రైవేటీకరణను బిఎంఎస్ వ్యతిరేకిస్తోంది. ఆర్టీసి విషయానికొస్తే నష్టాలకు గల కారణాలను పరిశీలించాలి. తగిన చర్యలను ప్రభుత్వం చేపట్టాలి.

సమ్మె కట్టడం కార్మికుల జన్మహక్కు

- పి.జనార్ధన్ రెడ్డి, మాజీ సీఎల్పీ నాయకులు,కార్మికనేత



సమ్మె కట్టడం కార్మికుల జన్మహక్కు ఆ హక్కును ఎలా ఉపయోగించుకోవాలో వారికి తెలుసు. సమ్మెలు రాజకీయ పూరితం అవుతున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడంలో అర్థం లేదు. వాస్తవానికి కార్మికులకు బయటి నేతలు నాయకత్వం వహించడం మూలంగా వారి మనోస్థైర్యం పెరుగుతుంది. సంస్థలోని కార్మికులు సమస్యలపై యాజమాన్యాలను నిలదీస్తే వారికి వేధింపులు ఎదురవుతున్నాయి. అంతెందుకు, నేను ఒక ప్రైవేట్ సంస్థలో సూపర్‌వైజర్ ఉద్యోగం చేస్తూ యాజమాన్యాన్ని నిలదీసినందుకు వేధించారు. ముందుగా సస్పెండ్ చేశారు. అనంతరం డిస్మిస్ చేశారు. అయినా కార్మిక సోదరులు నాకు అండగా నిలిచారు. 1976లో అదే సంస్థ కార్మిక సంఘం అధ్యక్షునిగా నన్ను గెలిపించుకొన్నారు. అయినా ఏ కార్మికుడు కూడా తన సంస్థ మనుగడకు ముప్పువాటిల్లేలా ప్రవర్తించడు. బ్రిటిష్ వలసపాలకులు కూడా బయటివారి నేతృత్వాన్ని వ్యతిరేకించలేదు. వారికన్నా చంద్రబాబు నియంతలా వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రపంచబ్యాంక్ షరతులకు లొంగిపోయి వారు ఆడించినట్లుగా ఆడే తోలుబొమ్మగా నిరూపించుకొన్నారు. ఏఒక్క సంస్థను కూడా ప్రైవేటీకరించమని ఆయనను చెప్పమనండి. కార్మికుల సమస్యలను అర్థం చేసుకొని తీర్చమనండి. చంద్రబాబు నాయుడునే కార్మిక సంఘం నాయకునిగా ఎన్నుకొంటాం. ఇక కార్మికుల మధ్య వేతన వ్యత్యాసాలు అంటారా, కొన్ని సందర్భాల్లో తప్పవు. అత్యంత ఆర్థిక పరిపుష్టి కలిగిన కర్మాగారంతో సమానంగా సాధారణ కర్మాగారాలు వేతనాలు చెల్లించలేవు. దానిని దృష్టిలో పెట్టుకొనే వేతన చర్చలు సాగుతాయి. కాంట్రాక్టు కార్మికుల వ్యవస్థను చట్టబద్ధం చేయడం దుర్మార్గమైన ఆలోచన. వారి శ్రమను దోచుకొని కనీస జీవన భద్రత కల్పించకుండా చేసే చర్య. దానిని అందరూ వ్యతిరేకించాలి. కొత్త కార్మిక సంఘాలను స్థాపించాలంటే సంస్థలో 10శాతం ఉద్యోగులు లేదా వంద మందిని సభ్యులుగా చేస్తే బాగుంటుంది. కేవలం ఏడు ఎనిమిది మంది సభ్యులతో స్థాపించడం మూలంగా కొన్ని ఇబ్బందులున్నాయి. నా వ్యక్తిగత అభిప్రాయం ఏమిటంటే ఒక ఫాక్టరీకి ఒకే కార్మిక సంఘం ఉండాలి. దానికి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రహస్య బ్యాలట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలి. మాజీ ముఖ్య మంత్రి టంగుటూరి అంజయ్య కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ విధానం ప్రవేశపెట్టి సత్ఫలితాలు సాధించారు.

భర్తీ నిమిత్తం వారు చేసిన సమ్మెను కూడా అణచివేయాలని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ప్రయత్నించారు. సమ్మె రోజురోజుకు ఉధృతం గావడంతో ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉండగా ఎన్‌జివో అసోసియేషన్ నేత టి. సుధాకర్‌ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. అనంతరం వారి కోర్కెలను అంగీకరించిన ముఖ్యమంత్రి సుధాకర్‌ప్రసాద్ మరణించినందునే మీ కోర్కెలు తీరుస్తున్నానని ఉదారంగా వ్యవహరించినట్లుగా మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థలైన అనేక కార్పొరేషన్ల సిబ్బంది వేతన సవరణ కూడా ఆందోళన తర్వాతే అమలైంది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కేంద్రం, నిత్యం ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శుల వద్ద పనిచేసే సచివాలయంలోని ఉద్యోగులు కూడా తమ సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీస్ ఇస్తే గాని పరిష్కారం కాలేదు. అత్యల్పమైన జూనియర్ డాక్టర్ల సమస్యలు కూడా ఆరు రోజుల సమ్మె తర్వాతే పరిష్కారమయ్యాయి. ఈ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, కార్మికుల సమస్యలపైనా సమ్మె జరగకుండా పరిష్కారం కావనే స్థిరాభిప్రాయం కల్పించారు.

బ్యాంక్ చేతిలో కీలుబొమ్మ

ప్రపంచబ్యాంక్ చేతిలో కీలుబొమ్మలా మారిన చంద్రబాబు అది చెప్పినట్టల్లా ఆడుతున్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయకుండా సర్దుబాటు చేయడం, దశాబ్దాల తరబడి పెంచి పోషించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటువారికి అప్పగించే ప్రయత్నం చేయడం. ప్రపంచబ్యాంక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మొదటి దశ సంస్కరణలను బ్రహ్మాండంగా పూర్తి చేశారని ఇటీవల రాజధానికి వచ్చిన బ్యాంక్ భారతదేశ ప్రతినిధి ఎడ్విన్‌లిమ్, బాబును పొగిడి వెళ్లారు. వెంటనే రెండవ దశ సంస్కరణలు కూడా ప్రారంభించవలసిందిగా ఆదేశించారు. సింగరేణి, ఆర్టీసిలతో సహా మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరించడమే రెండవ, మూడవదశ సంస్కరణలుగా ముందుకు వస్తున్నాయి. ఈ దశలో ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవడానికి కార్మికవర్గమంతా ఏకమై పోరాడటం ముఖ్యమంత్రికి ఇబ్బందిగా ఉంది. బంగారుబాతు లాంటి ఆర్టీసిని ముక్కలు చేసి తన అనుయాయులకు అప్పగించడానికి చేస్తున్న ప్రయత్నాలకు కార్మికసంఘాలు అడ్డుగా నిలవడం ఆయనకు కంటగింపుగా మారింది. ఏవైనా కొత్త పథకాలు ప్రకటించినపుడు నిధులు ఎక్కడి నుండి తెస్తారని ప్రశ్నిస్తే మనసుంటే మార్గముంటుంది బ్రదర్ అంటూ దీర్ఘాలు తీసే ముఖ్యమంత్రి ఆర్టీసి సమ్మెలో జోక్యం చేసుకోవడానికి తిరస్కరించారు. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రతిపక్షాలన్నీ రాష్ట్ర బంద్‌కు పిలుపివ్వడంతో కొంతమేర దిగివచ్చి ఉపసంఘం ద్వారా సమ్మెను పరిష్కరించారు. ప్రపంచబ్యాంక్ ప్రభువుల ఆదేశాలకు అనుగుణంగా నర్తిస్తూ రాష్ట్రాన్ని ప్రైవేటీకరించడానికి చేస్తున్న ప్రయత్నాలను అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు, వామపక్షాలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాయి. సమ్మె చేస్తున్న వారిపై, వారికి మద్ధతిచ్చినవారిపై పోలీసులను ఉసిగొల్పి పోరాటాలను అణచాలని చేస్తున్న ప్రయత్నాలు ఎక్కడా సాగడంలేదు. బంతిని ఎంత బలంగా నేలకు విసిరికొడితే అంత వేగంగా ఎత్తుకు ఎగురుతుంది. అదేవిధంగా నిర్బంధం పెరిగే కొద్దీ పోరాటాలు ఉధృతమవుతున్నాయి. ప్రపంచబ్యాంక్‌కు ఊడిగం చేస్తూ వారి విధానాలు అమలుచేస్తున్న పాలకవర్గాలు ముందుకు వెళతాయా లేక ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకునేందుకు, బానిస విధానాలు అంతమొందించేందుకు జరుగుతున్న పోరాటాలు ముందుకువెళతాయా అనేది ప్రశ్న. అయితే చరిత్రలో ఎక్కడైనా ప్రజలే అంతిమ విజేతలు. ఆర్టీసి కార్మికులు సాధించిన విజయమే తాజా ఉదాహరణ. ★

తెగేదాక లాగొద్దు

- రామ్మోహనరావు, టిఎన్‌టియుసి అధ్యక్షులు

సమ్మెలు రాజకీయ పూరితం అవుతున్నాయన్న ముఖ్యమంత్రి విమర్శ కరెక్టేననిపిస్తోంది. కార్మికవర్గ ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత ఉంది. అయితే తెగేదాక లాగొద్దనేదే నా సూచన. ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లు ఎన్నో పని చేస్తున్నాయి. వారు కూడా తమ సమస్యలను పరిష్కరించుకున్నారు. ట్రేడ్ యూనియన్ పద్ధతిలో వెళితే బాగుంటుంది. కాని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకుంటే ప్రభుత్వం కూడా వేరే విధంగా ఆలోచిస్తుంది కదా. ప్రభుత్వరంగ సంస్థలు అనేకం వున్నాయి. ఒక్కో సంస్థ రకరకాల నిబంధనల ప్రకారం పని చేస్తుంది. ఆర్టీసికి నష్టం ఎలా వస్తున్నదన్న విషయాన్ని విశ్లేషించడానికి గానీ, నష్టాలు రాకుండా తీసుకోవల్సిన చర్యల విషయమైగానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంలో తప్పు లేదు. అయితే ఇప్పుడు ఆందోళనల ద్వారా విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎం.వి.టాక్స్‌ను ఆర్టీసి డిమాండ్ చేసి తీసుకుంది. తొలుత టర్నోవర్ బేసిస్ మీద తీసుకున్నారు. ఈ విషయంపై కమిషన్ వేసి విచారణ జరుపుతామని ప్రభుత్వం చెబుతోంది. యూనియన్లకు బయటి వారు నాయకత్వం వహించే విషయమై నేనేమి చెప్పలేను. టిఎన్‌టియుసి ఏర్పడినపుడు పని చేసే వారినే యూనియన్ నాయకుడిగా ఎంపిక చేయాలని అప్పటి పార్టీ మ్యానిఫెస్టోలోనే ఉంది. యూనియన్ల వల్లే కార్మికుల ఆదాయాల్లో వ్యత్యాసాలు వస్తున్నాయని సి.ఎం. అన్నట్లు నాకు గుర్తు లేదు. కాంట్రాక్టు కార్మికుల వినియోగాన్ని చట్టబద్ధం చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలున్నాయి. కనుక దాని గురించి చెప్పేదేమీ లేదు.

రక్తపోటు గురించి తెలుసుకోండి

హై బ్లడ్ ప్రెషర్ లేదా హైపర్ టెన్షన్‌ను తరచుగా సైలెంట్ కిల్లర్ అంటుంటారు. ఎందుకంటే అది ఎలాంటి లక్షణాలు లేకుండానే తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. నిరోధించనలవిగాని హైబీపీ వల్ల గుండె, మెదడు, కళ్ళు, మూత్రపిండాలు దెబ్బతింటాయి. మీకు హైబీపీ వుందా, లేదా అనే విషయాన్ని తెలుసుకోవాలంటే క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడమొక్కటే మార్గం. ఒకవేళ మీకు హైబీపీ వుంటే అది తీవ్ర వరిణామాలకు దారితీయకుండా వైద్యం చేయించుకోవచ్చు.

రక్తపోటు అంటే ఏమిటి?

రక్తనాళాలపై గుండె ఉపయోగించే ఒత్తిడి శక్తినే రక్తపోటు అంటారు. ఈ రక్త నాళాలు రక్తాన్ని గుండె నుంచి శరీరంలోని అన్ని భాగాలకూ సరఫరా చేస్తాయని మనకు తెలుసు. రక్తపోటును నమోదు చేసేటప్పుడు రెండు అంకెలతో సూచిస్తారు. ఉదాహరణకు 140/90. ఈ అంకెలలో మొదటి అంకె సిస్టోలిక్ ప్రెషర్‌ను సూచిస్తుంది. అంటే గుండె సంకోచించినపుడు కలిగే ఒత్తిడి. రెండవ అంకె డయాస్టోలిక్ ప్రెషర్‌ను సూచిస్తుంది. అంటే గుండె వ్యాకోచించినపుడు కలిగే ఒత్తిడి.

హైబ్లడ్ ప్రెషర్ లేదా హైపర్ టెన్షన్

హైబీపీని వైద్యపరిభాషలో హైపర్ టెన్షన్ అంటారు. రక్తప్రసరణను సక్రమంగా వుంచేందుకు రక్తనాళాలపై కొంత ఒత్తిడి అవసరం. అయితే ఆ స్థాయిని దాటి ఒత్తిడి వుంటే దానిని హైపర్ టెన్షన్ అంటారు. రక్తపోటు 140/90 లేదా అంతకంటే ఎక్కువ వుంటే దానిని హైబీపీ అంటారు. భారతదేశంలో ప్రతి ఐదుగురు **వయోజనుల్లో ఒకరికి హైపర్ టెన్షన్ వున్నదని అంచనా...** అయితే వయస్సు పెరిగే కొద్దీ ఇది సంభవించే అవకాశాలు కూడా పెరుగుతాయి.

హైపర్ టెన్షన్‌లో రకాలు

హైపర్ టెన్షన్ రెండు రకాలు. ఒకటి ప్రైమరీ లేదా ప్రధానమైనది. రెండోది సెకండరీ హైపర్ టెన్షన్. ప్రైమరీ హైపర్ టెన్షన్‌లో బీపీ పెరగడానికి కచ్చితమైన కారణం తెలియదు. 90 శాతం మంది హైపర్ టెన్షన్ రోగులు ఈ కోవకు చెంది వుంటారు.

సెకండరీ హైపర్ టెన్షన్ అంటే బీపీ పెరగడానికి కారణం తెలిసి వుంటుంది. కేవలం 10 శాతం మంది మాత్రమే ఈ కోవకు చెందిన వారుంటారు. ఇది ప్రధానంగా గర్భనిరోధక బిళ్ళలు మింగటం వల్ల, ఉత్ప్రేరకాల వాడకం వల్ల, మూత్రపిండాల వ్యాధుల వల్ల, థైరాయిడ్ సమస్యల వల్ల, గర్భధారణ వంటి వాటివల్ల సంభవిస్తుంది. 30 ఏళ్ళలోపు వారిలోనూ, 55 ఏళ్ళు పైబడిన వారిలోనూ ఈ రకమైన హైపర్ టెన్షన్ వున్నట్లు అనుమానించవచ్చు.

హైబీపీవల్ల సంభవించే ప్రమాదాలు

హైబీపీ వున్న అత్యధిక భాగం కేసుల్లో దానికి గల కారణాలను చెప్పజాలము. ఈ రకమైన రోగులు ప్రైమరీ లేదా ప్రధానమైన హైపర్ టెన్షన్ కోవలోకి వస్తారు. అయితే రక్తపోటు పెరగడానికి కొన్ని అంశాలు కారణం **కావచ్చు. ఈ అంశాలలోని చాలా వాటిని మనం కొద్దిపాటి** ప్రయత్నంతో తొలగించుకోవచ్చు. వాటిలో కొన్ని

– మానసిక లేదా శారీరక ఒత్తిడి అనేది బీపీ పెరగడానికి ఒక ప్రధాన కారణం. శరీరం మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురైనపుడు బీపీని పెంచడానికి కారణమైన కొన్ని పదార్థాలను మెదడు విడుదల చేస్తుంది.

– అధికంగా బరువున్న వారు తేలికగా హైపర్ టెన్షన్ బారిన పడే అవకాశముంది. శారీరక శ్రమ చాలా స్వల్పంగా వున్న వారిలో రక్త ప్రసరణ బలహీనంగానూ, నెమ్మదిగానూ జరుగుతుంది. దానితో గుండెపై బాగా ఒత్తిడి పడుతుంది. అంతేగాక స్థూలకాయుల్లో రక్తనాళాల్లో కొవ్వు చేరుతుంది. అది కూడా రక్తపోటును పెంచుతుంది.

– ఉప్పు చాలా అధికంగా తినడం. బీపీ పెరగడానికి యిదొక ప్రధాన కారణం. రోజుకు ఐదు గ్రాములకు మించి ఉప్పు తింటే రక్తపోటు పెరుగుతుంది.

– మద్యపానం, ధూమపానం.

– హైపర్ టెన్షన్‌కు సంబంధించి కుటుంబ చరిత్ర.

మనిషి ఉద్విగ్న స్థితి కూడా రక్తపోటును ప్రభావితం చేస్తుంది. ఉద్విగ్నత, కోపం లేదా ఆందోళన వంటివి బీపీని పెంచడానికి కారణమవుతాయి. అయితే అది కొన్ని నిముషాల్లోనే సాధారణ స్థాయికి వస్తుంది. రక్తపోటును పరీక్షించే సమయంలో చాలా ప్రశాంతంగా వుండాలి. లేకుంటే తప్పుడు ఫలితాలు వచ్చే ప్రమాదముంది.

హైపర్ టెన్షన్ లక్షణాలు

తొలి దశలో ఎలాంటి లక్షణాలు కన్పించవు కాబట్టి తమకు హైబీపీ వున్నదని రోగులకు సహజంగానే తెలియదు. లక్షణాలు కన్పించేటప్పటికే ఆలస్యం జరిగిపోతుంది. అప్పటికే తీవ్ర సమస్యలు ప్రారంభమవుతాయి. దానికున్న చిక్కుల మూలంగానే హైబీపీ లక్షణాలు తెలుస్తాయి. హైబీపీ వల్ల తలతిరగడం వంటి లక్షణాలు కన్పిస్తాయనే తప్పుడు అవగాహన వుంది. కానీ చాలా తరచుగా ఎలాంటి లక్షణాలు కన్పించవు. అందువల్లనే హైపర్‌టెన్షన్‌ను సైలెంట్ కిల్లర్ అంటారు.

ఇందులోని సమస్యలు

అసలు ఈ జబ్బులో వుండే సమస్యలే దాని లక్షణాలను బయటపెడతాయి. ఈ హైబీపీ అనేది గుండె, మెదడు, కళ్ళు, మూత్రపిండాల వంటి అవయవాలకు హాని కల్గిస్తుంది. ఇది గుండెపోట్లు, (స్ట్రోక్స్), రక్తనాళాలు చిట్లడం, మెదడులో జరిగే రక్తస్రావాలు, మూత్రపిండాలు పని చేయకపోవడం, కంటిచూపు సమస్యల వంటి వాటికి దారి తీయగలదు. తలనొప్పులు, గుండెదడ, ముఖం కందిపోవడం, కంటిచూపు మసక మసకగా వుండటం, ముక్కు నుండి రక్తం కారడం, ఊపిరాడకపోవడం,

ఆయాసం లేదా బడలికగా వుండటం, చెవిలో గుయ్యమని శబ్దం రావడం వంటివిగానీ, వీటిలోని ఏ కొన్నింటి కలయికగానీ వున్నప్పుడు రక్తపోటును పరీక్ష చేయించుకోవడం అవసరమని పలువురు డాక్టర్లు అంటున్నారు. ఇవి హైబీపీ (అధిక రక్తపోటు) వల్ల వచ్చాయేమోనని తెలుసుకొనేందుకు పరీక్షలు అవసరం.

చికిత్స

హైపర్ టెన్షన్ రోగికి చాలా జాగ్రత్తగా శారీరక పరీక్షలు జరపాలి. మూత్రపిండాల పని తీరును అంచనా వేసేందుకు మూత్ర, రక్త పరీక్షలు, అలాగే మూత్రపిండాలకు అల్ట్రా సౌండ్ పరీక్ష చేయాలి. వీటి ఫలితాలన్నింటినీ పరీక్షించిన అనంతరం మాత్రమే హైపర్ టెన్షన్‌కు ప్రధానమైన కారణాలేమైనా వున్నాయా అనే విషయం తెలుస్తుంది. ఆహారం, జీవన విధానంలో మార్పులు, హైపర్ టెన్షన్ తగ్గేందుకు మందులు వాడటం ద్వారా దీనికి చికిత్స చేయాలి. బీపీ కొద్దిగా పెరిగితే ఉప్పు తక్కువున్న ఆహారం యివ్వాలి. పొగతాగే అలవాటుంటే మానేయాలి. బరువు తగ్గించుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆల్కహాల్ వాడకాన్ని తగ్గించుకోవాలి. పండ్లు, కూరగాయలను అధికంగా తీసుకోవాలి.

ఈ రకంగా ఆహారం, జీవన విధానంలో మార్పులు చేసినప్పటికీ మూడు, నాలుగు నెలలకు కూడా బీపీ తగ్గు ముఖం పట్టకపోతే అప్పుడు ఔషధ చికిత్సను ప్రారంభించాలి. డ్యూరెటిక్స్, ఏసిఇ - ఇన్హిబిటర్లు, కాల్షియం ఛానల్ బ్లాకర్స్, వాసోడిలేటర్స్ వంటి ప్రధాన మందులను వాడాలి. కొన్ని మందులు అలసట కల్గించడం వంటి దుష్పరిణామాలను చూపవచ్చు. హైపర్ టెన్షన్ తగ్గించేందుకు మందులు వాడుతున్నప్పుడు ఏవైనా ఇతర లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌కు తెలియజేయాలి.

సాధారణంగా రోగులు సక్రమంగా మందులు తీసుకోకపోవడం, ఎప్పటికప్పుడు బీపీ పరీక్ష చేయించుకోకపోవడం చేస్తుంటారు. ఇది రోగికి చాలా హాని కల్గించవచ్చు. హైబీపీ మందులను జీవితాంతం వాడాల్సి వుంటుంది. అయితే రోగి అవసరాలను బట్టి మందు పరిమాణంలో మార్పులు చోటు చేసుకుంటాయి.

లోబీపీ (హైపోటెన్షన్)

లోబీపీని వైద్య పరిభాషలో హైపోటెన్షన్ అంటారు. రక్తపోటు తక్కువగా వుండటం మంచిదేనని కొందరు హృద్రోగ నిపుణులంటున్నారు. బీపీ తక్కువగా వుంటే ఎక్కువ కాలం బ్రతుకుతారనే సాధారణ సూత్రం సరైందేనని ఫ్రామింగ్‌హామ్‌లో జరిగిన అధ్యయనం తెలిపింది. మధుమేహం, ఆల్కహాలిజం, ఎడిసన్స్ డిసీజ్ వంటి వివిధ జబ్బులతో హైపోటెన్షన్ ఒక లక్షణంగా వుంటుంది. వ్యాయామం చేసిన తరువాత రక్తపోటు అకస్మాత్తుగా పెరిగితే అది కళ్ళు తిరిగిపడిపోవడానికి లేదా అరుదుగా మరణానికి దారితీయవచ్చు.

చాలాసేపు కూర్చొని, పడుకొని వున్న తరువాత అకస్మాత్తుగా లేస్తే చాలా మందిలో శరీర భంగిమ మారినందువల్ల వచ్చే హైపోటెన్షన్ వుండటం సహజమే. ఈ పరిస్థితి ఒక్కోసారి కళ్ళు తిరిగి పడిపోవడానికి కూడా దారితీస్తుంది. ఇలా చాలా తరచుగా జరిగితే మాత్రం దానికి గల కారణాలను తెలుసుకోవాల్సిన అవసరముంది. దీనికి సాధారణంగా ఎలాంటి చికిత్సా వుండదు. ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోమని, కాళ్ళకు బిగుతుగా వుండే ఎలాస్టిక్ స్టాకింగ్స్ వేసుకోమని డాక్టర్ కొన్నిసార్లు సలహా యివ్వవచ్చు.

హైబీపీ రోగులు తీసుకోవలసిన ఆహారం

ఊబకాయం, హైబీపీ అనేవి పక్క పక్కనే వుంటాయనేది సాధారణ సూత్రం. అధికంగా బరువు వున్న వారు కొంత బరువును తగ్గించుకున్నప్పుడు వారి బీపీ తగ్గినట్లు అనేక శాస్త్రీయ అధ్యయనాలు రుజువు చేశాయి. హైపర్ టెన్షన్‌తో బాధపడే వారెవరైనా సరే తమ బరువును తగ్గించుకొనేందుకు జీవన విధానాన్ని మార్చుకోవడం వల్ల ఉపయోగముంటుంది.

సరైన ఆహారాన్ని తీసుకోవడమనేది దీనికి మొదటి చికిత్స అని గుర్తుంచుకోవాలి. ప్రకృతి చికిత్సలో ఎక్కువగా పండ్లు, కూరగాయలు యిస్తారు. దీనివల్ల హైబీపీకి కారణమయ్యే విష పదార్థాలు శరీరంలో తగ్గిపోతాయి. పీచు కలిగి వున్న పదార్థాలను భుజించడం వల్ల బీపీ తగ్గడమే గాక బరువు కూడా తగ్గవచ్చు. తమ బీపీని తగ్గించుకొనేందుకు హైపర్ టెన్షన్ వున్న రోగులు పాటించాల్సిన కొన్ని టిప్స్.

ఉప్పు : ఉప్పు మనిషి శరీరానికి అవసరమే. అయితే మన శరీరానికి హాని చేసేది ఉప్పు కాదు. మనం తినే ఉప్పు పరిమాణం. మనకు రోజులో 200 మి.గ్రా. ఉప్పు సరిపోతుంది. కానీ మనం దానికంటే 30 రెట్లు అధికంగా తింటున్నాము. ఉప్పులో 40 శాతం సోడియం వుంటుంది. మనం ఆహారం ద్వారా సోడియం ఎక్కువగా తీసుకుంటే బీపీ పెరుగుతుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి.

పొటాషియం : పొటాషియం ఎక్కువగా వున్న ఆహారం తీసుకుంటే హైబీపీ తగ్గుతుంది. హైబీపీ పేషెంట్లు అరటి, ఆపిల్, నారింజ, టొమాటో వంటివి కూడా తినాలి.

కాల్షియం, మాంగనీసు : ఈ రెండు ఖనిజ పదార్థాలు తగినంతగా తింటే బీపీ తగ్గుతుంది. పెరుగు, పాలు, క్యాబేజీ, బాదం పప్పుల్లో కాల్షియం ఉంటుంది. సోయాబీన్స్, సోయాఫ్లోర్, జీడిపప్పు, బాదం పప్పు, గోధుమపిండి, బంగాళాదుంప వంటి వాటిల్లో మాంగనీసు ఎక్కువగా వుంటుంది.

పండ్లు, కూరగాయలు : శాఖాహారం తీసుకొంటే బీపీ తగ్గుతుందని అధ్యయనాలు తెలిపాయి. పండ్లు, కూరగాయల్లో పొటాషియం, విటమిన్లు, పీచు పదార్థం వుంటుంది. పైగా వాటిలో సోడియం చాలా తక్కువగా వుంది. మీ ఆహారంలో పండ్లు కూరగాయలు చేర్చుకోండి. మీ బీపీ ఎలా తగ్గిందో మీకే తెలుస్తుంది.

వెల్లుల్లి : అది రక్త నాళాలపై జరిపే చర్య వల్ల బీపీ తగ్గుతుంది. ఇది బీపీ వున్న వారికే కాకుండా లేని వారికి కూడా చాలా మంచిది.

తేనె : ఇది గుండె టానిక్‌గా పని చేస్తుంది. ఇది గుండెకు రక్తప్రసారాన్ని పెంచి రక్తపోటును తగ్గిస్తుంది.

అనాస, దోస, ద్రాక్ష, అరటి, ఉసిరి కూడా హైపర్ టెన్షన్ రోగులకు చాలా మంచిది.

(లాంగెవిటీ అండ్ హెల్త్ సౌజన్యంతో)



నా వయస్సు 20 సంవత్సరాలు. మూడేళ్ళుగా నా నోటి నుండి విపరీతమైన వాసన వస్తోంది. రోజూ రెండుసార్లు బ్రష్ చేస్తున్నా అలాగే వాసన వస్తోంది. దీనికి పరిష్కారం ఏమిటి?

- జి.ఎన్.ఆర్., గుజ్జ

నోటి పరిశుభ్రత లేనందువలన మీకు చిగుళ్ళ వ్యాధి సంక్రమిచుటవలన వాసన రావటం జరుగుతుంది. మీరు విధిగా దంతవైద్యుని సంప్రదించి పళ్ళకు స్కేలింగ్ చేసుకోవాలి. ఆపై దంతవైద్యుని సలహాలు పాటిస్తూ మీరు ఈ బాధను అధిగమించవచ్చు.

డాక్టర్ బి.వి.సుబ్రహ్మణ్యం, బి.డి.యస్.
దంతవ్యాధి నిపుణులు, ఒంగోలు.

★ ★ ★

నా వయస్సు 18 సం॥లు. నాలో అంతగా ఎదుగుదల లేదనిపిస్తోంది. 7వ తరగతి నుండి అయోడిన్ లోపం వల్ల గాయిటర్ ఏర్పడింది. డాక్టర్‌ను సంప్రదిస్తే కొంచెం వయస్సు వచ్చాక తగ్గిపోతుందన్నారు. దీనికి పరిష్కారం ఏమిటి? గాయిటర్ ఉంటే ఎదుగుదల ఉండదా?

- ఎస్.సూర్యలక్ష్మి, రాజమండ్రి

మీ ఎత్తు ఎంతో రాయలేదు. గాయిటర్ అంటే థైరాయిడ్ గ్రంథి యొక్క వాపు. ఇది ఎక్కువ మందిలో అయోడిన్ లోపం వలన వస్తుంది. దీని వలన శరీరంలో థైరాయిడ్ హార్మోన్ తగ్గిపోతుంది. అయోడిన్ లోపం వలననే కాకుండా వేరే ఇతర కారణాల వలన కూడా గాయిటర్ రావచ్చు. అందువలన మీరు డాక్టరుకు చూపించుకొని మీది ఏ రకమైన వాపు అనేది నిర్ధారించుకోవాలి. థైరాయిడ్ హార్మోన్ తక్కువగా (హైపో థైరాయిడిజమ్) ఉన్నపుడు ఎదుగుదల కూడా సక్రమంగా ఉండదు. ఇది చిన్నవయస్సులో వస్తే డ్వార్ఫిజమ్ అని, పెద్ద వయస్సులో అయితే మిక్సెడిమా అని అంటారు. ఇది వయస్సుతో పాటుతగ్గదు. డాక్టరుకు చూపించుకొని సరైన ట్రీట్‌మెంటు తీసికోవాలి.

డాక్టర్ చెరుకూరి సమత,
ఎం.బి.బి.ఎస్.,ఎం.డి.,(ఒబిఅండ్‌జి)
ప్రసూతి మరియు స్త్రీల వైద్యనిపుణులు, ఒంగోలు


పార్టీ నాయకుల పనితీరు మార్చుకోమని.
చెప్పారట.. అప్పటినుంచి ఇదే వరస!


లైసెన్స్.. నికాలో.. జల్దీ..
STOP

అంటే.. ఇకనుంచి..
మనలాంటి కవులు,చిత్రకారులు
మేధావులు పుట్టరన్నమాట
బహిరంగ
ప్రదేశాల్లో
సిగరెట్ నిషేధం

ఎ వూండెడ్ సిటిజెన్

నా ఉనికి మళ్లీ ప్రశ్నార్థకమయ్యింది
నాకు ప్రత్యేక భాష ఉండటం నేరమయ్యింది
సొంత సంస్కృతి కల్గి ఉండటం ఏవగింపయ్యింది
నా మత విశ్వాసాలు తిరిగి నిషేధించబడ్డాయి
ఎక్కడేం జరిగినా,
ఇక్కడ నాకు మాత్రమే ఎమర్జెన్సీ ప్రకటిస్తారు
పవిత్రమైన లౌకిక రాజ్యంలో
నా ప్రాథమిక హక్కులు సైతం నిర్వీర్యమవుతున్నాయి
ఎప్పటిలాగే
నా ఆధ్యాత్మిక ఉద్యమానికి ఛాందసపు రంగు పులిమారు
నా అంతర్గతంలోకి చొరబడి
నా యావత్ జీవనసరళిని అపహాస్యం పాల్జేశారు
ఏ పాడుబడిన పురానీ హవేలీలోనో,
ఏ మురికి వాడలోని పూరిగుడిసెలోనో,
ఏ మొండిగోడల పంచన వేచుకున్న డేరాలోనో
జిందగీ గుజారిష్ చేస్తున్న నన్ను ఉన్న పళంగా నేరస్తుణ్ణి
చేశారు
నా అనుమతి లేకుండానే 'పరీక్ష'కు నిలబెట్టి
నా స్వేచ్ఛకు ఆంక్షల సంకెళ్ళు బిగించారు
నా పూర్వీకుల నెత్తురోడిన గడ్డమీద
మా అమ్మీజాన్ నన్ను పురుడు పోసుకున్న నేలమీద
అర్థశతాబ్దంకు పైగా నిజాయితీగా చెమటోడ్చిన భూమి
మీద
నా సిటిజన్‌షిప్‌ని పెద్ద క్వశ్చన్ మార్క్ చేసి గల్లంతు చేశారు
నన్ను దేశద్రోహిని చేసేశారు
నిజానికి నా ఔలాద్‌ని మట్టుబెట్టే రహస్య ఎజెండా
ఏనాడో మొదలైంది ఖాదర్‌భాయీ!
నువ్వన్నట్టూ,
'నేను పుట్టకముందే నా పేరు దేశద్రోహుల జాబితాలో
చోటు చేసుకున్నట్టుంది!?'

- షేక్ పీరాన్

(కేంద్ర ప్రభుత్వం హత్య చేసిన 'సిమి'
యువకిశోరాలను తలచుకుంటూ..)

టెర్రరిస్టు పెద్దన్న అమెరికా

ప్రపంచాన యుద్ధమేఘాలావరించె
ఎదిరించగ సిద్ధం కావాలోయ్ జనం
శాంతి శాంతి శాంతి ఒకటే నినాదం
గగనమంత ప్రతిధ్వనించ శృతించండి గళం ॥ప్రపంచ॥
అమెరికన్ జార్జిబుష్ ఎందుకు నీ యుద్ధ బుసలు
ఆఫ్ఘన్ ప్రజలపైన కురిపిస్తావ్ బాంబులు
అగ్రరాజ్య అహంకార ఆధిపత్య పోరులో
అమాయకుల ఆయువులు కలిసిపోయె గాలిలో ॥ప్రపంచ॥
ఉగ్రవాది బిన్‌లాడెన్ నీ పెంపుడు మృగం నిజం
జగతిలోన ఎక్కడైన నీదన్నే టెర్రరిజం
రాజ్యాలను కూల్చడంలో నేతల హతమార్చడంలో
డాలర్లు, ఆయుధాలు నీవిచ్చిన ఊతం ॥ప్రపంచ॥
హిరోషిమా, నాగసాకి నోళ్లకాడు చేసిన
నరభక్షక టెర్రరిస్ట్ పెద్దన్నవు నువుకాదా
వియత్నాం గెడ్డమీద పాలస్తీనిరాక్‌పైన
ఎన్నెన్నో దేశాల్లో నీదే మారణహోమం ॥ప్రపంచ॥
అన్నం వస్త్రాలు లేక అలమటించు జనం
ధరిత్రిలో సగం పెరిగె అది నీవిచ్చిన వరం
ఆంక్షలతో అభివృద్ధికి అడ్డకట్ట వేస్తూ
బడుగు దేశ ప్రజల కడుపుకొట్టుటె నీ మతం ॥ప్రపంచ॥
అణుబాంబు న్యూట్రాను నూతన స్టార్ వార్సయిన
జగతిలోన ప్రతి సృష్టికి శ్రమశక్తే మూలం
కష్టజీవి కడుపుమంట రగిలిందా దావానలం
చుట్టుముడితె తప్పదు నీ సామ్రాజ్యం దహనం ॥ప్రపంచ॥
మానవాళి తలచుకుంటే యుద్ధం మటుమాయం
శాంతికొరకు పోరాటం ప్రతి మనిషి కర్తవ్యం
సమతత్వం స్వాతంత్ర్యం సోషలిజం సమభావం
ఉన్ననాడే స్వేచ్ఛగెగురు శాంతికపోతం ॥ప్రపంచ॥

- చల్లా విశ్వనాధం

పిల్లల్లో సమభావం పెంపొందించాలి

వి.ఆర్.వాగోలు

మనుషుల జీవితంలో బాల్య దశ ఎంతో ఉన్నతమైనది. ఏ విధమైన భేషజాలు లేనటువంటి, కల్మషం లేని నిజమైన ఆనందానుభూతులను పొందే దశ కేవలం బాల్యమే అనడంలో ఎటువంటి సందేహం లేదు. బాల్యంలో ఎటువంటి చీకు, చింత, కష్ట నష్టాలు, బరువు బాధ్యతలు ఉండవు. అందుకే బాల్య దశ కుండే ప్రాముఖ్యత మరి ఏ దశకూ ఉండదు. ఇటువంటి బాల్య దశలో చిన్నారుల మనసుల్లో నాటుకొనే అభిప్రాయాలు, భావాలు వారి భావి జీవితంలో కూడా శాశ్వతంగా నిలిచి ఉంటాయనడం సత్యదూరం కాదు. మరి అటువంటి బాల్య జీవితంలో బాలబాలికల పసి హృదయాల్లో ఎటువంటి భావనలు ఏర్పడేలా చూడాలన్నది, ఏ రకమైన అభిప్రాయాలు ఏర్పడుతున్నాయన్నది గమనించడం ముఖ్యం.

నేను ఇటీవల మా మిత్రునితో పని ఉండి వాళ్ళ ఊరు వెళ్ళాను. ఇద్దరం సాయంత్రం వేళ బయటకు వచ్చి ఆ ఇంటి ప్రక్కనే కాస్తంత ఆటస్థలం ఉంటే దానిలో కూర్చుని కబుర్లలో పడ్డాం. కొంతమంది బాలబాలికలు ఆ ఆటస్థలంలోనే ఆటలాడుకుంటున్నారు. కొద్దిసేపటికి వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి రెండు జట్లుగా విడిపోయారు. మేము రైటంటే మేము రైటంటూ ఇరు జట్ల వారు వాదించుకుంటూ చివరికి ఒకరినొకరు చూసుకుందాం రండి అంటూ సవాళ్ళు విసురుకోవడం ప్రారంభించారు. ఆఖరుకు ఈ ఊళ్ళో మీ యింటి పేరిట వాళ్ళు ఇంతమంది ఉంటే మా యింటి పేరిట వాళ్ళు ఇంతమంది ఉన్నారంటూ పెద్దలు పోట్లాడుకొనే రీతిలో పోట్లాడుకుంటున్నారు. ఈ సందడికి మేం ముచ్చట్లు ఆపి వారిని చూస్తూ కూర్చున్నాం. పిల్లల్లోనే అంత పట్టుదల ఏమిటబ్బా అనుకుంటూ విషయమేమిటని మా మిత్రుడిని అడిగాను. దానికి మా మిత్రుడు వారంతా ఒకే వర్గానికి చెందిన వారని గత ఎన్నికలలో వారి మధ్య తేడాలొచ్చి ఇరు వర్గాలుగా విడిపోయారని అపుడపుడు పెద్దల మధ్య చిన్న చిన్న తగాదాలు ఏర్పాడుతున్నాయని చెప్పాడు. నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. దీనిని బట్టి పెద్దలను పిల్లలు ఎలా పరిశీలిస్తున్నారో పెద్దల మాటలూ, చేతలు పిల్లలపై ఎలా పని చేస్తున్నాయో తెలియవచ్చింది. తీరా పిల్లల వయస్సంతా పది సంవత్సరాలలోపు కావడం విశేషంగా చెప్పవచ్చు.

సాధారణంగా పది పన్నెండేళ్ళ వయస్సు బాలబాలికలు సమవయస్క బృందాలతో స్నేహించే అలవాటున్నా ఎక్కువ మంది పిల్లలు అందరితో కలిసి పోయే తత్వం కలిగి ఉంటారు. ఆటపాటల్లో అభిప్రాయ భేదాలు వచ్చినా, కొట్టుకున్నా, తిట్టుకున్నా అది చాలా తక్కువ కాలమే ఉంటుంది. తర్వాత మరలా అంతా కలిసిపోవడం సహజంగా జరుగుతుంది. ఆ వయస్సు పిల్లల్లో ఆ లక్షణం సహజాతి సహజం. ఆ వయస్సు బాలబాలికల్లో శాశ్వత కోపంగాని, శాశ్వత ప్రేమగాని ఉండవు. అప్పటికప్పుడే ప్రేమ, అప్పటి కప్పుడే పరిసరాల ప్రభావం ఎంతో ఉంటుందని, అది తనదైన ముద్ర వేస్తుందని పై సంఘటన రుజువు చేస్తోంది.

పిల్లలు తమచుట్టూ వున్న పరిసరాలను తమకు తెలియకుండానే గమనిస్తుంటారు. వారి వ్యవహార శైలి కూడా అందుకనుగుణంగా మారుతూ ఉంటుంది. ఒకే రకమైన సంఘటనలు అదే పనిగా గమనించడం వల్ల కూడా వారి ప్రవర్తనలో మార్పు వచ్చే అవకాశం వుంది. ఆ వయస్సులో చిన్నారులకు కావలసింది కాస్తంత మార్గదర్శకత్వమే గాని పంతాలు పట్టింపులు కాదు. తన తోటి సహచరులతో కలిసి ఆటపాటలతో ఆనందించాల్సిన చిన్నారులలో కోపం, ద్వేషం క్రమంగా గూడు కట్టుకుంటుందన్న విషయం ఇక్కడ గమనించాలి. ఆ లక్షణాలు మరింత పెరగకుండా బాలబాలికలను వాటి నుండి దృష్టి మరల్చాల్సిన బాధ్యత ఇటు తల్లిదండ్రులపైనా, అటు సమాజంపైనా ఉంది.

ఇటువంటి విషయాలలో సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలో నివశిస్తున్నప్పుడు ఇరుగు పొరుగు వారితో గొడవలు రావడం సహజమే. భేదాభిప్రాయాల వల్ల ఒకరితో ఒకరు పోట్లాడుకోవడం, అరుచుకోవడం సహజంగా జరిగే విషయాలే. అయితే వీటి ప్రభావం అభంశుభం తెలియని లేతమనస్సులపై ఎంతమాత్రం పడకుండా జాగ్రత్తపడాలి. పైన చెప్పినట్లు పిల్లల్లో శాశ్వత ప్రేమకాని, శాశ్వత కోపంగానీ ఉండవు కనుక వారు అందరితో కలివిడిగా ఉంటుంటారు. వారిని అలాగే ఉండనివ్వాలి. అంతేకాని ఇతరులకు తమకు గొడవ జరిగింది కదా అని వారి పిల్లలలో తమ పిల్లల్ని కలవ్వద్దని, తమ పిల్లలతో ఆడుకోవద్దని చెప్పడం గాని, మాట్లాడవద్దని, వారి ఇళ్ళకు వెళ్ళవద్దని చెప్పడం అంత మంచి పద్ధతి కాదు. ఇలా చేయడం వల్ల పిన్న వయస్సులోనే కొందరి పట్ల కోపం, ద్వేషం ఏర్పడి క్రమంగా పెద్దవవుతాయి. దీనికి తోడు చిన్నారులు పెద్దల తగాదాలు వింటూ వారిలా అనుకరిస్తూ తాము కొత్త సమస్యలు సృష్టిస్తారు.

పిల్లలకు నేర్పాల్సింది ఆప్యాయత, అనురాగం, స్నేహాలనే కాని అసూయ, కోపం, ద్వేషాలను కాదు. దీనికి పెద్దలు తమ మధ్య ఎంతటి స్పర్ధలు వున్నా అవి చిన్నారుల వద్ద ప్రస్తావించడం, వారున్నప్పుడు పెద్దగా అరుచుకోవడం, తగవులాడుకోవడం చేయరాదు. పిల్లలకు సాధ్యమైనంత వరకు ప్రేమ, వాత్సల్యపూరిత అప్యాయత, అనురాగాలు చూపించాలి. ఎట్టి పరిస్థితులలోనూ వారి వద్ద కోపం, ద్వేషాలకు సంబంధించిన విషయాలు ప్రస్తావించడం మంచిది కాదు. పిల్లలు పోట్లాడుకుని తమ వద్దకు వస్తే సాధ్యమైనంత వరకు పోట్లాట పెద్దది కాకుండా శాంతంగా మాట్లాడి అవసరమైతే తమ పిల్లలనే గద్దించాలి. ఆట పాటలన్న తరువాత చిన్న అభిప్రాయ భేదాలు సహజమని, దానికోసం పోట్లాడకోరాదని, అందరూ కలిసి మెలిసి వుండాలని అనునయంగా తెలియపరచాలి. అంతేకాని పిల్లల తగాదాను ఆసరాగా తీసుకొని తమ మధ్య ఉన్న అంతరాలు తవ్వితీసి సమస్యను పెద్దది చేయటం ద్వారా చిరు హృదయాలలో ఏర్పడాల్సిన ప్రేమ, ఆప్యాయత, అనురాగం, జాలి, సహాయ గుణాల స్థానే పరిసరాలు, వ్యక్తుల పట్ల ద్వేషం, కోపం అసూయ చోటు చేసుకుంటాయి.

కనుక పిల్లల ప్రవర్తనలో కలిగే మార్పులను పెద్దలు ఒకింత గమనిస్తూ వారిలో మంచి లక్షణాలు అలవడేలా చేసే బాధ్యత, సమాజానికుపయోగపడే ఉపకరణాలుగా మలచే విధి తల్లిదండ్రులదే అనడంలో సందేహంలేదు. ★

ధైర్యవంతుడు

పుసూరులో పూర్ణయ్యకు బద్రు ఒక్కడే కొడుకు. చిన్నప్పటినుండి అల్లారుముద్దుగా పెంచారు. ఎలాంటి కష్టం తెలియకుండా పెరిగాడు బద్రు. ఒక్కడే కొడుకు కావడం వలన చాలా గారాబంగా పెంచారు అతన్ని. దానికి తోడు రాత్రి అంటే బద్రుకు చాలా భయం. దానికి కారణం అతని తల్లిదండ్రులే. బద్రు మీద ఉన్న ప్రేమతో అతను రాత్రిపూట బయట తిరగకుండా ఉండటానికి గాను రాత్రివేళ దయ్యాలు తిరుగుతాయని చెప్పేవారు అతనికి. ఊరిచివర ఉన్న మర్రిచెట్టు వద్ద అవి ఉంటాయని అతన్ని భయపెట్టేవారు.

పెరిగి పెద్దవాడయినా రాత్రి అన్నా, దయ్యాలన్నా అతనికి చాలా భయం పట్టుకుంది. చిన్నతనంలో ఎలాగో గడిచినా పెద్దయ్యాక అదో, ఇదో పనిమీద పట్నం వెళ్ళాల్సి వచ్చేది. పని ఆలస్యం అయితే చీకటి పడే వేళకు గ్రామానికి చేరుకోవాల్సి వచ్చేది. ఎప్పుడూ ఎవరో ఒకరు తోడు ఉండేలా పట్నం నుండి తిరిగి వస్తున్నాడు బద్రు. మర్రిచెట్టు దగ్గర ఉన్న దయ్యాలు ఏం చేస్తాయోనన్న భయం పెరిగి పెద్దదయ్యింది.

ఒకనాడు సంతలో ఒక మంత్రగాడు బద్రుకు కలిసాడు. తనకు దయ్యాలంటే భయమని చెప్పాడు బద్రు. దానికి మంత్రగాడు..

'దయ్యాలుంటాయి కానీ, అవి మన దగ్గరకు రాకుండా చేసే మహిమ గల తాయెత్తులు నా దగ్గర ఉన్నాయి' అని చెప్పాడు. కొంత డబ్బు తీసుకొని బద్రుకు తాయత్తు కట్టాడు.

'ఇక నుండి నీ దగ్గరకు దయ్యాలు రావు. నువ్వు ఎక్కడ తిరిగినా ఏమీ కాదు' అని ధైర్యం చెప్పాడు. తాయెత్తు కట్టుకున్న బద్రు ఆనాటి నుండి రాత్రిళ్లు ఏంతో ధైర్యంగా తిరిగేవాడు.

ఒకరోజు ఆలస్యంగా ఇంటికి బయలుదేరాడు. ఊరి చివర ఉన్న మర్రిచెట్టు దగ్గరకు రాగానే చిన్నప్పుడు అతని తల్లిదండ్రులు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. 'అయినా అవి ఉంటే నన్నేం చేస్తాయి, నా దగ్గర తాయెత్తు ఉంది కదా' అని అనుకుంటూ ధైర్యంగా వడివడిగా నడుస్తూ ఇంటికి చేరుకున్నాడు.

ఇంటికి వచ్చాక స్నానం చేయడానికి బట్టలు మార్చుకుంటుంటే తాయెత్తు కనిపించలేదు. కంగారుగా వెదుకుతున్న బద్రును చూసి అతని భార్య 'ఏమిటి వెదుకుతున్నారు' అని అడిగింది.

'నా తాయత్తు కనపడిందా' అని ఆందోళనగా అడిగాడు బద్రు.

'పొద్దున మంచంలో దొరికింది, తీసి దాచిపెట్టాను' అంటూ తాయత్తును తెచ్చి ఇచ్చింది అతని భార్య.

అప్పుడు బద్రు ఆలోచించాడు. 'అంటే పొద్దుట నుండి తాయత్తు నా దగ్గర లేదన్నమాట. తాయత్తు లేకున్నా నాకు ఏం కాలేదంటే, దయ్యాలు లేవన్నమాటే. ఇన్ని రోజులూ దయ్యాలున్నాయని నమ్మి ఎంతో ఆందోళన పడ్డాను' అని అనుకున్నాడు.

ఆనాటి నుండి దయ్యాలు, భూతాలనే కాదు తాయత్తులను కూడా బద్రు నమ్మలేదు. దయ్యాలు కానీ, మహిమలు కానీ ఏవీ లేవని ఊర్లో వారందరికీ కూడా చెప్పాడు. తన అనుభవాన్ని ఇతరులకు చెప్పి మనలో ధైర్యం ఉంటే సరిపోతుంది, ఎలాంటి అతీతశక్తి లేదని అందరికీ అర్థమయ్యేలా వివరించాడు.

-అమ్మిన శ్రీనివాసరాజు

కథలు పంపండి

నేస్తాలూ,

మీరు ఏమైనా కథలు రాస్తే వాటిని ఈ శీర్షికకు పంపండి. బాగున్న వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాం. మీరు పంపే కథలు విజ్ఞానం అందించేవి గాను, మంచి విషయాలు బోధించేవి గాను ఉండాలి. ఇప్పటికే వచ్చిన కథలు కాకుండా మీరు సొంతంగా రాసిన కథలు పంపండి. మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చూపించి వారి సంతకంతో పంపితే ప్రచురిస్తాం.



ఉత్సాహాన్నిచ్చే బాలల దినోత్సవం

నేస్తాలూ,

ఈ నెల 14వ తేదీ మీ పండుగే. అదే బాలల దినోత్సవం. ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం జరుగుతుంది. ఆ రోజు చాచా నెహ్రూ పుట్టినరోజు. నెహ్రూకు పిల్లలంటే ఎంతో ప్రేమ. అందుకే ఆయన పుట్టినరోజునే పిల్లల పండుగగా ప్రభుత్వం ప్రకటించి, జరుపుతోంది. ఆ గొప్ప వ్యక్తి గురించి ఈ సందర్భంగా కొన్ని వివరాలు తెలుసుకుందాం..

స్వాతంత్ర్యం వచ్చాక ఆయన మన దేశానికి మొట్టమొదటి ప్రధానిగా పనిచేశారు. ఆయన 1889 నవంబర్ 14న జన్మించారు. ఆయన తల్లిదండ్రుల పేర్లు స్వరూపరాణి, మోతీలాల్ నెహ్రూ. ఆయనకు మంచి విద్య చెప్పించేందుకు గాను ఇంగ్లాండ్‌లోని ఓ బోర్డింగ్‌కు స్కూల్లో చదివించారు. ఆయన చదువుకున్న హారో పాఠశాలకు కూడా ఓ చరిత్ర ఉంది. ఇంగ్లాండ్‌కు ప్రధానులుగా పనిచేసినవారిలో చాలామంది ఆ పాఠశాలలోనే చదువుకున్నారు. కేంబ్రిడ్జి యూనివర్శిటీ నుండి ఎం.ఎ. పట్టా పుచ్చుకున్న నెహ్రూ, ఇండియాకు బారిస్టర్‌గా తిరిగివచ్చారు. ఆయన వివాహం కమలాకౌల్‌తో జరిగింది.

విద్యాపరంగా ఆయనకు ఉన్న విజ్ఞానం అపారమే అయినా ఆయన్ను న్యాయవాద వృత్తి అంతగా ఆకర్షించలేదు. అందుకే ఆయన గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. కొంతకాలం అలహాబాద్ మున్సిపల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఆ తరువాత ఆయన బాలగంగాధర తిలక్, అనీబిసెంట్ స్థాపించిన హోంరూల్ లీగ్‌లో చేరారు. స్వాతంత్ర్యోద్యమం సందర్భంగా ఆయన అనేక సార్లు జైలుకు వెళ్లారు. ఐదుసార్లు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సంపూర్ణ స్వాతంత్ర్యమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకోవడం వెనక నెహ్రూ కృషి చాలా ఉంది. 1947లో మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆయన ఏకగ్రీవంగా ప్రధాని పదవికి ఎన్నికయ్యారు. 17 ఏళ్ల పాటు ఆయన ప్రధానిగా పనిచేశారు. మనదేశానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు ఆయన పాటుపడ్డారు. 1955లో ఆయనకు 'భారతరత్న' బిరుదు లభించింది.

ఆయన కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు. ఆయన తత్వవేత్త. అంతేకాక మంచి రచయిత కూడా. ఆయన రాసిన అనేక పుస్తకాల్లో బాగా ప్రాచుర్యం పొందినవి 'డిస్కవరీ ఆఫ్ ఇండియా', 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 'లెటర్స్ ఫ్రమ్ ఎ ఫాదర్ టు ఎ డాటర్'. 1964, మే 27న ఆయన చనిపోయారు.

నేస్తాలూ, చాచా నెహ్రూ గురించి తెలిసింది కదా. ఈ బాలల దినోత్సవానికి మీ పాఠశాలలో కూడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాసరచన పోటీ, చిత్రలేఖనం పోటీ...ఇలాంటివి అన్నీ జరుగుతాయి. మీరు వాటిల్లో ఉత్సాహంగా పాల్గొనండి. బహుమతులు గెలుచుకోండి. ఆనందంగా గడపండి. ఉంటాను.

మీ నేస్తం

ఎవరెవరు ! ఏ మతాబు ?



నేస్తాలూ,

ఈ వారం

చిన్నారి చిత్రకారులు

పి. జాహ్నవి,
2వతరగతి
బివిబిపి స్కూల్,
హైదరాబాద్

డి. శిరీష,
9వ తరగతి,
ఆదర్శ విద్యాపీఠం, అబ్బాస్‌నగర్,
కర్నూల్-2



ఎ. గోపాలకృష్ణ, 9వతరగతి
జడ్‌పిహైస్కూల్, సోంపేట,
శ్రీకాకుళం జిల్లా

ఎన్. ధనరాజు,
10వతరగతి
ప్రభుత్వ బాలురోన్నత పాఠశాల,
కొత్తపేట,
తూర్పు గోదావరి జిల్లా

బొమ్మలో ఐదుగురు చిన్నారులు మతాబులు కాలుస్తున్నారు చూశారు కదా. వారు ఎవరెవరు ఏ మతాబు కాలుస్తున్నారో తెలుసుకోవడమే మీ పని. కమాన్ క్విక్. మీరు తికమకపడితే జవాబు కోసం కింద చూడండి....



1-సి, 2-డి, 3-ఇ, 4-బి, 5-ఎ

కలంస్నేహం

పేరు : చిందం రామలింగం
వయస్సు : 10
చదువు: 5వ తరగతి
హాబీలు : కథలు పుస్తకాలు చదవడం
పూర్తి చిరునామా : కేరాఫ్ మైత్రి విద్యాలయం, వెల్లంకి, రామన్నపేట మండలం, నల్గొండ జిల్లా-508113

పేరు: రాంమోజు స్వాతి
వయస్సు: 12
చదువు: 7వ తరగతి
హాబీలు: క్యారమ్స్ ఆడటం, కథలు చదవడం
పూర్తి చిరునామా: డాటరాఫ్ భిక్షమాచారి, గ్రామం : గుజ్జ, మండలం : సంస్థాన్‌నారాయణపురం, జిల్లా : నల్లగొండ-508253

పేరు: దిడ్డి సాయి కిరణ్
వయస్సు: 6
చదువు: 1వ తరగతి
హాబీలు: క్యారమ్స్ ఆడటం, టీవీ చూడటం
పూర్తి చిరునామా: సన్నాఫ్ దిడ్డి సిద్ధిరాములు, కేరాఫ్ రేణుక పబ్లిక్ స్కూల్, వైశ్య భవన్ ప్రక్కన, ఎల్లారెడ్డి, నిజామాబాద్ జిల్లా-503122

బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం
బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం బాలల దినోత్సవం

రుక్మిణి

రోత ప్రకటనలన్నీ మూతబడిం తర్వాత - అసలు సిసలైన 'డయల్ యువర్ సి.ఎం.' - ముఖాముఖి కార్యక్రమం మొదలయింది. మల్లేషూ... యాద్గిరీ... జక్కులోడూ మహాహుషారుగా టీవీ తెరతే కండ్లప్పగించి గుడ్లగూబల్లా చూస్తున్నారు.

"హలో... హలో... సి.యం.గారేనా... నేనండీ.. మన సరళీకాంతరావుని.. అరె... బుందేల్‌ఖండ్ నుండి మాట్లాడుత....

"మాట్లాడండి.... మాట్లాడండి...

"ఈ బస్సులు... అదే ఆర్టీసి వాండ్ల స్ట్రయికుతో సచ్చిపోతుండామండీ.... అస్సలు మీ పాలనలో కూడా ఈ స్ట్రయికులు చేసే అధికారం ఈళ్ళకెవడిచ్చినాడండీ.. అస్సలు మరి మీరెట్లా ఊరుకుంటున్నారండీ... ఏదో ఛార్జీలు పెంచితే స్ట్రయికు... జీతాలు పెంచాలని స్ట్రయికు అబ్బే... ఇవ్వేం బాగులేవండి... అస్సలు ఈ బస్సులన్నింటినీ ప్రైవేటు వారి కప్పంజెపితే ఈ గోలంతా వుండదని మా అప్పా... పక్కింటి అప్పయ్యా అనుకుంటామండి... హలో... ఏమంటారు సి.యం.గారూ..

"చూడు బ్రదర్... ఈ స్ట్రయికులన్నీ రాజకీయమే! స్వర్ణాంధ్రను సాధించడం ఇష్టం లేని అతికొద్ది మంది వెనకవుండి నడిపిస్తున్న రాజకీయ నాటకం.. కరువులూ.. వరదలూ ఇంకుడు గుంతలూ... జన్మభూమీ... అ.సంక్రాంతా వీళ్ళకు పట్టదు... అరే... మీ కోరిక మేరకు... అటు బ్యాంకు వారి సూచనల మేరకు మీ అందరి కుటుంబ సౌఖ్యం కోసం... మీరంతా అంత 'ఇది'గా మీరు ప్రైవేటు పరం చేయాలని పట్టుబట్టితే కాస్తంత సందుజూసుకుని దానికో మంత్రివర్గ ఉపసంఘం వేసి తప్పక పరిశీలిద్దాం... చూడండి.. హలో... మన బడ్జెటంతా ఉద్యోగుల మేతకేనాయె... మీ అప్పనూ... పక్కింటి అప్పయ్యనూ ఈ విషయంలో ఓదార్చి కాస్తంత ఓపిక పట్టమనండి... అంతా పారదర్శకం... "ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్..."

(స్టూలు మీది మల్లేషు ముందుగా వెనక్కి వెల్లకిలా విరుచుకు పడిపోయాడు)

"హలో... సి.యం.గారేనా... సార్సార్.. నేనండీ... బాకా ప్రసాదుని... మీరు మొన్న హెలికాప్టర్లో దిగుతుండగా బంతిపూలు గుమ్మరించాను. అబ్బో... అబ్బో.... మీ కార్యదీక్షా... స్వర్ణాంధ్రకు మీరు కట్టుకున్న కంకణం చూసి మేమందరమూ తలా ఓటి తగిలించుకున్నాం.. హలో.. రోజుకు మీరు 18 గంటలు పని చేస్తే... అబ్బా... ఎట్లా తట్టుకుంటున్నారబ్బా... ఏ ఏ లేహ్యాలూ... ఏ గుళికలూ మింగి ఏ భస్మాలు పూసుకుంటున్నారూ... అస్సలు మీ ఆరోగ్య రహస్యం ఏమిటండీ... హలో.. నేనేసార్ బాకా ప్రసాదుని... టింబక్టూ నుండి... టింబక్టూ...

"ఓహో.... ప్రసాదుగారు... టింబక్టూ... అవునవును... బంతిపూలు మన ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం... మీరేదో లేహ్యాలూ... గుళికలూ అడిగారు... అబ్బే... టోటల్‌గా నేను వాటి జోలికి పోనని తెలియజేసుకుంటున్నాను - నిరాడంబరం... పారదర్శకత... ఒంటిపూట భోజనం... కంప్యూటరు ముందేసుకుంటే కంటికి కునుకే పట్టదు - సమయపాలన... నిర్ణీత సమయం... నిత్యధ్యానం... హెలికాప్టర్లో వున్నా... హోల్పీహిల్సులో వున్నా అదిమాత్రం తప్పదు - దాంతో అసలు ఆకలి దప్పులుండవు - మీ కోరిక ప్రకారం మన పౌరులందరికీ మెగా యోగా... అపుడపుడు యాగాలు గట్రా చేస్తే పంట పొలాలు పచ్చగా పండి కలకలలాడతాయని తెలియ జేసుకుంటున్నాను. నన్నీ ప్రజలు ఆమోదించారు.... నా విధానాలను ఆశీర్వదించారు - జన్మనప్పార్తి భూమిలో జనం కలగాపులగంగా కలిసిపోయి అయ్‌టీ రంగంలో విశేషంగా విదేశీ మారకద్రవ్యం సంపాదించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నాను...." ట్రింగ్... ట్రింగ్...

(అప్పటికే జక్కులోడు నోరు బార్లా తెరిచి గోడకు జారగిలబడి సన్నని గురకలో మెగా నిద్రలోకి జారుతున్నాడు)

"హల్లో... స్సీయెంగారూ... దోకుబాబు నుండే.. మ.. మద్యం ప్రదేస్.. హ్హహ్హా... మాది మద్యపురవేగానీ.. అంతటా మద్యం పారీపారీ 'మద్యంప్రదేసం' అయిపోంది.. ఈ బ్రాండిసాపులో శ్చు... వ్క్... సిండికేట్లు గట్టి యమగా పెంచి పారేస్తంటే.... అటేమో జనం మన 'కుటీర పరిశ్రమ'ల్లో బెల్లం సారా మన ఇంకుడు గుంతల్నుండి ఇరగ పార్తంది - జనం తాగి టపుకూ... టపుకూ రాలిపోతున్నారు గానీ.. మార్గం దొరకడం లేదండి.. అసలే బ్రాండి సాపులికీ.. బెల్లం సారాకీ తేడా తెలవక తన్నుకుని సస్తన్నం... అంతా గందరగోళం.. యాఖ్... దీన్ని కట్టడి చేసే మార్గం సూపి పుణ్యం కట్టుకోవాలె.. హహహ్హా... హహ...!"

"దోను బాబుగారూ... మీ బాధనాకర్థమైంది.... 'స్వర్ణాంధ్రప్రదేశ్'లో టూరిజం టోటల్‌గా అభివృద్ధి చెందాలంటే మద్యం... బార్లు... బీర్లు చాలా ముఖ్యం! మీరు ఎక్సైజు బంట్రోతుల్ని నిలదీయండి! నిఘా సంఘాలుగా తయారై స్వచ్ఛమైన మద్యం కోసం డిమాండ్ చేయండి - అవసరంగా త్వరలోనే మీ 'కుటీర పరిశ్రమల్ని' క్రమబద్ధం చేయడానికీ... పూర్తి స్వచ్ఛమైన పారదర్శకమైన సారా వుత్పత్తులను విదేశీ నిపుణుల సహాయంతో పర్యవేక్షింపచేయడానికి ఒక కమిటీని నియమిస్తానని తెలియజేసుకుంటున్నాను!" ట్రింగ్... ట్రింగ్.. ట్రింగ్...!

(జక్కులోడి పెండ్లాం వంటింట్లో నుండి రెండు గిన్నెలూ.. ఒక తపేలా భారీగా బయటకు విసిరేసింది)

"హలో.. హలో... నాది కుప్పమండి.. కుక్క కార్పోటమ్మను.. మా దగ్గిర 'మీ' యవసాయం... అబ్బో... అసలు మొత్తం రాష్ట్రంలోని బీడూ...గోడూ... పంట పొలాలన్నింటికీ ఇజ్రేలు టైపు యవసాయం మొదలు పెట్టే ఆలోచనుందా? హలో... లేకుంటే వెంటనే చేసి పారెయ్యండి!"

"కార్పోటమ్మగారూ... అది మంచి ఫలితాల్నిస్తుందని మీరు గమనించినందుకు అభినందనలు! అసలు మన రైతు సోదరుల 'మైండ్‌సెట్' చేసే సెటప్పులోనే వున్నా... దానికి విదేశీ నిపుణుల కమిటీని ఇక్కడికీ... ఇక్కడి మంత్రులను విదేశాలకూ పంపించి టోటల్‌గా పరిశీలించి దాని ఫలితాలను పర్యవేక్షించడానికో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తానని తెలియజేసుకుంటున్నాను" ట్రింగ్... ట్రింగ్.... (యాద్గిరి పిచ్చిపట్టిన వాడిలా రెండు గుప్పిళ్ళ జుట్టు పీక్కుని కూలబడ్డాడు)

"భలే మేళారావునండి... టూరిజం... విదేశీమారక ద్రవ్యంలో మీ పకడ్బందీ ప్రణాళిక అద్భుతం! మన గ్రేట్ మాత... హైదరాబాద్ నెక్లెసురోడ్డు... సైబరాబాదు... శిల్పారామం... హైటెక్ సిటీ వీటినిండా ఎపుడు అభివృద్ధి చేస్తారండీ!"

"హలో... ఈ మన ప్రయత్నం మొదటిసారి ఆసియా ఖండంలోనే అపూర్వంగా జరిగింది గానీ... ప్రకృతీ కనికరించలేదు - ఉగ్రవాదులు ఊర్కోలేదు - అటు అమెరికాలో టవర్సూ... ఇటు ఆంధ్రాలో వాటర్సూ... జలప్రళయం... దానికో షెడ్యూలు పెట్టి ట్యూరిజం ప్యాకేజీ క్రింద మలేషియా.. సింగపూర్.. అండమాన్, నికోబార్‌లకు యాత్రలు ఏర్పాటు చేస్తున్నాం! ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్... జాగింగ్... వాకింగ్... జాబ్‌మ్యూజిక్... వెంగాడాన్సు... అసలు మన ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అవే! బోటు షికారులో బతుకు బాటనే మార్చుకోవచ్చు! ఫ్లై ఓవర్లలో ఓవర్‌నైట్‌లో మీ కాళ్ళ మీద మీరు నిలబడవచ్చు....!" ట్రింగ్... ట్రింగ్...

(జక్కులోడి భార్య టి.వి. స్విచ్చిపీకి అవతల పారేసింది)

× × ×

చంద్రబాబుగారు చెమటల్లు తుడుచుకున్నారు. పక్కగది తలుపు తెరుచుకుని దర్శక బ్రహ్మ భాగవేంద్రగారూ... బిలబిలమని పదిమంది ఆర్టిస్టులూ పరుగెత్తుకుని వచ్చారు.

"సార్... ఇప్పటికి దాదాపు 147 సోమవారాలు ముఖాముఖి కార్యక్రమంలో ఈ పది బబ్బాచీలను మార్చి... మార్చి... ఏర్చి కూర్చిన ప్రశ్నలను మీతో ముఖాముఖిలో పకడ్బందీ స్క్రిప్టు డైలాగులు తయారు చేసి జరిపించాను. ఫుల్ సక్సెస్‌గదా... ఇదే మన ముఖాముఖి మూక!"

చంద్రబాబు గారు చిరునవ్వులు విరజిమ్మి వేలితో గెడ్డం గీక్కున్నాడు. ఆర్టిస్టులు నమస్కారాలు పెట్టి బయటపడ్డారు. "నాదో హైటెక్ ఆలోచన సార్... మందగ్గిరో మిమిక్రీ కళాకారుడు... పదికాదు... పాతిక గొంతుకలతో ప్రశ్నలడగ్గలడు... ఏకంగా రికార్డింగు చేసి ప్రవేశ పెడితే ఎట్లా వుంటుందంటారు!"

"వండ్రపుల్... స్వర్ణాంధ్రను సాధించడానికి మన మందరమూ కో ఆపరేట్ చేయాలి గదా!" ★

చొరవ తీసుకోండి

లక్ష్మి

పదిమంది ఆడవాళ్లు ఒక చోట కలుసుకునే సందర్భం ఎప్పుడోగాని రాదు. వరలక్ష్మీవ్రతం, పెళ్లిచూపుల్లాటి సందర్భాల్లో చుట్టుపక్కల ఆడవాళ్లంతా ఒకచోట కలుస్తారు. బావున్నారా అంటే బావున్నారాని కుశల ప్రశ్నలు వేసుకుంటారు. మనం కలుసుకుని చాలా కాలమైందని పరామర్శించుకుంటారు. ఆ కాసేపూ తెలిసిన వాళ్లందరి యోగక్షేమాలూ కనుక్కుంటారు. అల్లాంటి సందర్భాల్లోనే కామాక్షికి వేవిళ్లని తెలుస్తుంది. వనజకి ఆరోనెలని తెలుస్తుంది. కామాక్షమ్మ కలవరింతలు గురించి మాటాడుకుంటారు. సావిత్రి సంసారం గురించి దిగులు పడతారు. ఆడవాళ్లు అస్తమానం కలుసుకునే వీలుండదు గనక - కలుసుకున్నప్పుడు కొంచెం ఎక్కువ సేపు బాతాఖానీ నడుస్తుంది. ఈ మాత్రం దానికే ఓర్చుకోలేని మగాళ్లు - మీ మీటింగు పూర్తయిందాని ఎగతాళిగా అడిగి త్వరగా ముగించి బయటపడండనే వార్నింగ్ ధ్వని ప్రధానంగా వినిపిస్తారు! ఆడంగి ఖబుర్లకు అంతుండదని మండి పడతారు! ఆ ఖబుర్లే అప్పుడప్పుడు కొంపమీదికి తెచ్చిపెడతాయని కోప్పడతారు! ఆ మాటకొస్తే - మాయదారి ఖబుర్లు మోసుకొచ్చేది మగవాళ్లే!

ఆఫీసుల్లోనూ, వీధుల్లోనూ అడ్డమైన వార్తలు సేకరించే పనిమీద మగవాళ్లు బిజీగా వుంటారు. పుల్లయ్యకేం జరిగింది. ఎల్లయ్య ఏ ఊరు ఎందుకెళ్లేడు లాటి వార్తలు సేకరించి - ఇంటో చెప్పేది మగవాళ్లే. వాళ్లు చెప్పకపోతే ఇంటో వుండే ఆడవాళ్లకేం తెలుస్తాయి? సావిత్రి భర్తని పోలీసులు పట్టుకున్నారనే వార్త మోసుకొచ్చేది మగవాడే? అతనికంటే తాను ఎంతో గుణవంతుడ్నని చెప్పుకునేందుకు సమయం వచ్చినందుకు సంబరపడుతూ - ఆ అరెస్టు విషయం ఎంతో ఆనందంగా తన భార్య దుర్గకి చెబుతాడు. దుర్గ ఒక్క మీనాక్షికే చెబుతుంది. మీనాక్షి తులసికి చెప్పి ఊరుకుంటుంది. ఈ విధంగా సదరు అరెస్టు వార్త సావిత్రి మినహా - ఆవాడకట్టులో వున్న ఆడవాళ్లందరికీ తెలుస్తుంది. అయ్యోపాపమని అందరూ అనుకుంటారు. ఒకానొక పేరంటానికి సావిత్రి వస్తుంది. ఒక పెద్దావిడ సావిత్రిని వాటేసుకుని - అయ్యోతల్లీ నీకెన్ని కష్టాలొచ్చి పడ్డాయే అమ్మా అని రాగాలు తీస్తుంది. ఆ వరనకి సావిత్రి ఖిన్నురాలవుతుంది. తనని ఆ పెద్దావిడ ఎందుకు ఓదార్చుతుందో అర్ధం కాక ఆందోళన పడుతుంది!

నాకేం జరిగిందని అడగటానికి మనసొప్పదు. అడక్కపోతే అసలు విషయమేమిటో తెలీదు. సావిత్రికి ఏం చేయాలో తోచని సమయంలో ఎవరో ఒకావిడ - మీ ఆయన్ని ఏ జైల్లో పెట్టేరని అడుగుతుంది. ఆ ప్రశ్న వినగానే సావిత్రి షాకు తింటుంది. జైలేమిటీ అని ఖంగారుగా అడుగుతుంది. మీ ఆయన్ని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లార్టగా అంటుంది మరో ఆవిడ. ఆ మాట వినగానే సావిత్రి నివ్వెరపోతూ - ఈ విషయం మీకెవరు చెప్పేరని అడుగుతుంది. తులసి చెప్పిందంటుంది. మీకెవరు చెప్పేరని తులసినడిగితే ఫలానా మీనాక్షి చెప్పిందంటుంది. మీనాక్షినడిగితే దుర్గ చెప్పిందంటుంది. దుర్గ ఆ పేరంటానికి రాలేదు. అంచేత దుర్గకెవరు చెప్పేరో తెలుసుకునే అవకాశముండదు. సావిత్రి దుర్గని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోసి కసితీర్చుకుంటుంది. ఆనక అసలు కథ చెబుతుంది.!

సావిత్రి వాళ్ల మేనమామ రాజధాని నగరంలో పోలీసాఫీసరు. ఏదో పని మీద ఈ ఊరువచ్చి తన భర్తని ట్రావెలర్స్ బంగళాకి తీసుకెళ్లేడని చెబుతుంది. దానికింత రాద్ధాంతం చేయాలా అని దుర్గని దుమ్మెత్తిపోస్తుంది. మన ఆడవాళ్లకున్న తెగులే ఇదని - తప్పంతా ఆడవాళ్లకే అంటగట్టి అలిసిపోతుంది. ఈ తొందరపాటుతోనే మన ఆడవాళ్లని మనమే ఆడిపోసుకుంటున్నాం. ఈ రాద్ధాంతానికి మూలవిరాట్టు మగాడనే విషయం మరిచిపోతున్నాం. ఆ మాటకొస్తే ఒక్క దుర్గ మొగుడే కాదు - ఏ మొగుడైనా తెరవెనకే వుంటాడు. చేయవలసిన అల్లరి అతనే చేసి - ఆ తప్పు ఆడవాళ్ల వల్ల జరిగిందంటాడు. ఆడవాళ్ల నోట్లో ఆవగింజ నానదని వంకలు పెడతాడు. అంతేగాని అపార్ధాలు చేసుకుని కథలల్లే గుణం మగవాళ్లని అనాదిగా అంటిపెట్టుకు వున్నదని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించడు!

ట్రిక్కులు చేసేది మగాడే! మాటలు పడేది ఆడది! వెంకట్రావనే మనిషి చాలా బుద్ధిమంతుడు. వ్యసనాలేవీ లేని కుర్రాడు. అతనికి ఈ మధ్యనే పెళ్లయింది. ఆ వీధిలో వున్న ఆడవాళ్లంతా అతని సుగుణాలను మెచ్చుకోడం - మిగతా మగాళ్లకి ఈర్ష్యగా వుంటోంది. ఈ నేపథ్యంలో ఒకనాడు - ఆఫీసునుంచి వస్తున్న వెంకట్రావుకి సడన్‌గా వళ్లు తూలింది. నడిరోడ్డు మీద తూలిపడబోయి తమాయించుకుని - ఆటోని పిలిచి అందులో కూచున్నాడు. ఇదీ సన్నివేశం. ఈ సన్నివేశాన్ని రంగారావు చూసేడు. గబగబా యింటికొచ్చి గొప్పవార్త తెచ్చేనని ప్రకటించేడు. ఈ వీధిలో మహిళా లోకంతో మెప్పుపొందుతున్న వెంకట్రావు పట్టపగలే తాగేసి పట్టు తప్పేడంటాడు. రోడ్డు మీద జనాభా అతి కష్టమ్మీద అతన్ని ఆటో ఎక్కించేరంటాడు. అయ్యోపాపం అంటుంది మిసెస్ రంగారావు. ఆ మాటతో రంగారావుకి వళ్లు మండిపోతుంది. అతని మగబుద్ధి రోషంగా బుసలు కొడుతుంది. వాడు తాగితే ఎక్కడలేని జాలి - మేం తాగితే నరాలు తెగేలాగా ఏడుపు. అక్కడికి వాడు దేవదాసు - మేం పక్కా తాగుబోతులం. వాడు పుచ్చుకుంటే ఎవడు పెట్టిన శాపమోనని దీర్ఘాలు. మేం తాగితే ఏనాటి పాపమోనని శోకాలు. వాడు పట్టపగలు పుచ్చుకుంటే ఫర్లేదు. మేం రాత్రిళ్లు గుట్టుగా తాగితే కన్నీళ్లు - అంటో డిఫరెన్సులు చదివి తృప్తి పడతాడు!

తాక్కుండా మీటింగు పెట్టినందువల్ల - అవన్నీ వాస్తవాలనుకుంటుంది మిసెస్ రంగారావు. ఎంతో మంచి కుర్రాడు పతనమవుతున్నారని తెలిసింతర్వాత ఓర్చుకోలేదు. అతని భార్య ఎంత గాభరా పడుతుందోగదాని ఆందోళన పడుతుంది. వాళ్లింటికి వెళ్లి అతన్ని చివాట్లు పెట్టాలని కూడా అనుకుంటుంది. తాగిన మత్తులో అవన్నీ అతని తలకెక్కవని - తన ప్రయత్నానికి వాయిదా వేసుకుంటుంది. ఆ మరునాడు - మగవాళ్లంతా ఆఫీసుకెళ్లిం తర్వాత - మిసెస్ రంగారావు వెంకట్రావు యింటికి వెళ్లి మిసెస్ వెంకట్రావుని పలకరిస్తుంది. నీ భర్త అనవసరంగా పద్యాలు పాడితే ఖంగారు పడొద్దంటుంది. తాగిన మత్తులో వాళ్లకి పద్యాలే వస్తాయని సూత్రం చెబుతుంది. మళ్లా ఎప్పుడైనా మీ ఆయన తాగివస్తే పుట్టింటికి వెళ్లిపోతానని బెదిరించమని సలహా యిస్తుంది. మీ పెద్దవాళ్లనీ, వాళ్ల పెద్దవాళ్లనీ పిలుస్తానని భయపెట్టమంటుంది. ఇలాంటి దిక్కుమాలిన అలవాట్లను మొదట్లోనే తుంచేయాలని హెచ్చరిస్తుంది. ఆ హితోక్తులు విన్న మిసెస్ వెంకట్రావు తెల్లబోతుంది. ఆ తర్వాత కళ్లనీళ్లు పెట్టుకుంటుంది. ఎవరైనా పచ్చగా వుంటే మన ఆడవాళ్లు చూసి సహించలేరని చురక వేస్తుంది. నిన్న జరిగిన యదార్ధ విషయం వివరించి, మా వారు తాగి ఆటో ఎక్కినట్టు మీకెవరు చెప్పేరని అడుగుతుంది. మిసెస్ రంగారావు ఏం చెబుతుంది? తన భర్త పచ్చితాగుబోతే కాదు - చూపులో కూడా తేడాలున్న మనిషని నిజం చెప్పే చొరవ ఆమెకు లేదు. ఈ కారణంగానే ఇల్లాంటి అర్ధాంగులున్న మగవాళ్లు ఎన్ని తప్పులు చేస్తున్నామర్యాదగానే బతికేస్తున్నారు... ★

శిల్పకళా నిలయాలు పానగల్లు - కొలనుపాక

పెండెం జగదీశ్వర్


పచ్చల సోమేశ్వరాలయం

అద్భుతాలకు ఆలవాలమైన కొన్ని చారిత్రక కట్టడాలు, దేవాలయాలు తగిన ప్రచారం లేక జనాదరణను పొందలేకపోతున్నాయి. అలాంటి వాటిలో పానగల్లు ఒకటి. నల్లగొంఢ జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పానగల్లుకు చారిత్రక ప్రాశస్త్యం ఎంతో ఉంది.

11వ శతాబ్దంలో చోళులు పానగల్లును రాజధానిగా చేసుకొని కొంతకాలం పాటు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. వీరి అనంతరం చాళుక్యులు, కాకతీయులు పరిపాలన చేసినట్లు ఆధారాలున్నాయి. కాకతీయుల పరిపాలనా కాలంలోనే పానగల్లులో రెండు ప్రసిద్ధ దేవాలయాలు నిర్మింపబడ్డాయి. అవి పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయం. క్రీ.శ. 1124లో చోళ రాజ వంశస్థుడైన ఉదయరాజు పానగల్లులో పెద్ద చెరువును త్రవ్వించాడు. దీన్నే ఉదయ సముద్రమంటారు. నేటికీ దీన్ని దర్శించవచ్చు.

పానగల్లుకు వచ్చే పర్యాటకుల సంఖ్య తక్కువగానే ఉంటుంది. వసతి సౌకర్యాలు సరిగా లేకపోయినా దగ్గర్లోనే నల్లగొండ పట్టణం ఉన్నందున మనకు ఇబ్బందేం అన్పించదు. పచ్చల సోమేశ్వరాలయంలో గతంలో వజ్ర వైఢూర్యాలతో పొదిగిన శివలింగం ఉండేదని ప్రతీతి. అది వాస్తవమని నమ్మేందుకు రుజువులు కూడా సాక్షాత్కరిస్తాయి. దేవాలయ నిర్మాణంలో కాకతీయుల శిల్పకళ గోచరిస్తుంది. నల్లరాతితో నిర్మించిన శిల్పాలు చూపరుల్ని విశేషంగా అలరిస్తాయి. వివిధ కాలాలలో జరిగిన దాడుల్లో అనేక శిల్పాలు అంగ వైకల్యానికి గురయ్యాయి. ఆలయ పరిసర ప్రాంతమంతా శిల్పాల మయమే.

1923లో పురావస్తు శాఖవారు ఈ ఆలయాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాక ఇక్కడొక ఆర్కియాలాజికల్ మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రవేశానికి ఎటువంటి రుసుము వసూలు చేయరు. పానగల్లులో లభించిన శిల్పాలతో పాటు వివిధ ప్రాంతాలలో లభించిన శిల్పాలను పురాతన వస్తువులను మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. మ్యూజియం చుట్టూ వున్న పచ్చని చెట్లతో ఈ ప్రాంతం ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

పానగల్లులో మనల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసే అద్భుత దేవాలయం ఛాయాసోమేశ్వరాలయం. ఇది పానగల్లు చెరువు కింద వరి పొలాల మధ్య ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఇప్పటంత అభ్యున్నతిని సాధించని ఆ రోజుల్లోనే అమోఘమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించబడిన ఈ దేవాలయం చూపరుల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ఈ ఆలయంలోని శివలింగంపై ఎల్లప్పుడూ ఒక నీడ పడుతుంది. ఆ లింగానికి ఎదురుగా ఎటువంటి స్తంభం లేకున్నప్పటికీ దానికి స్తంభం ఆకృతి పడుతుంది. గర్భగుడి ద్వారం వద్ద నిలబడి ఎడమ వైపున వున్న స్తంభంపై చేతితో చరిస్తే మన చేతి నీడ లింగం మీద పడే నీడకు కుడివైపున కనబడుతుంది. అలాగే కుడివైపు స్తంభాన్ని చరిస్తే నీడకు ఎడమవైపు కనిపిస్తుంది. ఈ గమ్మత్తు కాంతికి సంబంధించిన ఓ నియమం ప్రకారం జరుగుతుంది. ఇన్ని ప్రత్యేకతలున్న పానగల్లును సందర్శించడం మనకొక గొప్ప అనుభూతిని మిగులుస్తుంది.

కొలనుపాక

సుప్రసిద్ధ జైన క్షేత్రమైన కొలనుపాక నల్లగొండ జిల్లా ఆలేరు పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలేరు నుండి ఆర్టీసి బస్సులు, ప్రయివేటు వాహనాలు పర్యాటకుల్ని కొలనుపాకకు తీసుకెళ్తాయి. భారతదేశంలోనే ప్రఖ్యాతి పొందిన జైన దేవాలయం ఇక్కడ ఉంది. కొలనుపాకలో రెండు ప్రసిద్ధ హిందూ దేవాలయాలు కూడా వున్నాయి.

11వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యుల ప్రతినిధులు కొలనుపాకను రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఇక్కడ లభించిన శాసనాలను బట్టి కొలనుపాకకు కొట్టియపాక, కొట్టిపాక, కొల్లిపాక, బింబావతిపురం, వ్యాఖ్యాననగరం అనే పేర్లున్నట్లు తెలుస్తుంది.

కొన్ని శతాబ్దాల క్రితం కొలనుపాక నాలుగు ద్వారాలు కలిగి 58 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన పెద్ద పట్టణం. ఆ నాలుగు ద్వారాలు నేటికీ కనిపిస్తాయి. ఒకనాడు వైభోగాన్ని అనుభవించిన ఈ పట్టణం ప్రస్తుతం చిన్న గ్రామంగా దర్శనమిస్తుంది. విశేషమేమిటంటే కొలనుపాక జైన మందిరం నుండి కేవలం యాభై అడుగులు పక్కకు నడిస్తే వరంగల్ జిల్లాలోని ఓ గ్రామంలో ఉంటాము.

కొలనుపాక అనగానే అందరికీ స్ఫురించేది జైన మందిరం గురించే. ఇప్పటికి 1817 సంవత్సరాల క్రితం దీన్ని నిర్మించారు. ఈ మధ్య కాలంలో దీన్ని పునర్నిర్మించారు. ఈ మందిరంలోని శిల్పకళను గురించి వర్ణించాలంటే మాటలు చాలవు. అత్యంత విశాలమైన ఈ మందిరంలో అడుగడుగున జైన సాంప్రదాయపు శిల్పకళ ఉట్టిపడుతుంది. మందిరం పై కప్పు భాగాన ఉన్న శిల్పాలు చూపరుల్ని అమితంగా ఆకట్టుకుంటాయి. రంగు రంగుల రాళ్ళతో స్తంభాలపై చెక్కిన పుష్పాలు, లతలు విశేషంగా ఆకర్షిస్తాయి. చల్లగా ఉండే మందిరం లోపల్నుంచి బయటకు రావాలనిపించదు. మందిరాన్ని పర్యవేక్షించే సిబ్బంది వచ్చిపోయే వారి వల్ల ఎటువంటి మలినం జరగకుండా జాగ్రత్తపడుతుంటారు. సకల సౌకర్యాలతో నిర్మించిన అధునాతన వసతి గృహాలు జైనుల వరకే పరిమితమయ్యాయి. బిచ్చగాళ్ళ సంఖ్య అధికంగా ఉంది. మందిరంలో 24 తీర్థంకరులలో మొదటి వాడైన వృషభ దేవుని విగ్రహం మధ్యలో ఉంటుంది. కుడివైపు పార్శ్వనాధుడు, ఎడమవైపు శాంతినాధుని ప్రతిమలున్నాయి. తీర్థంకరుల్లో చివరివాడైన వర్ధమాన మహావీరుని విగ్రహం ఐదు అడుగుల ఎత్తున ఫిరోజ్ రాతితో చెక్కారు. ఇది కోట్ల విలువ కలిగి వుంటుంది. జైన దేవత పద్మావతి విగ్రహం కూడా ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం చైత్రశద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు మూడు రోజులు ఉత్సవాలు జరుగుతాయి. దేశం నలుమూలల నుండి ఎంతో మంది జైనులు హాజరవుతారు. గమనించదగ్గ విషయమేమిటంటే ఇక్కడ పూజారి అంటూ ఎవరూ ఉండరు. ఆలయ నిర్వాహకుల్లో ఒకరు ముందుగా దీపం వెలిగిస్తారు. ఆ తర్వాత ఎవరైనా పూజ చేసుకోవచ్చు. కొలనుపాకలో ప్రస్తుతం ఇంకొన్ని జైన దేవాలయాల నిర్మాణం జరుగుతోంది. కొలనుపాకలోని హిందూ దేవాలయమైన సోమేశ్వరాలయంలోని శివలింగం కృతయుగంలో బంగారంగా, త్రేతాయుగంలో వెండిదిగా, ద్వాపరయుగంలో రాగిదిగా మార్పు చెందుతూ ఈ కలియుగంలో రాయిగా మారిందన్న విశ్వాసం ప్రచారంలో ఉంది. ఇక్కడ ఒక లింగంపై అనేక చిన్న చిన్న లింగాలు చెక్కి వున్నాయి. దీనినే కోటిలింగాలని వ్యవహరిస్తారు. ఇక్కడ ఆర్కియాలాజికల్ మ్యూజియం కూడా ఉంది. వివిధ కాలాలకు చెందిన శాసనాలు, శిల్పాలు దర్శించవచ్చు. శిల్పకళ పట్ల మక్కువ వున్న వారికి, పర్యటనల పట్ల ఆసక్తి కనబరిచే వారికి కొలనుపాక కనువిందు చేయగలదు. ★


ఛాయా సోమేశ్వరాలయం

మోటార్ రేస్‌లో కొత్త కెరటం కరుణ్

ఎం.డి.హసన్ షరీఫ్

ఫార్ములా ఆసియా మోటార్ రేస్ ఛాంపియన్‌షిప్ సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు సాధించిన కరుణ్ చందోక్ తన దృష్టిని వచ్చేసంవత్సరం జరిగే ఫార్ములా-3 స్కాలర్‌షిప్ క్లాస్‌పై నిలిపాడు. వచ్చే రెండు సంవత్సరాల్లో ఫార్ములా-1 రేస్‌లో బ్రేక్ సాధించడమే అతని లక్ష్యం.

భారత మోటార్ స్పోర్ట్స్‌లో 17 ఏళ్ళ కరుణ్ చందోక్ సంచలన రేస్ డ్రైవర్‌గా వెలుగులోకి వచ్చాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ సాధించిన అతిపిన్న వయస్కుడు చందోక్ రాబోయే సీజన్‌లో ఫార్ములా-3లో ప్రవేశించాలని ఉత్సుకత చూపిస్తున్నాడు. టెస్ట్ డ్రైవింగ్ ఫార్ములా-1లో సంచలన విజయాలు సాధిస్తున్న 26 ఏళ్ళ నరేన్ కార్తికేయన్ భారత మోటార్ స్పోర్ట్స్‌లో కొత్త తరానికి తెరలేపాడు. అయితే ప్రముఖ రేస్, ర్యాలీ డ్రైవర్ విక్కీ చందోక్ కుమారుడు కరుణ్ చందోక్ తన తండ్రినే మించిపోవాలనుకుంటున్నాడు. "భారత మోటార్ రేసింగ్‌లో ఆలస్యంగా ప్రవేశించిన నరేన్ ప్రపంచ రేస్‌లో పాల్గొనే అవకాశం పొందడానికి చాలాకాలం ఎదురుచూడాల్సి వచ్చింది. కానీ నా వయస్సు 20 ఏళ్ళు వచ్చేలోపే ఫార్ములా-1 రేస్‌లో స్థానం సంపాదించాలనుకుంటున్నాను" అని చందోక్ అన్నాడు. ఫార్ములా ఆసియా సిరీస్‌లో ఏడు విజయాలు సాధించిన నరేన్ రికార్డును చందోక్ గత నెలలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో బద్దలు కొట్టాడు. అయితే ఇది ప్రారంభం మాత్రమే అని కరుణ్ అంటున్నాడు. వచ్చే సంవత్సరం జరిగే ఫార్ములా-3 రేస్‌కు అతను అప్పుడే ప్రాక్టీసు ప్రారంభించాడు. "నా కెరీర్‌లో ఇప్పటి వరకు సాధించిన టైటిళ్ళలో ఆసియా ఫార్ములా-2000 ఛాంపియన్‌షిప్ అత్యుత్తమమైనది. కార్లు పనిచేసే తీరును చాలావరకు నేను అర్థం చేసుకున్నాను. కొత్త ట్రాక్‌లపై ఎలా వెళ్ళాలో, టైర్లను పూర్తిగా ఎలా వినియోగించుకోవాలో, రేస్‌లో నెగ్గడానికి అవసరమైన ప్రణాళికను పూర్తిగా అర్థం చేసుకున్నాను. టీం ప్లేయర్‌గా ఎలా ఉండాలో అనే అతిముఖ్యమైన విషయాన్ని కూడా ఆకళింపు చేసుకున్నాను" అని ఫార్ములా ఆసియాలో తన అనుభవం గురించి కరుణ్ వివరించాడు. చందోక్ ఆసియా ఛాంపియన్‌గా మారడం వెనుక చాలామంది కృషి దాగిఉంది. "నేను ఆసియా ఛాంపియన్‌గా నిలవడానికి నా తల్లిదండ్రులు, కోచ్ అక్బర్ ఇబ్రహీం, రేస్ ఇంజనీర్, మెకానిక్ పాట్రిక్ రాబర్ట్‌తో పాటు జెకె టైర్స్, ఐ.సి.ఎస్.ఎ. లాజిస్టిక్స్, ట్రాక్స్, యు.సి.ఎ.ఎల్., పి.ఎ.ఆర్.ఎక్స్., కింగ్ ఫిషర్ వంటి స్పాన్సర్ల కృషి దాగి ఉంది" అని ఫార్ములా ఆసియా ఛాంప్ చందోక్ చెప్పాడు.

ఫార్ములా-3 సీజన్ కంటే ముందు చందోక్ మకావు వీధుల్లో ప్రపంచకప్ కొరకు పోటీపడాల్సి ఉంది. "ఫార్ములా-1లో అనుభవం లేని ప్రతి డ్రైవర్‌కు మకావు టోర్నీ చాలా ప్రతిష్టాత్మకమైనది. అతి పురాతనమైన ఈ టోర్నీ ఇప్పటికీ ప్రపంచంలో ప్రధాన పోటీగా మన్ననలు పొందుతోంది" అని ఈ పోటీల్లో తొలిసారిగా పాల్గొంటున్న కరుణ్ అభిప్రాయపడ్డాడు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలవలేకపోయినప్పటికీ వాయు వేగంతో దూసుకెళ్ళి ఇతర డ్రైవర్లకు గట్టి పోటీ ఇవ్వగలననే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశాడు. ఈ రేస్‌లో గతంలో పాల్గొన్న నరేన్, పార్థివ్ సురేశ్వరన్‌ల అనుభవాలను కూడా కరుణ్ అడిగి తెలుసుకున్నాడు. తాము ఇప్పటివరకూ పాల్గొన్న రేస్‌లలో మకావు రేస్ అతి ముఖ్యమైన సర్క్యూట్ అని చందోక్‌కు నరేన్, పార్థివ్ వివరించారు.



యువ చందోక్ మాత్రం ప్రధానంగా ఫార్ములా-3 ప్రాక్టీసుపైనే దృష్టి నిలిపాడు. "ఎ.ఎఫ్-2000 సిరీస్ ఆరంభం మాత్రమే. ఫార్ములా-1 దిశగా వేస్తున్న రెండో అడుగు ఇది. నేను వేసే తదుపరి అడుగు ఫార్ములా-3 స్కాలర్‌షిప్ క్లాస్‌లో పాల్గొనడమే. వచ్చే సంవత్సరం ప్రారంభమయ్యే ఈ పోటీకి శిక్షణ కూడా ప్రారంభించాను. ప్రపంచంలో ప్రస్తుతం కార్లిన్ మోటార్ స్పోర్ట్ మాత్రమే ఉత్తమ జట్టు" అని కరుణ్ తన ఫార్ములా-3 సన్నాహాల గురించి వివరించాడు.

ఆసియా టెస్ట్ ఛాంపియన్‌షిప్ సాధించడంలో తాను ఎదుర్కొన్న సవాళ్ళను కూడా చందోక్ తెలిపాడు. "టెస్ట్‌డ్రైవ్ తొలిరోజు నాకు చాలా క్లిష్టంగా మారింది. చలి, తీవ్రమైన గాలితో కూడిన వాతావరణంలో డ్రైవ్ చేయడం కష్టంగా తోచింది. డ్రైవ్ చేస్తున్న కొద్దీ కారు నా ఆధీనంలోకి రావడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయింది. జట్టు సహచరులు నరేన్, రాబ్ విల్సన్ (డ్రైవర్ కోచ్) సహకారంతో మేము అనుకున్న సమయం కంటే ముందే గమ్యాన్ని చేరుకోగలిగాం. రెండో రోజు వాతావరణం పొడిగా మారడంతో ఊరట చెందాను. ఆరోజు నరేన్ సూచించిన సమయం కంటే తొందరగా గమ్యాన్ని పూర్తి చేశాను. దీంతో మేము విజయపతాకం ఎగురవేశాం" అని చందోక్ చెప్పాడు. "ఆసియా ఛాంపియన్‌షిప్ సాధించిన తర్వాత మరో ఛాంపియన్‌షిప్‌కు సన్నద్ధమవాలా లేక స్కాలర్‌షిప్ క్లాస్‌కు శిక్షణ పొందాలా అని తీవ్రంగా ఆలోచించాను. స్కాలర్‌షిప్ క్లాస్‌లో ఒక సంవత్సరం పాతబడిన కార్లను మాత్రమే వినియోగిస్తారు. కొత్త డ్రైవర్లు ప్రాక్టీసు చేయడానికి ఇవి చాలా అనువుగా ఉంటాయి. ఛాంపియన్‌షిప్ క్లాస్‌తో పోలిస్తే ఈ కార్ల ద్వారా ప్రాక్టీసుకు తక్కువ ఖర్చు అవుతుంది. అందుకే బొయో, అక్బర్ ఇబ్రహీం, నరేన్, నా తండ్రి సలహా ప్రకారం స్కాలర్‌షిప్ క్లాస్ ప్రాక్టీసు వైపే మొగ్గుచూపాను" అన్నాడు. అయితే ఇప్పుడు అతనికి కొత్త జట్టును తయారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాను స్కాలర్‌షిప్ క్లాస్‌కు సహకరించనని కార్లిన్ సంస్థ ప్రకటించడంతో మరో సంస్థను వెతుక్కోవాల్సి వచ్చింది. "వచ్చే సంవత్సరం నాముందు పెద్ద సవాళ్ళు ఉన్నాయి. కొత్త కార్లను అలవాటు చేసుకోవడానికి కొంత సమయం పడ్తుంది. ఇప్పటివరకు ముగ్గురు లేదా నలుగురితో పోటీపడి గెలిచిన నేను ఇకముందు 15 మంది డ్రైవర్లతో పోటీపడాల్సి వస్తోంది. అందుకే 2002వ సంవత్సరం నాకు చాలా కీలకమైంది" అని చెప్పాడు. ★

నేల తిమ్మిరి

కాట్రగడ్డ దయానంద్

రాత్రి మూడో జాము -

గాలి వీచడం మర్చిపోయినట్లుగా ఉంది.

వెన్నెల భూమండలాన్ని చల్లటి మంచు ముద్దను చేస్తోంది.

హైవే మీద తెంపు లేకుండా మెల్లగా జారిపోతున్న వాహనాల రొద -

రైలు బండి ఒకటి ఆగకుండా ఆఘమేఘాల మీద వెళ్ళిపోతూ మూసీ బ్రిడ్జి మీద సృష్టించిన విచిత్ర అలజడి -

ఇవేవీ లక్ష్మయ్యకు నిద్రాభంగం కలిగించలేదు.

మరేదో.... ఇంకేదో... అర్థమయినట్లూ కానట్లు మరింకేదో... గుండెల్లో సన్నని మంట... అలజడి... ఆవేదన..... ఆక్రోశం... అసలు నిద్ర పడితే కదా నిద్రాభంగం కావడానికి!

ఎవరితోనో ఏదో చెప్పుకోవాలన్న తపన-

మంచమ్మీంచి లేచేడు. తలవాకిట ఉన్న మంచినీళ్ళ చెంబును ఖాళీ చేసేడు.

రహస్యంగా కురిసిన మంచు వర్షానికి పక్కగుడ్డలన్నీ తడిచి ముద్ద అయినాయి. పక్కన పడుకున్న పదేళ్ళ చిన్న కొడుకు ఆ చల్లదనానికి కాబోలు! మోకాళ్ళు మునగదీసుకుని గుప్పిటలా ఒదుక్కుని పడుకున్నాడు. మంచాన్ని ఇంటిముందు పందిట్లోకి పట్టుకుందామనుకున్నాడు.

సాయం పట్టే మనిషి కావాలి. మనసులోపలి దుఃఖాన్ని దోసిలి పట్టి ఆర్తితో పంచుకునే మనిషి కావాలి.

పందిట్లో ఉన్న మంచాల వైపు చూచేడు. భార్య, ఈడొచ్చిన కూతురు, హైస్కూలు కెడుతున్న కొడుకు ఎవరి మంచాల మీద వాళ్ళు పడుకున్నారు. వెల్లకిలా పడుకున్న కూతురు మనోరమ తండ్రి మంచం వైపు తిరిగి పడుకుంది. మంచం పందిట్లోకి పట్టడానికి భార్య సుజాతను లేపుదామనుకుని మళ్ళీ అంతలోనే విరమించుకున్నాడు.

ఆమె లేస్తే మరి నిద్రపోదు. లక్ష్మయ్యనూ నిద్రపోనివ్వదు.

ఆమె గుండెల్లో దుఃఖమే కాదు. మరేదీ ఒదగదు. గుండె లోపలి అరల్లోని ఒదగని సందేహాల్ని ప్రశ్నల రూపంలో బయటకు తీస్తుంది. ఆమె ఏం మాట్లాడినా ప్రశ్నతోనే మొదలవుతుంది.

అది . నడిరేయి గానీ, నడిజాముగానీ -

మాటలు ప్రశ్నలై ప్రశ్నలు చినుకులై, సుడిగాలులై, గాలి వానలా మారి ఆఖరుకు ఆమె కన్నీటితో ముగుస్తాయి. సుజాత ఏడుపును లక్ష్మయ్య తట్టుకోలేడు. ఆమె ప్రశ్నల్నీ ఎదుర్కోలేడు. మొదట ఊం కొట్టి ఆ తరువాత సమాధానం చెప్పలేని తన అశక్తతకు ఆమెను ఛీ కొడతాడు. బూతులతో గొంతు పెద్దది చేసి చివరకు చేతులకూ పని చెబుతాడు. ఆమె ప్రశ్నలకు ఆ విధంగా జవాబులు దొరుకుతాయి. సరిగ్గా నిన్న రాత్రీ అదే జరిగింది.

పొలాన్నుంచి మోసుకొచ్చిన అలవికాని పచ్చిగడ్డి మూటను ఉస్సురని నిట్టూరుస్తూ తలమీంచి ఎత్తికిందేసి మంచానికి అడ్డం పడింది సుజాత.

పొలమేమో దూరాభారం... మైళ్ళకు మైళ్ళు నడవాలి. పైపెచ్చు ఈ మధ్య ఏ కాస్త దూరం నడిచినా పిలిస్తే పలికే మోకాలి నొప్పులు....

వెనకే బర్రెగొడ్లను తోలుకొచ్చిన లక్ష్మయ్య తలగుడ్డ తీసి విదిలించి మంచమ్మీద కూర్చుని మంచినీళ్ళు తెమ్మని కేకేసేడు. సుజాత వినీ విననట్లు అట్లాగే పడుకుంది. కాళ్ళను నులకమంచం పట్టెకు తాటించి సలపరం పెడుతున్న దువ్వనిండిన కాళ్ళను మోకాలి చిప్పల్నీ చేతుల్తో ఒత్తుకుంటోంది. చెరువు నుంచి మంచినీళ్ళ బిందెతో వచ్చిన మనోరమ బిందెదించి ఇద్దరికీ మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

"ఏం!! వచ్చీ రాంగానే సతికిల పడకపోతే ఒకమాలే గొడ్లను కట్టెయ్యొచ్చుగా! వామ్మీద పడకుండా?" అంది సుజాత. లక్ష్మయ్య "నాకు చెప్పకపోతే నువ్వేం చేస్తున్నా" తీక్షణంగా చూస్తూ అన్నాడు. "చేసేందుకేముంది? నాకేమన్నా వనాపాడా? ముప్పొద్దులా తింటూ కదలక్లేకుండా ఉంటినిగా?" అందామె మోకాలి చిప్పలను చేతుల్తో మర్దనా చేసుకుంటూనే!. కోపంగా చూచి అప్పటికి ఊరుకున్నాడు లక్ష్మయ్య.

మనోరమ్మ గొడ్లను కట్టుగొయ్యలకు కట్టేసి బయట పొయ్యిలో నిప్పు రాజేసి ఒక పొయ్యిమీద నీళ్లు మరో పొయ్యిమీద బియ్యానికి ఎసరు పెట్టింది. పొయ్యి నిండా పొగ కట్టెలను పెట్టి చిటపట వస్తున్న మంట పొగలోనికి సుదీర్ఘంగా చూడసాగింది.

"ఏమ్మా రమా! ఏందే! అట్లున్నావ్? ఉషారు లేదా" పొయ్యివైపు చూస్తూ అడిగింది సుజాత.

"అబ్బే! బాగానే ఉందమ్మా" అంటూ ఏదో పని ఉన్నట్లు ఇంట్లోకెళ్ళింది మనోరమ.

అప్పటికే చిరు చీకట్లు ముసురుకుంటున్నాయి.

ఇంటిముందు వేపచెట్టు మీద పక్షుల కలకలం...

"అయ్యోవ్! మోకాళ్ళు పీకుతున్నాయ్. కాస్త పాలు పిండి కేంద్రానికి పోసిరారాదు. వేళతప్పుద్ది". బతిమాలుతున్నట్లుగా అంది సుజాత. లక్ష్మయ్య వినీవిననట్లే ఊరుకున్నాడు. మాట్లాడలేదు. మంచమ్మీంచి కదల్లేదు. తనకిక తప్పదన్నట్లుగా సుజాత మంచమ్మీంచి లేచి ముక్కాలి పీట వేసుకుని పాలు పిండి కేంద్రానికి పోసొచ్చింది. మోకాళ్ళ నొప్పులతో బొత్తిగా కాళ్ళు వంగక కింద కూర్చోలేకపోతోంది. గాలికి అటూ ఇటూ ఊగుతూ భగభగ మండుతున్న పొయ్యిముందు కూడా ముక్కాలి పీట వేసుకుని కూర్చుందామె. లక్ష్మయ్య కూతుర్నడిగి ఇంట్లో నుంచి వేయించిన కంది బేడల్ని తెప్పించుకుని గుప్పిటలో ఉంచుకుని కొద్దికొద్దిగా నములుతున్నాడు.

పొయ్యిమీద కాగిన నీళ్ళు, ఉడుకుతున్న అన్నం తుకతుకమంటున్నాయి.

"ఏయ్యా! వడ్ల సంగతి కనుక్కున్నావా? రైసుమిల్లాయన ఏమన్నాడు" పొయ్యి మంట వెల్తుర్లో ముఖం ధగధగ లాడుతుండగా అడిగింది సుజాత.

లక్ష్మయ్య వినీవిననట్లు వంటితో కందిబేడల్ని పటపటలాడిస్తున్నాడు. సుజాత మనసు పొయ్యిమీద మసులుతున్న నీళ్ళలానే ఉంది.

పెళ్ళి పాతికేళ్ళు - తనంటే నిర్లక్ష్యం, తన మాటంటే విలువలేనితనం - పనిదగ్గర కొచ్చేసరికి ఒళ్ళు దాచుకోలేదు తాను - తనకున్న ఒక్కగా నొక్క తమ్ముడు బతుకు తెరువు వెదుక్కుంటూ వెళ్ళి ఎక్కడో హైద్రాబాద్ అవతల స్థిరపడ్డాడు. పుట్టింటి వైపు పలకరించే దిక్కు కూడా లేదు. నాలుగు రోజుల్నాడు తన కొడుకు పెళ్ళంటూ పెళ్ళికార్డులు పట్టుకుని అక్కను వెదుక్కుంటూ వచ్చేడు తమ్ముడు. అక్కనీ, పిల్లల్నీ పది రోజుల ముందే తనతో తీసుకువెడతానన్నాడు. సుజాతకు ఒక పక్క తమ్ముడ్ని చూచిన సంబరం, మరోపక్క గుండెలో నలవరింత - మెడలో పసుపుతాడు, ఒంటిమీద కట్టుడు చీరలు తప్ప మరో అలంకారం లేదు. సరుడు, నల్లపూసలు, గాజులజత మూడేళ్ళ నుంచి బ్యాంకులోనే మూలుగుతున్నాయి. ఏడెనిమిదేళ్ళ నాడు పొలం పెట్టుబడులకని బావమరిది దగ్గర నాలుగువేలు చేబదులు తెచ్చేడు లక్ష్మయ్య. వాటిని ఇంతవరకు సర్దలేకపోయారు. వాటిని ఈ పెళ్ళి నాటికన్నా సర్దాలి. మొత్తమ్మీద ఒక ఇరవైవేలు సర్దుబాటు అయితే సుజాత ఈ పెళ్ళికి వెళ్ళచ్చు.

"పనుల రోజులు కదా! పెళ్ళి నాటికి వస్తా"నని తమ్ముడ్ని సాగనంపింది సుజాత.

"ఏయ్యా! నా మాటలు వినబడలేదా? వడ్ల సంగతి ఏంచేశా" మళ్ళీరెట్టించింది సుజాత.

"వినబడింది లేవే! వారం రోజుల్నుంచి రోజూ నసయిపోయింది నీది" విసుక్కున్నాడు లక్ష్మయ్య.

"నిజమే! నాది నసే! నేనంటే నీకసలు లెక్కేలేదు. నన్ను పెళ్ళికి పంపే ఉద్దేశ్యం ఉందా లేదా? నాకున్నదే వాడొక్కడు. ఆ కాస్త దారప్పోగును తెంపెయ్యబాకు" ఏడుపుగొంతుతో అంది సుజాత.

ఇంతలో పక్కింటామె చెంబు తీసుకుని వస్తే తను చెంబు పట్టుకుని వెళ్ళింది సుజాత.

మనోరమ ఇంట్లో నుంచి బయటికొచ్చి తల్లి వెడుతున్న వైపుకు దృష్టి సారించింది.

నాలుగు నెల్ల నాడు పండిన ఒడ్లు...

ఎప్పుడూ కళ్ళంలోనే బేరగాళ్ళు మునురుకునే వాళ్ళు. అటువంటిది ఈసారి కొనేవాళ్ళు కరువయ్యేసరికి పండిన ఒడ్లు పురులు కట్టేరు. పాతర్లు పోసేరు. అవి వాటిల్లోనే మక్కి మాగిపోతున్నాయి. రైతులు మిల్లుల చుట్టూ తిరిగినా, మార్కెట్ యార్డుల చుట్టూ తిరిగినా కొంటామన్న నాథుడే లేడు. ఒడ్లు కావాలని తలెత్తి చూచేవాళ్ళే లేరు. ఏమైందని అడిగితే "ఉత్తరాది నుంచి కుప్పలు తెప్పలుగా కావల్సినన్ని ఒడ్లు చవగ్గా వచ్చి పడుతుంటే మన ఒడ్లను మూచ్చూసే వాడెవడు లక్ష్మయ్యా" అన్నాడు తెల్సిన వ్యాపారస్తుడు. అప్పటికీ ఏదో ఒక రేటుకు

వచ్చిన కాడికి తెగనమ్మి పారేద్దామని, ఈ పెళ్ళి గండం నుంచి గట్టెక్కుదామని చూచేడు. ఇవ్వాలరేవని సముదాయిస్తున్నాడు బ్రోకరు.

"నాన్నా! నీళ్ళు తోడతా లెగు" మనోరమ తండ్రిని కేకేసింది. లక్ష్మయ్య పైకి లేచి పందిరి గుంజకు చుట్టిన గోచీగుడ్డను మొలకు కట్టుకుని స్నానానికి వెళ్ళేడు. స్నానం పూర్తయి పంచె కట్టుకునే లోపే ఉరుములు మెరుపుల్తో ధుమధుమలాడుతూ వచ్చింది సుజాత.

"అయ్యోవ్! ఈ సంగతి నీ దాకా వచ్చిందా లేదా? వచ్చినా నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకున్నావా? నీ మేనల్లుడు రేప్పొద్దున ఎగిరి అమెరికా పోతున్నాడంటగా! పెద్ద మునసబు కొడుకు డబ్బులు సర్దేడంట. మునసబు మనమరాల్ని చేసుకునే ఒప్పందమంట. ఊళ్ళోనే ఉంటిమి. ఈ మంతనాలు మనకేమో తెలవకపాయె".

"ఎవరు చెప్పేరే నీకీ సంగతి?" మెల్లిగా అడిగేడు లక్ష్మయ్య.

మనోరమ చూపులు పొయ్యిలోని మంటవైపున్నా చెవులు మాత్రం మాటలవైపే తిప్పింది.

"ఊరంతా కోడై కూస్తుంటే ఒకళ్ళు చెప్పేదేందయ్యా! వాడు పుట్టిన కాడి నుంచి నువ్వు పెట్టిన పెట్టుబడంతా ఏమైనట్టు? అక్షరాభ్యాసం కాడ్నుంచి నిన్నటి దాకా మన సొమ్ముతోనే కదా చదివేడు. ఇయ్యాల్టికియ్యాల అమెరికా పోవడానికి డబ్బులు సర్దలేకపోయామని మన బిడ్డ ఎగటైందా? పా! పోయి తేల్చుకొద్దాం పద. నా బిడ్డని చేసుకుంటాడో లేదో" పెద్దగా అంది సుజాత.

"అయిందానికీ కాని దానికీ ఊరికే నోరు పారేసుకోబాకు. అరిచి రాద్ధాంతం చెయ్యకుండా కాస్త నోర్మూసుకో. కాస్తుంటే ఇంకాస్త చెప్పుకుంటారు ఊళ్ళో జనం. అరిస్తే నలుగుర్లో నవ్వుల పాలయ్యేది మనమే. ఆడపిల్ల గల్లోల్లం. రాత్రికి నేవెళ్ళి కనుక్కొంటాలే." లక్ష్మయ్య బాడీ వేసుకుని బయటకు బయల్దేరేడు.

"ఎల్లకాలం నా నోరు మూపిద్దువుగానిలే! వద్దయ్యా అంటే వినకుండా మేనల్లుడు మేనల్లుడని ఉన్నదంతా ఊడ్చి వాడి ఎదాన పోసేవు. ఇయ్యాల నన్నూ, నా పిల్లల్నీ అన్యాయం చేసేవ్!" రోషంగా మాట్లాడింది సుజాత.

"నీరు మూస్తావా? వళ్ళు రాలగొట్టమంటావా?" అంటూ మంచం పక్కనే వున్న గడ్డిమోపు తాడు అందుకుని సుజాత వీపు మీద ఛెళ్ళు ఛెళ్ళుమని రెండు దెబ్బలు వేసేడు లక్ష్మయ్య.

సుజాత కుమిలిపోతూ ఏడుస్తూనే ఇంట్లోకి నడిచింది. లక్ష్మయ్య బజార్లోకి నడిచేడు.

వర్తమానంలోకి వచ్చేడు లక్ష్మయ్య. మంచం పట్టడానికి భార్యను లేపుదామనుకున్న ఆలోచనను విరమించుకున్నాడు.

గుడ్లగూబ ఒకటి కరంటు లైను మీద కూర్చుని మెడను రిక్కించి అటూ ఇటూ తిప్పి మిడిగుడ్లేసుకుని చూస్తోంది. అంత రాత్రిలోనూ ఏదో పని ఉన్నట్లు కారు నల్లటి జెముడు కాకొకటి పెద్ద పెద్దగా అరుస్తూ చెట్టు చుట్టూ గిరికీలు కొడుతోంది. ఎక్కడివో కట్టుగొయ్యలు తెంచుకున్న బర్రెగొడ్లు రెండు భయం భయంగా బిత్తర చూపులు చూస్తూ పెద్ద పెద్దగా అరుస్తూ చేలకట్టంబడి పరుగులు తీస్తున్నాయి.

మంచమ్మీద కూర్చునే దక్షిణం వైపున్న పుగాకు బ్యార్నీ వైపు చూచేడు లక్ష్మయ్య. నిరుడు ఈ రోజుల్లో బ్యార్నీ పొయ్యి భగభగ మండుతూ ఉంది. పగలంతా పొలాల్లో ఆకుకొట్టే పనులతోనూ, రాత్రులు బ్యార్నీ దగ్గర పచ్చాకు అల్లే పనుల్తోను, ముఠా కూలీల అరుపులు, కేకల్తో సందడి సందడిగా ఉండేది. అయిదారు నెలలు అడ్డమైన చాకిరీ చేసి వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండిన పొగాకును బోర్డు కాడికి తీసుకెళ్ళి లైన్లో పెడితే, పొగాకు ఎట్టుందో చూడటానికిక్కూడా ఒక్క వ్యాపారస్తుడూ ముందుకు రాకపాయె. మూడేళ్ళ నాడు కొన్న పొగాకే ఆర్డర్లు లేక బయటకు పోలేదని, చేతిలో పెట్టుబడులకు డబ్బు లాడటం లేదని చిన్న వ్యాపారస్తులెవరూ ఆ దరిదాపుల్లోకి రాకపోతిరి. రెక్కలు ముక్కలు చేసుకుని తల తాకట్టు పెట్టి పండిస్తే కొనే వాడు దిక్కులేకపోయె!

ఈలోగా ఎండకూ, గాలికీ పొగాకు పళపళలాడటం, రంగుమారటం, గ్రేడు తగ్గటం, ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ కాదనటం - ఎందుకిట్లా జరిగిందని రైతులు మీటింగు పెట్టి ఇదంతా పెద్ద కంపెనీలు, విదేశీ కంపెనీలు పొగాకును చౌకగా కొనడానికి చేస్తున్న మాయని తెలిస్తిరి.

మూడేళ్ళ నుంచి చిన్నా చితకా వ్యాపారులు కొన్న పొగాకు ఆర్డర్లు లేకుండా చేసి, ఎక్స్‌పోర్ట్ కానీకుండా ఆపి వాళ్ళు ఆక్షన్ ప్లాట్‌ఫారాల వైపు రాకుండా పోటీ లేకుండా చేసుకుంటిరి పెద్ద కంపెనీల వాళ్ళు. ఇక లాభం లేదని రైతులు రైళ్ళాపి ధర్నాలు చేస్తిరి. బస్సులు, లారీల్ని నడిరోడ్డు మీద నిలేస్తే గవర్నమెంటు దిగొచ్చి ఎస్టీసీని పంపి కొనిపిస్తాననే! ఈలోగా పెద్ద కంపెనీలన్నీ ఒకటై సిండికేటుగా మారి వేలం పాటల్లో పోటీలు పడకుండా "నువ్వు నాలుగు బేళ్ళు కొనుక్కో, నేను నాలుగు బేళ్ళు కొంటా"నని అయిన కాడికి వచ్చిన కాడికి రైతుల్ని ముంచితిరి. తీరా చూస్తే పెట్టిన పెట్టుబడులు సరే! పండింది అమ్మకోడానికే దేవుడు కనబడే!

ఇట్టా కాదని ఒక సంవత్సరం పుగాకు పండించకుండా క్రాపు హాలిడే తీసుకుందామని రోడ్ల మీద రైతుల మీటింగులు -

పుగాకు పంట వెయ్యాలని కొందరు, వద్దని కొందరు -

బోర్డు దగ్గర రైతుల అభిప్రాయం ప్రకటించాలని కోర్టు ఆదేశం -

పెద్ద మునసబు కంపెనీ గుమాస్తా రైతుల మీటింగు దగ్గరకొచ్చి ఈ సంవత్సరం పుగాకు వేసే వాళ్ళకు వాళ్ళ కంపెనీ తరుపున నారు, పురుగు మందులు ఫ్రీగా ఇస్తారని చెప్పేడు.

జనంలో కలకలం - దాని వలన మీ కంపెనీకేం జరుగుతుందని నిలదీసేరు జనం.

"ఒరేయ్! ఇందులోనే ఉందిరా కిటుకంతా! ఎట్టయినా మనచేత పొగాకు వేయించాలని ఈ కంపెనీలోల్ల పన్నాగం. మొన్నటికి మొన్న సిగరెట్ కంపెనీలోల్లు మినిష్టర్ని పట్టుకుని వాళ్ళవైపు తిప్పుకుని క్రాపు హాలిడే కాకుండా చెయ్యాలని చూచేరు. రైతులందరూ ఒకే మాటమీద ఉండేసరికి అది వీలుగాల. ఇప్పుడు రైతులు వెళ్ళినట్లుగానే కోర్టుకెళ్ళేరు. మనమిప్పుడు పంటవేస్తేనే కదా ఏదో ఒక రేటుకు మనల్ని ముంచి వాళ్ళు వ్యాపారాలు చేసుకునేది. ఈ ఒక్క సంవత్సరం ఆగితే కిందటేడు నిల్వలన్నీ అయిపోతాయి. వచ్చే సంవత్సరం ఎట్టయినా రేటు పెట్టి కొనాల్సిందే. అదీగాక రైతులు ఒక్కటైతే వాళ్ళ ఆటలు సాగవుగా. మనల్ని ఏమార్చి ప్రలోభపెట్టి చీల్చాలని చూస్తున్నారు. ఎట్టయినా పొగాకు వేయించాలని పై దేశాల్నించి దొరలొచ్చి కూర్చుని పెద్ద కంపెనీలోల్లని పట్టుకుని ఆడిస్తున్నారు. వాడి మాటలు నమ్మబాకండరో" అంటూ అరిచేడు.

జనంలో కలకలం మొదలైంది. ఒకళ్ళిద్దరు మునసబు గుమాస్తా మీద చెయ్యి కూడా చేసుకున్నారు.

ఆఖరుకు క్రాపు హాలిడే చెయ్యాలనే నిర్ణయించేరు రైతులు.

"ఏం రోజులొచ్చినియిరా మనబతుకులకు. మనచుట్టూ ఏం జరుగుతుందో అర్థం కాని రోజులైనై. పడమట దేశాన వేరుశనగ పంట వేసేరన్నా! ఇయ్యేడు కాయ ఏందిగిందని! అమ్ముకునే కాడికొచ్చే సరికి సవకసవకని దేశమంతా ఏ ఇంట్లో చూచినా పామాయిలు వాడుతుంటిరి. మలేషియా నుంచొచ్చిన పామాయిలు బొంబాయి హార్బర్లో ఓడల నిండా మూలుగుతుందట. ఇంక మన శనక్కాయలు కొని ఏం చేసుకోవాలన్నారంట వ్యాపారులు - ఏ పంట వెయ్యాలో తెలీదు. ఏదో ఒకటి ధైర్యం చేసి వేస్తే అది కొంటారో లేదో తెలీదు. ఇంతకు ముందంతా పంట పండేదే దిగులన్నా. ఇప్పుడు అమ్ముకోవటం కూడా కనాకష్టమైంది. అసలు సేద్యమే మానేసి ఏ రోడ్డు పనికో కూలీలుగా పోయేది నయమన్నా! ఇంట్లో నలుగురముంటే నాలుగొందలొస్తయి." మీటింగుకు పక్క ఊర్నించి వచ్చిన రైతు పెద్దగా చెబుతున్నాడు. అన్నీ గుర్తొచ్చి మనసు వికలమైంది లక్ష్మయ్యకు.

మంచమ్మీంచి పైకి లేచి ఒళ్ళు విరుచుకున్నాడు. చెప్పులేసుకుని బొటనవేళ్ళు సర్దుకుని బ్యార్నీ చాటుకు వెళ్ళేడు.

ఆయన అటు వెళ్ళగానే కూతురు మనోరమ గభాల్న మంచమ్మీంచి లేచి కూర్చుంది. చెదిరిన జుట్టును, పైటను సర్దుకుని తండ్రి వెళ్ళిన వైపు గబగబా నాలుగడుగులేసింది. లక్ష్మయ్య ముంగాళ్ళమీద కూర్చుని ఒంటేలు పోసుకుని పైకి లేస్తున్నాడు.

బొయ్యిమంటూ ఆకాశంలో వినబడీ వినబడనట్లు శబ్దం... మినుకు మినుకు మంటూ ఎర్రలైటు వెలుగుతున్న విమానమొకటి ఆకాశంలో వెడుతోంది. ఎర్రలైటు మాయమైనంత సేపూ అలానే చూస్తూ నిలబడ్డాడు లక్ష్మయ్య. మనోరమ మనసు కుదుట పడింది. చేలో పురుగు మందుల్తో పని అయిపోగానే ఖాళీ డబ్బాల్నీ మిగిలిపోయిన మందు డబ్బాల్నీ బ్యార్నీ వెనక గుర్తుగా పూడ్చిపెడతాడు లక్ష్మయ్య. తండ్రి ఆ ప్రదేశానికి దూరంగా ఉండటంతో కుదుట పడి గబగబా వచ్చి తన మంచమ్మీదికి చేరింది మనోరమ. అప్పటివరకూ పక్కకు ఇరిగి పడుకున్న సుజాత కదిలి రెండో వైపుకు తిరిగి పడుకుంది.

లక్ష్మయ్య వచ్చి మంచమ్మీద కూర్చున్నాడు. పక్కగుడ్డలు మళ్ళీ తడిమి చూచి పంచలోని మంచాల వైపు చూచేడు. మనోరమ గప్‌చుప్‌గా కళ్ళు మూసుకుంది. పొద్దున పొలం వెడుతూ సుజాత అన్నమాటలు గుర్తొచ్చేయి ఆమెకు.

"మేనల్లుడు, మేనల్లుడని నీకు ఇంజినీరు మొగుడ్ని కట్టబెట్టాలని ఎగురుకుంటూ ఈ ఇల్లూ, నా ఒళ్ళూ గుల్ల చేసేడు మీనాయన. ఆ చదువుకు పెట్టిన డబ్బులున్నట్లయితే ఇయ్యాల నీ పెళ్ళి సలక్షణంగా జరిగిపోవును. ఇన్నేళ్ళూ అనుకున్న సంబంధం, అయిన సంబంధం వెనక్కెడితే నలుగురూ ఏమనుకుంటారో? పిల్లలోనే ఏదో లోపముందని అనుమాన పడతారుగామాల. డబ్బుకు డబ్బాపోయె. పరువుకు పరువూ పోయె. నలుగుర్లో పలచనయితిమి.

అట్టని నువ్వేమన్నా అగాయిత్తెం చేసుకుంటావేమో తల్లీ! ఆగం చెయ్యబాక! జరిగిందేదో జరిగింది. జరగాల్సిందానికి ఆ బగమంతుడున్నాడు. కాస్త మీనాయనన్ని కూడా కనిపెట్టుండు. రాత్రి నుంచి మనిషి మనలోకంలో లేడు. తెగ దిగాలు మీదున్నాడు"

కళ్ళు తెరిచి తల్లి మంచం వైపు చూచింది మనోరమ. బుగ్గమీద వాలిన దోమను కళ్ళుమూసుకునే శబ్దం వచ్చేట్లు చేత్తో కొట్టింది సుజాత. మళ్ళీ చూపును తండ్రి మంచం వైపు కదిలించింది. కూర్చునే ఆకాశం వైపు చూస్తున్నాడు లక్ష్మయ్య. ఆకాశంలో ఎగిరిపోయిన విమానం జాడకోసం దేవులాడుతున్నట్లుంది ఆమెకు. మళ్ళీ కళ్ళు

(మిగతా 23వ పేజీలో)

అంపశయ్య నవీన్

ఆకలి చావులు



"ఈ ఆకలి చావులేమిటండీ బాబూ! దేశం ఎంతో అభివృద్ధి చెందిందంటారు... మన ఆహార గిడ్డంగుల్లో ఆరుకోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిలువ వున్నాయని గొప్పగా చెప్పుకుంటారు.... మన దేశం ఇవ్వాళ్ళ ఆహార ధాన్యాల్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసే పరిస్థితిలో ఉందంటారు... అయినా ఒరిస్సాలోనూ, బీహార్‌లోనూ చాలా మంది గిరిజనులు ఆకలితో చనిపోతున్నారని పత్రికలు రాస్తున్నాయి. ఈ ఆకలి చావులనేవి లేనేలేవు... వాటిని కేవలం మన పత్రికల వాళ్ళే సృష్టిస్తున్నారని ఒరిస్సా ముఖ్యమంత్రి గారంటున్నారు... దీంట్లో ఏది నిజమంటారు..." అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"మన దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్న మాట నిజమే. ఒకప్పుడు... అంటే అరవైలలో... ముఖ్యంగా 64, 65లో మన దేశం విపరీతమైన ఆహార ధాన్యాల కొరతను ఎదుర్కొంది... అమెరికా నుండి మనం చాలా పెద్ద ఎత్తున తిండిగింజల్ని దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది... అప్పుడు ఇండియాలోని ఆహార ధాన్యాల కొరతను 'షిప్ టు మౌత్' పరిస్థితిగా చాలా మంది వర్ణించారు... అప్పటి మన ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆహార ధాన్యాల కొరతను ఎదుర్కోవడానికి ప్రజలంతా వారానికొక పూట ఉపవాసం ఉండాలని ఉద్బోధించారు.. ఆ రోజుల్లో అమెరికాలోని చాలా మంది మేధావులు భారతదేశంలో త్వరగానే ఓ పెద్ద కరవొస్తుందనీ, లక్షల మంది ప్రజలు ఆకలితో చనిపోతారని జోస్యం చెప్పడం మొదలెట్టారు. డెబ్బైలలో భారతదేశంలో పెద్ద కరవొస్తుందని కొందరు అర్థశాస్త్రజ్ఞులు పుస్తకాలు కూడా రాశారు... అయితే భారతదేశపు వ్యవసాయ రంగంలో డెబ్బైలలో కొన్ని మార్పులు జరిగాయి... ఈ మార్పులనే హరిత విప్లమన్నారు... అసలు ఈ హరిత విప్లవం భారతదేశంలో భూసంస్కరణల అమలు సరిగ్గా జరిగితే ఎప్పుడో యాభైలలోనే వచ్చేది. కానీ భూసంస్కరణలనేవి కాగితం మీదనే ఉండిపోయాయి.. కష్టపడి పని చేసే అసలు రైతులకు భూమి దక్కకుండా, బడా భూస్వాముల దగ్గరే భూకమతాలన్నీ ఉండిపోయాయి. దాంతో వ్యవసాయోత్పత్తి పెరగలేదు. భూసంస్కరణలని పక్కదారి పట్టించడం కోసమే అప్పటి ప్రభుత్వం హరిత విప్లవం వచ్చిందని ప్రచారం చెయ్యడం మొదలెట్టింది. సైన్స్ అండ్ టెక్నాలజీని వ్యవసాయ రంగానికి విరివిగా అన్వయించడం, వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటించడం, నీటిపారుదల వనరుల పరిస్థితి మెరుగు కావడం మొదలైన అంశాల వల్ల డెబ్బైలలో వ్యవసాయోత్పత్తులు పెరిగిన మాట నిజమే. అయితే ఈ ఉత్పత్తి పెరగటం వల్ల బడా భూస్వాములకే ఎక్కువ లాభం కలిగింది తప్ప పేదవాళ్ళకు ఒరిగిందేమీ లేదు"

"పేద వాళ్ళకు ఒరిగిందేమీ లేదంటాంరేమిటి మీరు? ఒకప్పటికీ, ఇప్పటికీ భేదం లేదంటారా? ఉత్పత్తి పెరగటం వల్ల ఇవ్వాళ్ళ గోడౌన్ల నిండా తిండిగింజలైతే ఉన్నాయి కదా... ఇదివరకటిలా మన దేశంలో కరువొస్తే ఏ అమెరికా నుంచో తిండిగింజల్ని దిగుమతి చేసుకుంటూ 'షిప్ టు మౌత్' బతుకు బతకాల్సిన అవసరం లేదుగా... కాకపోతే గోడౌన్లలో వున్న ధాన్యం పేదవాళ్ళకందేలా చూడాలి"

"పేదవాళ్ళ కొనుగోలు శక్తి పెరక్కుండా గోడౌన్లలో వున్న ధాన్యం పేదవాళ్ళకెలా అందుతుంది? అందుకే నేను చెప్పొచ్చేదేమిటంటే ఉత్పత్తి పెరగటంతో సమస్య పరిష్కారం కాదు.. ఈ దేశంలో గత యాభై సంవత్సరాలుగా అన్ని రంగాల్లోనూ ఉత్పత్తి పెరుగుతూనే ఉంది... కానీ ఉత్పత్తి పెరగటం వల్ల ఉన్న వాళ్ళకే ఎక్కువ లాభం కల్గుతోంది. ఆ ఉత్పత్తి పేదవాళ్ళకు అందుబాటులోకి రావడం లేదు. దానిక్కారణమేమిటంటే పేదవాళ్ళ ఆదాయాలు పెరగటం లేదు - ఆదాయాలు పెరగందే కొనుగోలు శక్తి పెరగదు.. ఉత్పత్తిలో అందరికీ భాగస్వామ్యం వున్నప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుంది. భూసంస్కరణలు సక్రమంగా అమలు జరిగివుంటే వ్యవసాయోత్పత్తి అందరికీ అందుబాటులో ఉండేది - భూసంస్కరణలు విఫలమైపోయాయి కాబట్టే ఈ దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం ఇప్పటికీ తొలగిపోలేదు... నన్నడిగితే గోడౌన్లలో వున్న ఆహార ధాన్యాల్ని పేదవాళ్ళకు ఉచితంగా పంపిణీ చెయ్యాలి. లేదా పనికి ఆహారం లాంటి పథకాల్ని విరివిగా అమలు జరిపి పేదవాళ్ళకు ఆహార ధాన్యాల్ని పంపిణీ చెయ్యాలి... ఆహార ధాన్యాల్ని గిడ్డంగుల్లో చాలా కాలం వరకు నిలువ చెయ్యడం వల్ల కొన్ని లక్షల టన్నుల ఆహార ధాన్యాల్ని ఎలుకలు, పందికొక్కులు తినేస్తున్నాయట! ఎలుకలు, పందికొక్కులతో పాటు మరెందరో మధ్య దళారులు కూడా ఆహార ధాన్యాల్ని ఏదో రకంగా తినేస్తూ బలిసిపోతున్నారు. ఏ ఆధారం లేని కష్టజీవులకు మాత్రం తిండే దొరకదు. ఇది చాలా దారుణమైన పరిస్థితి - ప్రజలకు న్యాయం జరగకపోతే ప్రజలందరూ ఆహార గిడ్డంగుల మీద దాడి చేసి తిండి గింజల్ని తమలో తాము పంచుకునే పరిస్థితిని ప్రభుత్వమే సృష్టించినట్టవుతుంది. తన ప్రజలకు తిండి, బట్ట, గూడులాంటి కనీసావసరాల్ని తీర్చాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వం మీదుంటుంది...." అన్నాన్నేను. ★

హాస్యపు జల్లు-నవ్వుల విల్లు

మనిషికి ఎంతో అవసరమైంది నవ్వు. నవ్వు అనేక మానసిక జాడ్యాలకు విరుగుడు. ఆందోళనలకు అసలైన మందు. సమస్యలు పెరిగిపోతున్న నేటికాలంలో నవ్వగల అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి.

అష్టావధానాలు, శతావధానాలు ప్రాచీన సాహిత్యాభిమానులను, పద్య కవితా ప్రియులను మాత్రమే అలరించగలవు. సంప్రదాయ సాహిత్య పరిచయం లేనివారికి అందులో ఆశు కవిత్వం, అవధాని జ్ఞాపకశక్తి వంటివే అర్థమవుతాయి. తిరుపతి వెంకట కవులతో సహా అవధానాలలో సాహిత్యం స్వల్పమని తేల్చి చెప్పారు. అయితే అసలు ఏ సాహిత్యం తెలియని వారిని కూడా అష్టావధానంలో ఆకర్షించే ఒకే అంశం అప్రస్తుత ప్రశంస. వాడుక భాషలో దీన్నే అధిక ప్రసంగం అన్నప్పటికీ నిజానికి అనుభవం, ఔచిత్యం ఉన్నవారినే ఈ స్థానానికి ఎంపిక చేస్తుంటారు. ఇందులో ప్రధానమైనది హాస్యం, వ్యంగ్యం. సరిగ్గా ఆ రెండు లక్షణాలను ప్రధానంగా తీసుకొని అప్రస్తుత ప్రశంసను విడదీసి పృచ్ఛకస్థానం నుండి వాటిని అవధాన స్థానానికి చేర్చి హాస్యావధానం అనే ప్రక్రియను ప్రారంభించారు శంకరనారాయణ. పాత్రికేయుడు, రచయిత అయిన శంకర నారాయణ ఇప్పటికి 60 చోట్ల హాస్యావధానాలు చేశారు.

సభికులకు జోకులు చెప్పి నవ్వించడం, వేదిక మీద ఉన్న వారి ప్రశ్నలకు చమత్కార సమాధానాలిచ్చి మెప్పించడం దీని ప్రత్యేకతలు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 31న త్యాగరాయ గానసభలో శంకర నారాయణ నిర్వహించిన హాస్యావధానం అందరినీ ఆకట్టుకుంది. అయితే ఈ సభలో రాజకీయ ప్రముఖులు, ప్రసిద్ధ కళాకారులు, హాస్యనటులు పాల్గొని హాస్య సన్నివేశాలు, జోకులు చెప్పి బాగా నవ్వించారు.

ఆ పేర్లన్నీ ఇక్కడ రాయడం కంటే ఆ సరదాలు చెప్పడం బాగుంటుంది. ఇవి లోగడ విన్నవే అయినా కాపీరైట్ వర్తించదని గమనించ మనవి.

* * *

ఒకసారి ఎన్టీఆర్ కారులో షూటింగ్‌కు వెళ్తున్నారట. అప్పటికే ఆలస్యం కావడంతో స్పీడుగా వెళ్ళమని పలుమార్లు డ్రైవర్‌కు చెప్పారు. అయినా లాభం లేకపోవడంతో విసుగుచెంది ఆయనే డ్రైవింగ్ చేస్తూ డ్రైవర్‌ను వెనకసీట్లో కూర్చోపెట్టారు. యమా స్పీడుగా వెళ్తున్న ఆ కారును చూసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు కోపం వచ్చింది. ఆ కారును వెంటాడి వెనక్కు తీసుకురమ్మని స్కూటర్ ఇచ్చి కానిస్టేబుల్‌ను పంపించాడు. వెళ్ళిన కానిస్టేబుల్ ఆ కారును ఓవర్‌టేక్ చేసి చూసి ఖాళీగానే వెనక్కి వచ్చాడు. కానిస్టేబుల్‌ను చూడగానే ఎస్.ఐ.కి ఒళ్లు మండింది. కారణం అడిగితే..'సార్ వాడెవడో.. శతకోటీశ్వరుడిలా ఉన్నాడు. ఎన్టీఆర్‌నే డ్రైవర్‌గా పెట్టుకున్నాడు' అని అన్నాడట.

* * *

ఒక డాక్టర్ పేషంట్‌ను పరీక్షించి టాబ్లెట్ ఇచ్చి ఇలా అన్నాడు..

'రాత్రికి ఈ మాత్ర వేసుకో. నేను రేపు వచ్చి చూస్తాను'.

అప్పుడు పేషంట్ ఇలా అన్నాడు..'మీరు వచ్చి చూస్తారు సరే. నేను మిమ్మల్ని చూస్తానా అని'.

* * *

ఒక టీచర్ పిల్లలను ప్రశ్నలు వేస్తోంది.

'ఉభయ చరాలకు ఒక ఉదాహరణ చెప్పరా ?'

'కప్ప'

'ఇంకో ఉదాహరణ'?

'ఇంకో కప్ప'.

* * *

ఒక పెద్ద మనిషి స్వంత పనిమీద డిల్లీలో చదువుకుంటున్న బంధువుల అబ్బాయి దగ్గరికి వెళ్ళాడు. ఆ కుర్రాడికి రెండు రోజుల్లో పెళ్ళి ఉన్నా విసుక్కోకుండా ఆయనతో తిరిగాడు. ఇక చివరకు ఇలా చెప్పాడు..

'సార్ ఎల్లుండి నా పెళ్ళి, వెళ్ళాలి'. దానికి ఆ పెద్దమనిషి..

'నేను పని మీద వస్తే..నువ్వేంటయ్యా ఇప్పుడు పెళ్ళి గొడవ పెట్టుకున్నావ్' అన్నాట్ట అసహనంగా.

* * *

ఒక మ్యూజియంలో గొప్పవాళ్ల మెదళ్లు వేలం వేస్తున్నారట.

'ఇది అరిస్టాటిల్ మెదడు..యాభైవేల డాలర్లు'

'ఇది ఐన్‌స్టీన్ మెదడు..లక్ష డాలర్లు'

ఇలా చెబుతుంటే ఒక పెద్దమనిషి ఇంకా మంచిది కావాలన్నాడట. అప్పుడు మ్యూజియం నిర్వాహకులు ఒక మెదడు దగ్గరకు తీసుకువెళ్లి..

'ఇది రెండు లక్షల డాలర్లు' అని చెప్పారు.

'ఇంత ధర చెబుతున్నారు. ఇంతకీ ఈ మెదడు ఎవరిది' అని అడిగాడాయన.

'ఇది రాజకీయ నాయకుడిది. బతికున్నంత కాలం ఎప్పుడూ వాడలేదు. ఫ్రెష్‌గా ఉంటుంది' అని చెప్పారట.

* * *

ఒక ఎడిటర్ గారు ఉదయాన్నే బయటకు వచ్చే సరికి భార్య ముగ్గు వేస్తూ కనిపించింది. అప్పుడు ఆయన ఇలా కోప్పడ్డాడు..

'నీవేమిటి..? ఎన్ని సార్లు చెప్పినా నాలుగు కాలాల ముగ్గు వేయమంటే మూడు కాలాల ముగ్గు వేస్తావ్'?

* * *

కొత్తగా మంత్రి పదవి స్వీకరించిన ఒక మహిళా నాయకురాలు ఒక సభలో...

'నేటి ముఖ్య అతిథి అనబోయి నేటి ముఖ్యమంత్రి' అన్నారు.

అసలే ముఖ్యమంత్రులను బొమ్మల్లా మారుస్తున్న నాటి వాతావరణంలో ఇది విని అంతా గొల్లున నవ్వారు.

* * *

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చి కూడా బీజేపీ ముప్పు తిప్పలు పెడుతున్న రోజులు. అద్వానీ కారు డ్రైవర్ మెల్లగా నడుపుతున్నాడు. ఆయన హడావుడి పెడుతుంటే చివరకు...

'సార్ వెనక నుండి నడపడానికి ఇది సర్కారు కాదు కారు' అన్నాడు.

* * *

ఒక ఆర్టిస్టు వేసిన ఆంజనేయుడి బొమ్మలో ఏదో లోపం కనిపించింది. ఒకాయన ఉండలేక..

'ఏమయ్యా, ఆంజనేయుడి గుండెలో రాముడు ఉండాలి కదా' అని అడిగాడు.

'భలేవారండీ..రాముడు ఎలా ఉంటాడు. వాజ్‌పేయి జేబులో చిక్కుకుపోతేను' అన్నాడా ఆర్టిస్టు.

* * *

ఒక ముఖ్యమంత్రి గారు ఇంటినుండి సచివాలయానికి ఫోన్ చేశారు. అవతల ఫోన్ ఎత్తిన ఓ ఉద్యోగి చాలా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నాడు. చాలాసేపు ఓపిక పట్టిన ముఖ్యమంత్రి చివరకు...

'నేనెవరో తెలుసా..ముఖ్యమంత్రిని మాట్లాడుతున్నాను' అన్నారు గట్టిగా.

అవతలి వ్యక్తి కంగుతిన్నాడు. అయినా తడుముకోకుండా...

'నేనెవరో తెలుసా సార్' అన్నాడు.

ముఖ్యమంత్రి తెలియదు అనగానే

'హమ్మయ్య...బతికిపోయాను' అని ఫోన్ పెట్టేశాడు.

* * *

జోకుల్లో ఎక్కువ భాగం మాజీ ముఖ్యమంత్రి అంజయ్య మీద వచ్చాయి. అందులో ఒకటి..

ఒకసారి ఆయన ఏదో టోర్నమెంట్ ప్రారంభించడానికి వెళ్ళి ఇలా అన్నారు..

'నాకిష్టమైన ఆటలు రెండే. ఒకటి క్రికెట్. రెండోది టోర్నమెంట్'.

* * *

ప్రపంచబ్యాంకు పై ఓవర్ల ఫలితంగా ముక్కలైన తెలుగుతల్లిని నవ్వించడానికి అవధాని ఏమైనా చేయగలరా ?

అవధాని జవాబు : నేనేం చేయలేను. చేస్తే ముఖ్యమంత్రిగారే చేయాలి..'లోన్'లీగా...

ఇంకా ఇలాంటివి అనేకానేక జోకులు ఆ రోజు సభికులను కడుపుబ్బా నవ్వించాయి. ఇంతకూ శంకరనారాయణ ఈ ప్రక్రియను 1997 డిసెంబర్ 31న ఫిలింనగర్‌లో హాస్యనటుల సమక్షంలో ప్రారంభించడం విశేషం. హాస్యావధానం అని పేరు పెట్టిన వారు బ్రహ్మానందం కాగా తొలి కార్యక్రమ నిర్వాహకులు భరణి. అప్పటి నుండి ఇప్పటికి ఆయన 60 ప్రదర్శనలు ఇచ్చారు. సందర్భాన్ని బట్టి, స్థలాన్ని బట్టి విషయాలు మారిపోతుంటాయి. విద్యాసంస్థల్లో, కళాసంస్థల్లో, కార్యాలయాల్లో ఇలా సందర్భోచితంగా దీన్ని నడుపుకోవచ్చు.

మనిషికి ఎంతో అవసరమైంది నవ్వు. నవ్వు అనేక మానసిక జాడ్యాలకు విరుగుడు. ఆందోళనలకు అసలైన మందు. సమస్యలు పెరిగిపోతున్న నేటికాలంలో నవ్వగల అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. ఇంకోవైపున హాస్యం పేరిట అశ్లీల, అవాంఛనీయ ధోరణులు పెరుగుతున్నాయి. ఇలాంటి స్థితిలో ఆరోగ్యకరమైన హాస్యాన్ని బతికించుకోవడానికి ఇటువంటి ప్రక్రియలు ఎంతైనా దోహదపడతాయి.

-తెలకపల్లి రవి

వరకట్నం తీసుకుంటే...

కర్రా ఎల్లారెడ్డి

వరకట్న చట్టాన్ని ఉల్లంఘించటంలో అందరూ దోషులే. నేడు అన్ని కులాల వారు, అన్ని వర్గాల వారు వరకట్నాలు ఇన్తున్నారు. వరకట్నాలు పుచ్చుకుంటున్నారు. రాజకీయ నాయకులు, ఉన్నతోద్యోగులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, జడ్జీలతో సహా ప్రతి ఒక్కరూ వరకట్న చట్టాన్ని లెక్క చేయటం లేదు. నలభై ఏళ్ళ క్రితం భారత పార్లమెంటు వరకట్న నిషేధ చట్టాన్ని తయారు చేసింది. ఆ తర్వాత ఎన్నో సార్లు ఈ చట్టానికి సవరణ చేసి కఠినమైన సెక్షన్లను, నిబంధనలను రూపొందించారు. కానీ చాలా కొద్దిశాతం మంది నిందితులకే ఈ చట్టం కింద శిక్షలు పడుతున్నాయి. ఈ చట్టం కింద ఫిర్యాదులు చేసే మహిళల సంఖ్య కూడా చాలా తక్కువ.

కట్నం ఇచ్చే వారికి, పుచ్చుకొనే వారికి, చట్టాన్ని అమలు చేసే వారికి, కోర్టులో తీర్పు చెప్పే వారికి వరకట్న చట్టాన్ని గౌరవించాలన్న ఉన్నత ఆశయం కానీ, నిబద్ధత కానీ లేకపోవడం వల్ల కట్నం కోసం వేధింపులు, వరకట్న హత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు. "కట్నం ఇచ్చిభర్తను కొనుక్కోవటం సరైంది కాదు" అన్న భావం మహిళలకు కలగటం లేదు.

వరకట్నం ఇచ్చి భర్త చేతిలో వేధింపులకు గురయ్యే మహిళలు, ఆత్మహత్యలు చేసుకొనే స్త్రీలు ఎంతోమంది వున్నారు. ఈ చట్టాన్ని అతిక్రమించే వారిపై కోర్టులో ఫిర్యాదులు చేసి వారిని శిక్షించే సాహసం ఒకరిద్దరు అక్కడక్కడ చేస్తున్నారు. ఫలితం కూడా ఉంటోంది.

అలాంటి కోవకు చెందిన మహిళ వసుంధర. ఆమె వివాహం జరిగి ఇంకా ఆరు నెలలు కూడా పూర్తి కాలేదు. నగరంలోని ప్రఖ్యాత కళాశాలలో ఆమె డిగ్రీ పూర్తి చేసింది. ఆమె తండ్రి జిల్లాలో పెద్ద కాంట్రాక్టర్. ఆమెకంటే పెద్దవాళ్ళైన ఒక అక్క, ఒక అన్న వున్నారు. వారి పెళ్లిళ్ళు జరిగాక వసుంధర పెళ్ళి కోసం ఆమె తండ్రి ప్రయత్నాలు చేయటం మొదలు పెట్టాడు.

వసుంధరకు మాత్రం అప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు. తన స్నేహితురాళ్లు చాలా మంది బి.ఇడి.లో చేరటం చూసి తాను కూడా కనీసం టీచర్ ఉద్యోగంలోనైనా చేరాలనుకుంది. కానీ ఆమె తండ్రి తొందరలోనే ఒక ఇంజనీర్ వరుణ్ణి చూశాడు. వసుంధరను పెళ్ళికి ఒప్పించారు.

పెళ్ళి చూపులు, కట్న కానుకల ముచ్చట్లు చకచక జరిగిపోయాయి. పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చి భారీగా పెద్ద మ్యారేజ్ హాల్‌లో వివాహం జరిపించటానికి వసుంధర తండ్రీ, బంధువులు ఏర్పాట్లు చేయటం మొదలు పెట్టారు.

పెళ్ళికాగానే వసుంధరను అత్తవారింటికి పంపించారు. ఆరు నెలల కాలం గడిచింది. వసుంధర భర్త ఆమెను బాగా చూసుకుంటున్నాడు. వసుంధర మామగారు రిటైర్డ్ పోలీస్ అధికారి. అత్తకాక ఆడకూతురు కూడా ఇదే ఇంట్లో కాపురం ఉంటున్నారు. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్న కానుకలు కాక మరిన్ని బహుమతులు కావాలని వారు అడగటంతో వసుంధర తండ్రి ఆ బహుమతుల్ని కూడా సమకూర్చాడు. వసుంధర అత్త, ఆడబిడ్డ కలిసి ఆమె భర్తను ప్రోత్సహించి మరింత కట్నం అడిగేలా చేశారు. అయితే అప్పటికే అనుకున్న దానికంటే ఎక్కువగా వారికి కట్న కానుకలు ముట్టాయి. వసుంధర తండ్రి కట్న కానుకల జాబితాను రాసి ఉంచాడు.

వసుంధరను అత్త, ఆడబిడ్డలు కలిసి కట్న కానుకల కోసం అడుగుతున్న సమయంలో ఆమె ఓ రోజు తనకు తెలిసిన ఒక మహిళా న్యాయవాదిని కలిసి తన సమస్యను చెప్పింది. తన భర్త కట్నం తెమ్మంటున్నాడని చెప్పింది.

వరకట్న చట్టం గురించి, కట్నం కోసం వేధింపుల గురించి సాక్ష్య చట్టం ఐ.పి.సి., సీఆర్‌పీసిల గురించి ఆమె పలు విషయాలను వసుంధరకు తెలియచేసింది.

మన రాష్ట్రంలో వరకట్న దురాచారాన్ని నిషేధిస్తూ 1958లో చట్టం చేశారు. ఆ తర్వాత 1961లో దేశానికంతటికీ వర్తించే వరకట్న నిషేధ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఎన్నో సవరణలు వరకట్న నిషేధ చట్టంలో తెచ్చారు. నేరాన్ని నిర్వచించి శిక్షా కాలాన్ని, జరిమానాను పెంచారు.

ప్రస్తుతం అమలులో వున్న వరకట్న నిషేధ చట్టం ప్రకారం ఏ వ్యక్తి అయినా వరకట్నం ఇచ్చినా లేక పుచ్చుకున్నా ఆ వ్యక్తికి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. జైలు శిక్షతో పాటు పదిహేను వేల రూపాయల వరకు జరిమానా విధిస్తారు. వివాహం గురించి పత్రికల్లో ప్రకటన ఇచ్చి వరుడికి కట్నం ఇస్తామని లేక ఆస్తిలో వాటా ఇస్తామని లేక మరే విధంగానైనా ఆస్తిని కట్టబెడతామని ప్రకటించడం కూడా నేరమే. శిక్షార్హమే.

ఇండియన్ పీనల్ కోడ్‌లోని 498-ఎ సెక్షన్ ప్రకారం ఒకస్త్రీ భర్త లేక భర్త తరఫు బంధువు ఎవరయినా ఆ స్త్రీని క్రూర హింసలకు గురి చేస్తే ఆ వ్యక్తికి మూడేళ్ళ జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని 198-ఎ సెక్షన్ ప్రకారం వేధింపులకు గురైన స్త్రీ స్వయంగా ఆమె భర్త, అతని బంధువులపై ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆ స్త్రీకి వీలు కానప్పుడు ఆమె తండ్రి, తల్లి, సోదరి తదితర ఆమె రక్త సంబంధీకులు ఎవరో ఒకరు ఆమె పక్షాన రిపోర్ట్ ఇవ్వవచ్చు. ఇతరులు ఫిర్యాదు చేయటానికి వీల్లేదు.

భారత సాక్ష్య చట్టం లోని 13-ఎ సెక్షన్ ప్రకారం ఒక స్త్రీ తన వివాహమైన తేదీ నుంచి ఏడు సంవత్సరాల లోపు ఆత్మహత్య చేసుకుంటే ఆమె భర్త లేక భర్త తరఫు బంధువులు ఆమెను ఆత్మహత్యకు పురికొలిపి ఉంటారని న్యాయమూర్తి భావించవచ్చు. ఎందుకంటే మహిళల ఆత్మహత్యలు లేక హత్యలు వరకట్న డిమాండ్‌ల కారణంగా జరుగుతున్నాయి. కనుకనే ఈ సెక్షన్‌ను 1983లో కొత్తగా భారత సాక్ష్య చట్టంలో చేర్చారు.

పై విషయాలన్నీ చెప్పాక మరొక ముఖ్య విషయాన్ని ఆ మహిళా న్యాయవాది వసుంధరకు తెలియజేసింది.

వివాహ సందర్భంగా వధువు తల్లిదండ్రుల నుంచి కట్న కానుకలు స్వీకరించిన వ్యక్తి వాటిని నిర్ణీత కాలం లోపల పెళ్లి కూతురికే ఇచ్చివేయాలి. పెళ్ళి తేదీకి ముందు తీసుకున్న కట్నం డబ్బును ఆ తేదీ నుంచి మూడు నెలల లోపు ఇచ్చివేయాలి. వివాహం రోజున లేక ఆ తర్వాత కట్నం డబ్బును స్వీకరిస్తే ఆ తేదీ నుంచి మూడు నెలల లోపల పెళ్ళి కూతురికి ఇవ్వాలి. ఒక్కోసారి పెళ్ళి కూతురికి 18 ఏళ్ళు రాకముందే వివాహం జరుగుతుంది. అలాంటప్పుడు ఆమెకు 18 ఏళ్ళు నిండిన తర్వాత మూడు మాసాల లోగా పెళ్ళి సమయంలో తీసుకున్న కట్న కానుకలను ఆమెకు అందజేయాలి. అలా చేయని వ్యక్తికి రెండేళ్ళ వరకు జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల వరకు జరిమానా విధించాలని చట్టంలో ఉంది. వసుంధర అడిగితే ఆమె కట్నం డబ్బును అత్తింటి వారు ఆమెకు ఇవ్వాల్సి ఉంటుంది.

మహిళా న్యాయవాది చెప్పిన చట్ట సంబంధ విషయాలను ప్రస్తుత సమాజంలోని ఏ వ్యక్తీ పాటించడం లేదని వసుంధరకు అర్ధమయింది. ఈ విషయాలన్నీ గ్రాడ్యుయేషన్ అయిన తనకే తెలియవు.

తన సమస్య గురించి ఏం చేస్తే బాగుంటుందో సలహా ఇవ్వమని తన న్యాయవాదిని కోరింది. తన మామగారు పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారి అని తెలియజేసింది.

వసుంధర సందేహం ఏంటంటే తన భర్త కుటుంబంపై పోలీసులకు గానీ, కోర్టుకు గానీ ఫిర్యాదు

చేస్తే ఫలితం ఉంటుందా అని. అందుకని ముందుగా లాయర్ నోటీస్ ద్వారా తన సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలని తన న్యాయవాదిని కోరింది. దాంతో కాకుంటే కోర్టుకు, పోలీస్ స్టేషన్‌కు వెళ్ళవచ్చునని ఆమె ఆలోచన.

వసుంధర చెప్పిన కట్న కానుకల వివరాలను వివరిస్తూ అత్త ఆడపడుచుల వేధింపులను నిరసిస్తూ చట్ట ప్రకారం వసుంధరకున్న హక్కులను తెలుపుతూ వసుంధర అత్తింటి వారు తమ పద్ధతులను మార్చుకోవాలని లాయర్ నోటీసులో పేర్కొన్నారు. వసుంధర వివాహం జరిగి అప్పటికి ఎనిమిది నెలలు దాటినందున ఈ నోటీసు ముట్టిన 15 రోజుల్లో వసుంధర తెచ్చిన మొత్తం వరకట్నం డబ్బులను ఆమెకు అందజేయాలని, లేనిపక్షంలో వసుంధర తన భర్త, అత్తమామలపై అవసరమైన చట్టపరమైన చర్యలు చేపడుతుందని లీగల్ నోటీసును పంపించారు.

వసుంధర పంపిన నోటీసుతో ఇరు కుటుంబాల మధ్య కొద్దిపాటి ఘర్షణలు, పంచాయతీలు జరిగాయి. వసుంధర మాత్రం తనకున్న హక్కులను వదులుకోనని తండ్రికి, అత్తింటి వారికి స్పష్టంగా చెప్పింది.

ఇరు కుటుంబాలకు చెందిన శ్రేయోభిలాషుల సమక్షంలో ఇరువురికీ మధ్య ఒక అంగీకారం మధ్యే మార్గంగా కుదిరింది. వసుంధరకు ఆమె తల్లిదండ్రులు చెల్లించిన కట్నం డబ్బును భార్యాభర్తల పేరు మీద జాయింట్ అకౌంట్‌లో పెట్టాలని నిర్ణయించారు. వసుంధర మామగారు చట్టం తెలిసిన వ్యక్తి కావటంతో ఆమె సమస్య సులభంగా పరిష్కారానికి నోచుకుంది. ★

నేల తిమ్మిరి

(18వ పేజీ తరువాయి)

మూసుకుంది మనోరమ.

గోడమీద కోడిపుంజు రెక్కలు టపటప కొట్టుకుని కూతవేసింది. కరెంటు తీగెమీది గుడ్లగూబ ఒకసారి ఆకాశంలో గిరికీలు కొట్టి మళ్ళీ అదే స్థానంలో కూర్చుంది. జెముడు కాకి అవిశ్రాంతంగా అరుస్తూ ఇంటి ముందు చెట్టు మీద గిరికీలు కొడుతూనే ఉంది. కళ్ళు మూసుకున్న మనోరమ కళ్ళ ముందు అనేకానేక దృశ్యాలు...

పెద్ద మనిషి అయినప్పుడు మేనత్త వచ్చి వాటేసుకుని "నాబంగారు తల్లి" అంటూ తలచుట్టూ చేతులు తిప్పి ఆ చేతుల్ని తన తలమీదుంచుకుని మెటికలు విరిచిన శబ్దం...

సెలవులకొచ్చిన సురేషు వంచలో మంచమ్మీద కూర్చుని తండ్రితో మాట్లాడుతూ ఇంట్లోకి తొంగిచూచి తనకు మాత్రమే తెలిసేట్లు పెదవుల మీద మెరిపించిన సన్నటి చిరునవ్వు గీత... అట్లతద్ది పండుగరోజు సాయం సంధ్యలో తను ఎక్కడ పడుతుందోనని సుతారంగా ఉయ్యాల ఊపిన సురేష్......

"నీకేమే ఇంజినీరు మొగుడు"ంటూ ఈర్ష్యగా చూచిన తోటి ఆడపిల్లలు....

"తాను సురేష్‌ని ప్రేమిస్తోందా?" తనను తానే ప్రశ్నించుకుంది మనోరమ. "లేదు లేదు. అంతకంటే ఎక్కువ. ప్రేమకు హద్దుంది. అనుబంధానికి హద్దులు లేవు. తను పుట్టగానే సురేష్‌కు పెళ్ళాం పుట్టిందంటూ పద్దపేరు... అలా అలా పెరిగి ఈ పద్దెనిమిదేళ్ళలో ఎంత దృఢమైంది ఆ ముద్ర..." ఆలోచిస్తోంది మనోరమ.

తండ్రి చితికిన మేనత్త సంసారానికి ఆసరా అయ్యేడు. అప్పోసప్పో చేసి సురేష్‌ను బాపట్లలో ఇంజినీరింగు చదివించేడు. రేపు మాఘమాసంలో తిరుపతి వెళ్ళి మూడు ముళ్ళూ వేయిద్దామనుకున్నారు. ఈలోగా అమెరికా వెళ్ళాలన్నాడు. ఖర్చులకు లక్ష రూపాయలు కావాలంటూ ఇంటి చుట్టూ తిరిగింది మేనత్త. ఊళ్ళో ఎవర్ని అడుగుదామన్నా వెయ్యా రెండు వేలూ కాదాయె. ఎక్కడ ధాన్యం అక్కడే ఉండి పచ్చనోట్ల చలామణే కష్టంగా ఉంది. ఉన్న కాస్త పొలమూ పోకూరు కోమట్ల దగ్గర తాకట్టు పెట్టి మూడు రూపాయల వడ్డీకి తెచ్చేడు. అది ఇప్పటికే తడిసి వడ్డీతో మోపెడైంది. లక్షరూపాయలు సర్దడం తనవల్ల కాదని చెప్పగానే కళ్ళనీళ్ళు పెట్టుకుంది మేనత్త.

ఏం మాట్లాడుకున్నారో ఏమో... రాత్రికిరాత్రి పెద్ద మునసబు కొడుకు లక్ష రూపాయలు సర్దేడని, అమెరికా వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు చేసేడని తెల్సింది. ఈ రోజు పొద్దున్నే సురేష్ అమెరికా వెళ్ళి పోయాడని కబురు – పద్దెనిమిదేళ్ళ మానసిక అనుబంధం లక్ష రూపాయలతో తీరిపోయింది.

"ఇన్నాళ్ళూ వాడి చదువుకు పెట్టిన ఖర్చుకు అణాపైసల్తో వడ్డీ కట్టి అబ్బాయి అమెరికా నుంచి పంపగానే తీరుస్తామని" సురేష్ తండ్రి అన్నట్లు ఊరంతా పుకారు.

అన్నీ గుర్తొచ్చి మనోరమ మధనపడ సాగింది.

"ఇలా ఎందుకు చేసేడు సురేష్. బాగా చదువుకున్న వాడు. అన్నీ తెలిసిన వాడు. తనంటే ఎంతో ఇష్టమనుకునేది. చిన్నప్పటి నుంచి తనకు లెక్కలు రావనీ, లెక్కలు రాకపోతే చదువులో చాలా కష్టమనీ, తనకు కష్టపడి లెక్కలు నేర్చుకొమ్మని చెప్పేవాడు. సురేష్‌ను తననుంచి దూరం చేసిన లెక్కల గురించిన ఆలోచనలో పడింది మనోరమ.

మెల్లిగా ఆమెకళ్ళు మూతలు పడసాగాయి.

★ ★ ★

లక్ష్మయ్య మంచమ్మీద కూర్చుని ఆకాశం వైపు చూస్తున్నాడు.

ఆయనకు భవిష్యత్తు అంతా చీకటిగా కనబడుతోంది. తన చుట్టూ జరుగుతున్న విషయాలేవీ అంతు చిక్కడం లేదు. మేనల్లుడు తన కూతుర్ని కాదని వేరే సంబంధం స్థిరపరుచుకుని ఎగిరిపోయేడు. ఎటు చూచినా అప్పులు... వెనక ఎదిగొస్తున్న పిల్లలు... ఆయన మదినిండా ఎగతెగని ఆలోచనలు....

"కూతురి పెళ్ళి చేయగలనా... మగపిల్లలకు ఏదో ఒక దారి చూపించగలనా" సుజాత అన్నట్లు తెలిసో తెలీకో తన బిడ్డలకు అన్యాయమే జరిగింది. వ్యవసాయం చేసీ లాభం లేదు. పెట్టుబడులు, ఊర్నిండా అప్పులు తప్ప పైసా వెనక్కి చూడటం లేదు. ఈ పరిస్థితులన్నిట్నీ భవిష్యత్తులో జయించగలనా? గుండెనిండా దుఃఖం... సమాధానం లేని ప్రశ్నలు...

మళ్ళీ మంచంమ్మీంచి లేచేడు. ధాన్యం పురి చుట్టూ ఒక చుట్టు తిరిగేడు... పుగాకు బ్యార్నీ పొయ్యిని చేత్తో తడిమేడు. మళ్ళీ బ్యార్నీ చాటుకు వెళ్ళేడు. మనోరమకు మాగన్నుగా నిద్రపట్టింది. సుజాత కళ్ళు తెరిచి మనోరమ మంచం వైపు లక్ష్మయ్య మంచం వైపు చూచి ఉలిక్కిపడింది. అప్పటికే లక్ష్మయ్య పురుగు మందులు పూడ్చి పెట్టిన దగ్గర పుల్లతో గుంతను తవ్వేడు. ముంగాళ్ళ మీద కూర్చుని మందు డబ్బాలు పైకి తీసేడు. ఒక్కో డబ్బాను రెండు చేతుల్తో ఊపి చూస్తూ ఖాళీ డబ్బాల్ని పక్కన పడేస్తున్నాడు. పురుగు మందు వున్న డబ్బా మూత తీసేడు.

సుజాత వెళ్ళి గభాల్న లక్ష్మయ్య చెయ్యి పట్టుకుంది. "నువ్వొక్కడివే తాగితే ఎట్టయ్యా! నా గొంతులోనూ, నా బిడ్డల గొంతులోనూ కాస్త పొయ్యి. సస్తే అందరం కలిసే సద్దాం. మళ్ళీ బతికున్నోళ్ళ ఉసురు నీకెందుకు" అంటూ లక్ష్మయ్య చేతిలోని మందు డబ్బాను విసురుగా లాక్కుని దూరంగా పారబోసింది.

లక్ష్మయ్య లేచి నిలబడి నిలువెల్లా దుఃఖంతో వణుకుతున్నాడు. కాళ్ళు కంపిస్తుంటే నడక తడబడుతోంది. ఏదేదో గొణుక్కుంటూ చిన్న పిల్లాడిలా మెల్లిగా ఏడవడం మొదలు పెట్టేడు. పొంగి పొరలే దుఃఖం... మెల్లిమెల్లిగా కన్నీరై ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

"ఏడవ బాకయ్యా! గమ్మునుండు.. అపరేత్రి.. ఎవురన్నా చూస్తే బాగుండదు. ఇంట్లో పెళ్ళీడు కొచ్చిన బిడ్డుంది. నలుగుర్లో వెలితి పడతాం. అయినా నీ భ్రమగానీ, ఇంతబతుకూ బతికి ఒక్కగా నొక్క బిడ్డ పెండ్లి చెయ్యలేకపోతామా? పిల్లలకు రెక్కలియ్యకపోతామా? మనకు రెక్కలున్నై గదయ్యా. ఈమాయదారి సేద్యం కాకపోతే కూలి చేసైనా బతికిచ్చుకోమా బిడ్డల్ని. పదపద. ఇట్టాంటి ఆలోచన ఇంకెప్పుడూ చెయ్యబాక" అంటూ లక్ష్మయ్య రెక్క పట్టుకుని లాక్కువచ్చి మంచమ్మీద కూర్చోబెట్టింది. మనోరమ జరిగింది చూచి నిశ్చేష్టురాలై మంచమ్మీద కూర్చునుంది. మగపిల్లలిద్దరూ మంచి నిద్రలో వున్నారు. సుజాత ఖాళీ అయిన మంచినీళ్ళ చెంబు తీసుకుని ఇంట్లోకి వెళ్ళి నీళ్ళు తెచ్చి లక్ష్మయ్య నోటికందించింది. పక్కనే కూర్చుని నీళ్ళు తాగేక గుండెల మీద అరచేతుల్తో మృదువుగా రాసింది. కాస్సేపటికి లక్ష్మయ్య తేరుకున్నాక వామిలోంచి బర్రెగొడ్లకు గడ్డి దూసి వేసొచ్చి తనే మంచం కాళ్ళకట్టమీద కూర్చుంది.

"అమ్మాయ్! నువ్వు పడుకో" అంది కూతురితో.

గుడ్లగూబ మిడిగుడ్లేసుకుని చూస్తూనే ఉంది.

జెముడు కాకి అలసట లేకుండా అరుస్తూ చెట్టు చుట్టూ గిరికీలు కొడుతూనే ఉంది.

బర్రె గొడ్లు మేతమెయ్యకుండా నిలబడి మోరలెత్తి భయంభయంగా చూస్తున్నాయి.

ఇంతలో హఠాత్తుగా ఉరుము ఉరిమినట్లుగా శబ్దం... ఆకాశాన కాకుండా భూమి మీద ఉరిమిన సవ్వడి...

ఉత్తరం వైపు నుండి దక్షిణం వైపుకు దదదడమని భూమి కదిలిన జలదరింత... పుడమి తల్లి పటపటమని ఒళ్ళు విరుచుకున్న శబ్దం...

లిప్తకాలంలో మంచాలూ, పందిరీ, ఇల్లూ, గోడలు... సమస్త భూమండలమూ కంపించిన అదురుబాటు –

ఇంట్లోని అటకమీంచి వస్తువులు దదదడమని జారిపడిన శబ్దం... ఇంటిముందు కట్టేసున్న పశువులు కట్టుగొయ్యల్ని తెంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నం... కోళ్ళు, పక్షులు, జంతువుల అకాల అరుపుల కోలాహలం...

"దీని మొదులార! నేల తిమ్మిరి గామాల, గుండె గుభేలు మనిపించింది. ఏడ ఏ అట్టడుగు పొరల్లో పుట్టిందో, ఏ పాతాళాన కదలబారిందో, ఊడంతా వణికించింది. అయ్యోవ్! పిల్లోడి మీద చెయ్యి వెయ్యి దడుచుకుంటాడు". అంటూ సుజాత గభాల్న లేచి వెళ్ళి పెద్ద కొడుకు మీద చెయ్యివేసింది.

మనోరమ వైపు తిరిగి "అమ్మాయ్! భయపడమాక! నేల తిమ్మిరేలే! మనల్నేం చెయ్యదు" అంది

లక్ష్మయ్య కొడుకు తలమీద చెయ్యివేసి మెల్లిగా నిమిరి సుజాత వైపు ధైర్యంగా చూచేడు.

ఆ రాత్రి నిద్రలో వున్న వాళ్ళెవరూ భూకంపం వచ్చింది గమనించనే లేదు. మాగన్నుగా మేలుకుని వున్న వాళ్ళు కూడా ఆ ప్రకంపనల్ని గుర్తించనే లేదు.

లక్ష్మయ్య, సుజాత, మనోరమ లాంటివాళ్ళు మాత్రం ఆ భూకంపాన్ని గుర్తించి అప్రమత్తులయ్యేరు. ★

అండీ.. ఏమండీ..!

కొండబాబు

పాతకాలంనాటిదైనా, విశాలంగా ఉన్న ఆ పెంకుటిల్లు కొత్త సున్నంతో, తోరణాలు, మామిడాకులతో కళకళలాడుతూ ఉంది. ఇల్లంతా చుట్టాలూపక్కాలతో హడావిడిగా ఉంది. ఆ ఇంటివారైన విశ్వనాథం, అన్నపూర్ణమ్మల మూడో మనవరాలి పెళ్లి మరి. ఎవరెవరో ఏవేవో వరసలతో పలుకరించుకుంటున్నారు. గేలి చేసుకుంటున్నారు. ప్రేమ ఒలకబోసుకుంటున్నారు.

ఇంటిముందు ఆగిన ఆటోలోనుంచి శంకరంబాబు దిగాడు. అతన్ని చూడగానే పిల్లలంతా కేరింతలు కొడుతూ " హేయ్.. బావొచ్చాడు.." అంటూ అరిచారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న సరిగమ అయితే వెంటనే పాటందుకుంది.

"రండి.. రండి.. రండీ..దయచేయండీ.. మీ రాక మాకెంతో సంతోషం సుమండీ.."శంకరంబాబు నవ్వుకుంటూ, పిల్లల బుగ్గలు గిల్లుతూ లోపలికి అడుగుపెట్టాడు. పెద్దవదిన కనక ఎదురొచ్చింది. " ఏమండీ.. శంకరంబాబు వచ్చాడు" అంటూ భర్తకు అరిచి చెప్పింది.

"ఏమండీ.. అండీ కావాలి పప్పు నానబాయడానికి ఎక్కడుందీ?" అంటూ అడిగింది వంటామె అప్పుడే కనక వద్దకు వస్తూ.

"అక్కడే ఉంది సరిగ్గా చూడు.." అంటూ "ఏమండీ.. మిమ్మల్నే" అంది మళ్లీ భర్తతో.

"సరేలే ఒదినా, అన్నయ్య ఏదో పనిలో ఉన్నట్లున్నాడు.. ఎలా ఉన్నావు?" అని పలుకరించాడు.

"బాగున్నాను శంకరం" అంటూనే వరండాలోకొచ్చిన చినమామగారిని పలుకరించింది. "మామయ్యగారూ ఎలా ఉన్నారండీ.." అంటూ.

★ ★ ★

"ఏమండీ.. ఏమిటీ..? ఈ పెళ్లి సందడి" అంటారా? అక్కడే ఉందండీ మన సంగతి. పెళ్లిలోనే కాదు..ఎక్కడ ఏ ఇద్దరు తెలిసిన వాళ్లు తారసపడినా గౌరవంగా పలుకరించుకునేపద్ధతి " ఏమండీ బాగున్నారా?" అని. ప్రస్తుతం మన చర్చనీయాంశం 'ఏమండీ' పదం గురించి. ఈ "ఏమండీ" అంటే ఏమిటి? ఎందుకు దీనిని వాడుతున్నాం? ఎక్కడి నుంచి ఈ పదం వచ్చింది?

ఏమి+ అండి= ఏమండి

'ఏమి' అంటే సరే 'ఏమిటి?' అని. మరి 'అండి' ఏమిటండీ అంటారా అక్కడకే వద్దాం. ఈ 'అండీ' పదం ఏమిటో, ఎప్పుడు వ్యవహారంలో చేరిందో చూద్దాం. శబ్దరత్నాకరకారుడు ఈ అండీ పదానికి గుండిగ, గంగాళమని పాత్ర విశేషంగా అర్థం చెప్పాడు తప్ప సంబోధనార్థకమని చెప్పలేదు. పై సంభాషణలో వంటామె ఆ అర్ధంతోనే మాటాడింది. మనకు సంబోధన వాచక ప్రత్యయాలు'ఓ, ఓరి, ఓసి' ఇలాగే ఉన్నాయి. గ్రంథాలలో 'ఓ రామా, ఓరివెధవా, ఓసి లక్ష్మీ' అనేవే ఉదాహరణలు. ప్రాచీన వైయాకరణుడైన కేతన సంబోధన విభక్తి ప్రత్యయాలు ఆ, ఆరా అని చెప్పాడు. ఓ అనే ప్రత్యయం విడిగా చెప్పకపోయినా, 'ఓ పురుషోత్తమ!' అంటూ ఉదాహరణ ఇచ్చాడు. ఉకారాంత పదాలు సంబోధనలో దీర్ఘాలవుతాయన్నాడు. సంబోధన వాచకంగా 'అండీ' అనే పదంగాని ప్రత్యయంగాని చెప్పలేదు. కావ్యాలంకార చూడామణికారుడు గాని, ఛందో దర్పణకారుడు గాని, చివరకు ఆంధ్ర శబ్ద చింతామణికారుడు కూడా 'అండి' గురించి చెప్పలేదని తిరుమల రామచంద్ర కూడా పేర్కొన్నారు. కానీ నేడు 'అండీ' అని అనకపోతే అవమానంగా భావిస్తున్నారు. మరి ఈ 'అండీ' పదం నడమంత్రంగా వచ్చిందా? వచ్చి పాకిపోయిందా?

శబ్దరత్నాకరకారుని కాలంలోనే ఈ 'అండీ' ప్రయోగం వ్యవహారంలోఉంది. అండీ ప్రత్యయం మూలమేమిటని వెదుకుతూ పోగా, ఇది క్రియారూపాలలో అర్థాంతరంలో మనకు సాక్షాత్కరిస్తుంది. లోట్ మధ్యమ పురుష బహువచన రూపంలో, 'చేయుఁడు', 'చేయుండు', 'తినుఁడు', 'తినుండు'; 'కొనుఁడు', 'కొనుండు'; 'వినుఁడు', 'వినుండు' - మొదలైనవి కనిపిస్తాయి. ఇది గౌరవపూర్వక సంబోదనార్థకమైన 'అండి'కి మూలమై ఉంటుందని పిస్తుంది; ఈ ప్రత్యయం క్రమంగా సంబోధనలో పాతుకుపోయివుంటుంది. ఉదాహరణకు తిను ధాతువును తీసుకుందాం. 'నీవు తినుము'-ఇది లోట్ మధ్యమ పురుష ఏకవచనం. 'మీరు తినుఁడు'/ 'మీరు తినుండు' - ఇది లోట్ మధ్యమ పురుష బహువచనం. ఇలాగే 'చేయుఁడు', 'చేయుండు'; 'పొమ్ము', 'పొండు'; 'రమ్ము', 'రండు'-ఇలా లోట్ మధ్యమ పురుష బహువచన ప్రత్యయమైన డు,ండు ఎదుటి వారిని మర్యాదగా కోరడం గనుక, బహువచన ప్రత్యయాలన్నీ మర్యాదను తెలిపేవి గనుక, సంబోధనలోనూ గౌరవ వాచకాలుగా మారిపోయాయి. ఈ డు,ండు అభ్యర్థనార్థకంలో 'ఈ'తో కలిసి 'చేయుఁడీ', 'చేయుండి'; 'వ్రాయఁడీ', 'వ్రాయండీ'; 'పొండు', 'పొండీ' ఇత్యాదిగా వ్యవహారంలోకి వచ్చాయి. అంటే లోట్ మధ్యమ పురుష బహువచనంలోని ఁడు, ండు, ండీలు క్రమంగా లోట్ మధ్యమ పురుష ప్రయోగం నుంచి విడిపోయి సాధారణ సంబోధన వాచకాలుగా గౌరవార్థంలో వాడుకలోకి వచ్చాయి. ఏమండీ, ఎందుకండీ, చాలండీ, నిలవండీ, నిజమండీ.. ఇలా.తెలంగాణా, రాయలసీమ జానపద వ్యవహారాలలో తమిళనాడులో స్థిరపడిన తెలుగువారి వ్యవహారంలోనూ లోట్ మధ్యమ పురుష బహువచన రూపం నేటికీ-'పదుండ్రి', 'చేయుండ్రి', అనే ప్రయోగాలు ఉన్నాయి.

నేటి వ్యవహారంలో 'ఏమండీ..' అంటూ 'ఏమి' అనే పలుకరింపు చేర్చి వాడుతున్నాము. 'అండి' ఇలా వచ్చిందండి. ★

పాఠక స్పందన

ఎంతగానో ఆకట్టుకుంది

నవంబర్ 4 ప్రజాశక్తి ఆదివారంలో టూరిస్ట్ గైడ్ శీర్షికన ప్రచురించిన 'ప్రకృతి అందాలకు నిలయం సింహాచలం' వ్యాసం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 28వ తేదీ అనుబంధంలో ప్రచురించిన 'మనోహర శిల్పాల మహేశ్వరం' కూడా చాలా బాగుంది. మహేశ్వరంలోని శ్రీరాజరాజేశ్వరీ దేవాలయం గురించి చక్కగా తెలియజేశారు.

- పుట్టా శ్రీనివాసరావు, లక్కవరపుకోట, విజయనగరం జిల్లా

మెదడుకు పదును పెడుతున్న మాటలకోట

వారం వారం ప్రచురించే బాలనేస్తాలు శీర్షికలోని మాటలకోట కింద ఇస్తున్న తెలుగు పదాలు మా మెదడుకు పదును పెడుతున్నాయి. అలాగే ఈ వారం ప్రచురించిన కవర్ స్టోరీ చాలా బాగుంది. పలుకుబడి శీర్షికలో మంచిపదాల గురించి చక్కగా వివరిస్తున్నారు. ఆరోగ్యం శీర్షికన ఎంతో ఉపయోగకరమైన విషయాలు తెలియజేస్తున్నారు. అందరినీ కడుపుబ్బ నవ్వించే జోక్స్ కావాలి.

- బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూర్ గ్రామం, నెల్లూరుజిల్లా

జాతీయ పురస్కారం గర్వకారణం

నవంబర్ 4 ఆదివారం అనుబంధం కళాసాహితి పేజీలో ప్రచురించిన పుట్టపాకకు మరో జాతీయ పురస్కారం రావడం చాలా గర్వకారణం. ఇండోనేషియా ట్రైబల్ డిజైన్ టై అండ్ డై ఇక్కత్ దుప్పటికి జాతీయ చేతివృత్తుల అవార్డు రావడం ఆనందదాయకంగా వుంది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

ఆద్యంతం చదివించింది

28-10-2001 ఆదివారం అనుబంధంలోని కవర్ స్టోరీ 'సుస్వరానికి సుమహారం' ఆద్యంతం చదివించేదిగా వుంది. మనలోమాట శీర్షికలోని 'వృత్తి-ప్రవృత్తి' ఆలోచింపచేసేదిగా వుంది. డాక్టర్ సలహాలు ప్రచురిస్తున్నందుకు కృతజ్ఞతలు. దశతిరిగింది కథ ఎంతో ఆనందపరిచింది.

- వాకిటి వెంకటేశం, నల్గొండ, **ఆనందగజపతిరావు**, తెట్టంగి, శ్రీకాకుళం జిల్లా,
- పి.ఎస్.ఎస్.కిరణ్, రామచంద్రాపురం, తూ.గో.జిల్లా,
- ఎస్.సి.రావు, డి.లలితమ్మ, కె.రేవతిదేవి, ఎస్.శ్రీదేవి, మల్లంపేట, విజయనగరం

వెల్లటూరి పూర్ణానంద శర్మ

A SCHOOL WITH A DIFFERENCE

A Symbol of Integrity & Values

MAHABUBNAGAR
GRAMMAR SCHOOL

ENGLISH MEDIUM - RESIDENTIAL

Bhageeratha Colony, Bhoothpur Road, Mahabubnagar, A.P., Ph : 08542-41474, 55973.

Objective is Wholesome Development

Philosophy is Love and Affection

Methodology is just Hard Work

SALIENT FEATURES

- Special attention to each student
- Ideal student-teacher ratio
- Close parental interactions
- Computer education form KG
- Spoken English Classes
- Quality training for Sports
- Thorough monitoring

P. Balakrishna Reddy
Founder-Chairman

P. Indrasena Reddy
Secretary

Dr. G. Ramesh Babu
Executive Director

SPONSORS :

SURAVARAM PRATHAPA REDDY MEMORIAL EDUCATIONAL SOCIETY